
పత్రిక



ఉగాది ప్రత్యేక

29-3-63


20s
24s
26s
హాంక్సు
S.A.T. LTD
కోను
40s
60s
80s


ఉత్తమశ్రేణికాఫీ విత్తనముల సేకరణ, నైపుణ్యంతో మేలువిత్తనాల మొలకింపు
ఉత్పత్తికాలంలో నిరంతరం ప్రతిఘట్టంలో జాగరూకత, పొడరుచేయుపద్ధతిలో
శాస్త్రీయతవలన శ్రేష్ఠతలో ఆంధ్రా కాఫీది అగ్రస్థానం.
Fresh Fragrant & Delicious
ANDHRA Coffee
Quality is our Motto
అనుదినజీవితంలో అసంఖ్యాకులకు
ఆనందప్రదాయిని
ఆంధ్రా కాఫీ
ఎల్లప్పుడు కొనండి.
G. V. RAO
ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ,
హెడ్డాఫీసు:-బ్రాడీపేట గుంటూరు.
బ్రాంచీలు:-బ్రాడీపేట, పట్నంబజారు (గుంటూరు) బాపట్ల, నర్సరావుపేట, సత్తెనపల్లి, హైదరాబాదు.

ఉత్తరాలు

ముఖచిత్రం

15—3—63 నాటి ముఖచిత్రం చూడ సొంపుగా యున్నది. మనస్సు యమునా నదీ తరంగ డోలికలలో విహరించినట్లుంది. అందాల తార జమున నందించిన మీరు అభినందనీయులు.

లలిత (పురుషోత్తమపట్నం)

* * *

ఈ వారం ముఖచిత్రం నటి నిప్పాణి జమున ఎంచక్కా శోభాయమానంగా ఉన్నది. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న జమున ముఖచిత్రం ఈనాటికి అనుకోకుండా సాక్షాత్కరించడం ఆశ్చర్యమే మరి.

కె. పి. భాస్కర్ (బందరు)

* * *

జమున వీణ వాయిస్తున్న ఫోటో చాలా అద్భుతంగా ఉన్నది.

జి. అలివేలు మంగతాయారు (పెదపాడు)

* * *

ఈవారం (1—3—1963) లో నా అభిమాన నటుడు శ్రీ ఎన్. టి. రామారావు" గారి ముఖ చిత్రం చూడ ముచ్చటగా యుంది.

జి. వీరాస్వామి (ఎయిర్ ఫోర్సు)

కథలు

బొంబాయి ఆంధ్రమహాసభ (రెండవ) బహుమతి పొందిన "జితులా — పరాజితులా" చాలా బాగుంది. కథాగమనం చివర వరకూ బిగువు చెడకుండా, ఎంతో భావగర్భితంగా జరిగింది.

చంద్రశేఖరం (నారంపేట)

* * *

బొంబాయి ఆంధ్రమహాసభ కథల పోటీలో మూడవ బహుమతి పొందిన 'విధిబలి' అను కథ చదివినాను. ఈ కథ నన్ను బాగుగా ఆకర్షించినది. కథలో ఆనంద్ అన్నగారికి వ్రాసిన ఆఖరి లేఖ చదివినపుడు నేను కన్నీరు కార్చాను. ఇటువంటి కథను మా (మీ) పత్రికలో ప్రచురించినందులకు నా హృదయపూర్వక ధన్యవాదములను తెలుపు కొనుచున్నాను.

కృష్ణ (కోయంబత్తూరు)

* * *

బొంబాయి ఆంధ్రమహాసభ రెండవ బహుమతి పొందిన జితులా—పరాజితులా కథ చాలా బాగుంది. మిగతా కథలు కూడా ఇలాగే రసవత్తరంగా ఉంటాయని తలుస్తున్నాను.

చిత్తజల్లు బాబూరావు (ఆయితంపూడి)

* * *

ఈ వారము అనగా 15—3—63 తేదీన ప్రచురించిన కాలచక్రము' బాగుంది. అక్కడక్కడ కొన్ని విషయాలు చాలా బాగున్నవి. ఈ కథ వ్రాసిన వారి పేరు 'రమ' అని తెలిపినారు. దయచేసి పూర్తి అడ్రసు 'రమ'ది పంపగలరని ఆశించుచున్నాను.

వి. సుబ్రహ్మణ్యం (అనంతపురం)

తెరమీద - తెరవెనుక

నా అభిమాన తార కుమారి జమున పరిచయం చదివి చాలా ఆనందించాను. విరాజీగా రడిగిన ప్రశ్నలకు ఆమె యిచ్చిన జవాబులు చదువుతూంటే, నిజంగా ఇంత నిర్మొహమాటంగా జవాబులు యిచ్చిందా అని ఆశ్చర్యపోయాను. రాధాకృష్ణన్‌గారు తీసిన ఫోటోలు చాలా బాగున్నాయి.

వి. బాలకేశవులు (నంద్యాల)

మరువలేని మనిషి

15—3—63 వారపత్రికలో 'మరువలేని మనిషి' శీర్షికలో మరువలేని జంతువు ప్రవేశించిందేమిటండీ ?

ఆ. నరసింహమూర్తి (నాగపూర్)

రాజధాని కబుర్లు

నిత్యం ప్రచురింపబడుతున్న "రాజధాని కబుర్లు" చాలా బాగుంటున్నది. ముఖ్యంగా బంగారం బాండ్ల గురించి వ్రాసిన వ్యాసం; 15—3—63 సంచికలోని "భిక్షాధికార్ల మయమయిన భాగ్య నగరం' అనే వ్యాసం వాస్తవానికి చాలా దగ్గరగా ఉండి, మాబోటి మధ్యతరగతి ప్రజల అభిప్రాయానికి ప్రతిబింబంగా ఉంటున్నాయి.

పురాణం వెంకటేశ్వర్లు (హైదరాబాదు)

* * *

నాటక కళాపరిషత్తు అధ్వర్యాన జరిగిన నాటకాల గురించి శ్రీ ఐ. ఎల్. ఎన్. గారు రాజధాని కబుర్లలో ఒక క్రొత్త విషయాన్ని ప్రస్తావించారు. సినిమాలకు ఉన్నట్లు నాటకాలకు కూడ సెన్సారు పద్ధతి లేదు కదా ! అన్నారు. ఉంటే బాగుండునేమో అనే ధ్వని దానిలో కనబడుతుంది. ఆ సెన్సారు పని పరిషత్తు సభ్యులే జాగ్రత్తగా నిర్వహిస్తే, పేచి ఉండదు. నాటికల ఎన్నికలో ప్రదర్శన విలువలు, నటనా ప్రతిభలతోపాటు ప్రతిపాదించిన కథా వస్తువును కూడా గణనకు తీసుకోవాలి. అటువంటి జాగ్రత్త తీసుకొని ఉంటే, కొన్ని నాటకలు రంగస్థలం ఎక్కివి కాదేమో అనిపిస్తుంది. పరిషత్తు స్థాయి ఇంకా దిగజారిపోకుండా ఉండాలంటే, ఇటువంటి విషయాల్లో జాగ్రత్త తీసుకోవలసిన అవసరము ఎంతైనా ఉంది.

ఈ విషయాన్ని నిర్భయంగా చాటిన శ్రీ ఐ. ఎల్. ఎన్. గార్ని అభినందిస్తున్నాను.

సి. హెచ్. శ్రీరామమూర్తి (హైదరాబాదు)

* * *

8—3—63 పత్రికలో రాజధాని కబుర్లు శీర్షిక 'ఆంధ్ర నాటకరంగం' గా వెలువడినందులకు మీకు నా ధన్యవాదములు. ఆంధ్రులు అందరు అందలి అశేష విశేషములను అవగాహన చేసుకున్నయెడల నాటకరంగమునకు జీవకళ ఎట్లు తేవలయునో అర్థమగును. ముగింపులో శ్రీ ఐ. ఎల్. ఎన్. గారు వ్రాసిన, "అప్పుడే జీవకళ కనిపిస్తుంది; లేకపోతే వట్టికలే !" అనే మాటలు మరువరానివి.

జి. ఎమ్. స్వామి (కేశవరాయుని పాలెం) ★


అన్నపూర్ణా వారి
చదువుకున్న అమ్మాయిలు
నిర్మాత డి. మధుసూదన రావు B.A.
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు
సంగీతం రాజేశ్వర రావు
నవయుగ విడుదల

ఆంధ్రసచిత్రవార పత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం: 29—3—63
శోభకృన్నామ సం॥ చైత్రమాసం॥ శుద్ధ॥ పంచమి
సంపుటము : 55 సంచిక : 30
స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా
వివరాలు

ఇండియా రూ. 13.00 ఇతర దేశాలు: ఓడమీద Sea Mail రు. 20.00. (విమానం ద్వారా Air Mail) బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు— రూ. 114.00. అమెరికా రూ. 176.50. ఆస్ట్రేలియా 135.00.)

*

విడిప్రతి : 25 న.పై.
సంవత్సర చందా : 13-0-0.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7. తంబుచెట్టి వీధి, మద్రాసు-1



ఉగాది: బొమ్మ 'బాపు'

మనలో మాట

పాఠకులందరికీ ఉగాది శుభాభినందనలు!...

* * *

సినిమా వ్యాసరచన పోటీకి వచ్చిన వ్యాసాలు మొత్తంమీద అంత సంతృప్తికరంగా లేవు! ఎక్కువ మంది రచయితలు పోటీ ప్రకటన సరిగ్గా చదివినట్లు కనిపించదు అయినప్పటికీ బహుమతులు పొందిన మూడు వ్యాసాలూ బాగానే ఉన్నాయి అనుకుంటున్నాము. ప్రథమ ద్వితీయ బహుమతులు పొందినవారి ఫోటోలు



మొదటి బహుమతి
శ్రీ జి. వెంకట్రావు.



రెండవ బహుమతి
శ్రీ ఆ. దుర్గాప్రసాద్.

ఇక్కడ వేస్తున్నాము. తృతీయ బహుమతి గెలిచిన శ్రీమతి కె. సరోజిని ఫోటో ఈ సంచిక ముద్రణకు వెళ్లే సమయానికి అందనందువల్ల వచ్చే సంచికలో వేయగలమని ఆశిస్తున్నాము.

* * *

ముఖచిత్రాలలో కొత్తదనం లేదని నిరాశచెందేవారికి ఈ సంచికలో ప్రకటించిన 'ముఖచిత్రం' పోటీ కొంత సంతోషం కలిగించవచ్చు! ఫలితాలూ సంతోషకరంగా ఉంటాయని మేమూ ఆశిస్తున్నాము.

* * *

ఒక విధంగా ఇది ప్రత్యేక సంచిక కాబట్టి 'తెరమీద తెరవెనుక' శీర్షిక ఈ వారం వెయ్యటం లేదు. వచ్చేవారం ఈశీర్షిక ఎవరిని గురించి ఉంటుందో ఈ సంచికలోనే మరొక చోట సూచించాము...


* * *

23 వ పేజీలో శ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావుగారి వ్యాసం ఒకటి వేశాము. ఇది అనుకోకుండా, ఈ సంచిక ప్రారంభం అయిన తర్వాత మా కార్యాలయానికి వచ్చింది! అందువల్లనే పోయినవారం సంచికలో తగిన ప్రకటన పడలేదు...

* * *

15-3-63 సంచికలో సీతల చాటున చుక్క కుమారి జమున. ఈ రూప విచిత్రాన్ని మెచ్చుకుంటూ ఎందరో పాఠకులు వ్రాస్తున్నారు...

విషయానుక్రమణిక



నిరంతర సంగరం
ప్రతిపక్షం దాడి
కాంగ్రెస్ పక్షీయుల 'పోరు'
ఆంధ్రప్రదేశ్‌లో మద్య నిషేధం
చాల్లేవయ్యా! నీ మాయమాటలు!
పైగా బెదిరింపులు గూడాను!
పశ్చిమదేశాలలో పొత్తు
శ్రీ కౄశ్చేవ్ పాశ్చాత్య
వంటకాలరుచి మరుగు
తున్నారట!
ఉప ఎన్నికలలో కాంగ్రెసును బలపరిచే నిర్ణయం
కమ్యూనిస్టు పార్టీ

శ్రీకృష్ణ

దేశభక్తికి చిహ్నంగా మారిపోయిన పన్నుల భారం

శ్రీ మొరార్జీదేశాయి ప్రతిపాదించిన పన్నులే ఈవారం న్యూఢిల్లీలో నలుగురి నోళ్లలోనూ నలుగుతున్న విషయం. చైనావాళ్లు, కాంగ్రెసు సిద్ధాంతాలు, ప్రణాళికా సంఘం— ఈ శక్తిత్రయం పుణ్యమాని భారతదేశం తన ప్రజల అజ్ఞానాన్ని ఆధారంగా ప్రబలుతున్న నియంతృత్వశక్తిని ఇప్పుడిప్పుడే కొత్త కొత్తగా రుచి చూస్తున్నది.

చైనీయుల మూర్ఖపు దురాక్రమణవల్ల ఈ దేశంలో ఆవరించిన చాలా భ్రాంతి తెరలు తొలగిపోయాయి. సైనికబలం లేకుండ అభ్యుదయసిద్ధి అనేది అలాంటివాటిలో ఒకటి. ఈ దేశ చరిత్రలో ఇలాంటి అభిప్రాయమే అత్యంత అవమాన హేతువు. 1857 కు పూర్వం నుంచి కూడా భారత ఆర్థిక స్థోమతే గాక, సైనిక బలహీనత కూడా జనానికి తెలిసింది. అందువల్లనే అలెగ్జాండరు మొదలు అనేక విదేశీ దురాక్రమణలకు మన దేశం గురైంది. పైగా 1947 నుంచి, మన దేశం ప్రపంచంలోని వివిధ దేశాలకున్న శక్తులు నాదిర్షా దండయాత్రలాంటిదాని తిరిగి ఏర్పడనీయటానికి వీలులేనంత బలంగా ఉన్నాయని అపోహ పడింది. చైనీయుల దురాక్రమణ ఈ మబ్బు తెరను మటుమాయం చేసింది. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి గత పదిహేనేళ్లుగా అరక్షణీయంగా ఉన్న తన రక్షణశక్తిని వీలైనంత శీఘ్రంగా సమీకరించుకుంటోంది. ఈ మహత్కార్యం కోసమే ఇప్పుడు మన నెత్తిన ఏనుగ బరువు పన్నులు.

వెనకటికి ఓ ఫ్రెంచి సామెత ఉంది. ఎంతటి అందగత్తె అయినా, ఇచ్చే ఆనందానికి ఓ అవధి ఉంటోందని. అలాగే దేశంకూడా కాని ప్రణాళికా సంఘానికి ఈ సూక్తిలో నమ్మకం లేనట్లుంది. సాధారణ పౌరుడు పడుతున్న పడరానిపాట్లన్నిటికీ, కారణం మొండి పట్టుదలలో తన ప్రణాళికను కించిత్తయినా తగ్గించుకోని ప్రణాళికా సంఘమే!

ఈ త్రిమూర్తి పీఠంలో మూడోది కాంగ్రెస్ సిద్ధాంతం. ఈ భారతదేశం, మహాత్మాగాంధి పేరుతో అడ్డమైనదంతా నెత్తిన రుద్దుకోవాల్సిందే. ఊరికే చెప్పటంలేదు. సుమారు ఓ నలబై కోట్ల రూపాయలు మాత్రమే ఖాదీ సంఘం ఖర్చు చేస్తోంది! మద్యనిషేధం పేరిట మూటలకు మూటలు ఖర్చవుతున్నాయి. ఉప్పుమీద తిరిగి పన్ను వేయటం తెలియలేదో ఏంపాడో! అందువల్ల ప్రభుత్వానికి రాబడి తగ్గిపోతోంది. ఉప్పుమీద మళ్లీ పన్ను వేస్తే ధర పెరగటం జరుగుతుందని చెప్పారు. అసలింతకీ ప్రశ్నేమిటంటే, కిరసనాయిలు వాడకంలో పోలిస్తే, సాధారణ మానవుడు ఉప్పును ఎక్కువ ఉపయోగిస్తాడా లేదా అని. ఒకవేళ **పన్ను రెట్టింపు చేసినా, కొనుగోలుదారుకి కిరసన్** ధరలో పెరుగుదలతో పోల్చి చూస్తే ఉప్పే నయమని తృప్తి పొందుతాడు.

దేశ రక్షణశాఖ తన వాటాకు వచ్చిన ధనాన్ని సక్రమంగా వినియోగించుకో గలుగుతుందా అనేదే ఇప్పుడు ఎదురవుతున్న పెద్ద సమస్య అయితే తరువాత అనుభవం ఇంకోవిధంగా నిరూపించింది. డబ్బు ఎక్కువగా ఉంటే, రక్షణశాఖ సక్రమంగా వినియోగించుకోలేకపోతే ప్రభుత్వం ఆసొమ్ముకు రక్షణ విధానాలకేవిధంగానూ సంబంధం లేని పథకాల్లో ధనం దుబారా చేస్తుందని బుజువైంది.

విదేశీ ద్రవ్యమారకం ఇబ్బందులవల్ల రెండో పంచవర్ష ప్రణాళికలోని పనులను తగ్గించుకోవాల్సి వచ్చింది. ఆ కోతల్లో అన్నిటితోపాటు విద్యాశాఖ నిధులుకూడా ఉండటం, ఈ విషయాన్ని మర్చిపోయిన విద్యాశాఖ ఏకోపాధ్యాయ పాఠశాల బళ్ళు నెలకొల్పబోయి చేతులు ముడుచుకోవాల్సి రావటం జరిగింది. ఆ పొరపాటే మళ్లీ అలవాటుగా జరగవచ్చునని అంచనా.

రాజ్యసభలో బడ్జెటుపై వచ్చిన విమర్శలకు శ్రీ దేశాయి జవాబిచ్చిన తీరు చూస్తే, ఈ పన్నుల పట్ల వెల్లబుకుతున్న విమర్శలను ఏమాత్రం ఖాతరు చేయనట్లు మొండి కెత్తినట్లు కన్పించింది. కిరోసిన్‌పై వేయదల్చుకున్న పన్నును తగ్గించేందుకుగాను, తక్కువ మధ్యతరగతి ప్రజపై వేసిన ప్రత్యక్షపు పన్నుల రేటులో ముదరా ఇచ్చేందుకు కాని అవకాశాలు తక్కువని శ్రీ మొరార్జీదేశాయి వెల్లడించారు.

ఇప్పుడు వేసిన కొత్త పన్నుల వల్ల బీదవారికి కూడా చాలా బాధ కలిగేమాట వాస్తవమే నని ఒప్పుకుంటూ, దేశం అతి ప్రమాద స్థితిలో ఉన్నందున ఇవి అనివార్యమైనవని శ్రీ దేశాయి తెల్పారు. భారత దేశభక్తులు ఈ భారాన్ని చిరునవ్వుతో భరిస్తారని ఆయన నమ్మకట!

ఏమైనా రెండు విషయాలు మాత్రం ఎటూ తేలకుండా ఉన్నాయి. ఆర్థికశాస్త్రంలో ఉన్న అన్ని మార్గాలను ధనార్జనకు వినియోగించామని ఆర్థికమంత్రి చెప్పటంలో అంత నమ్మిక కల్పించటంలేదు. ఒకప్రక్క ఆయన రాజ్యసభలో సమాధాన మిస్తుండగానే, ఆయన సహచరుడు శ్రీ మెహర్‌చంద్ ఖన్నా, మంత్రులను తమ విద్యుచ్ఛక్తి బిల్లు నెలసరి రు. 250 — కి తగ్గించుకోమని చెప్పే ప్రయత్నంలో ఎలా విఫలమైందీ తెల్పటం జరిగింది. అంతటితో వూరుకోకుండా శ్రీ ఖన్నా, మంత్రులు ఇతర సామాగ్రిపైన ఎంత ఖర్చు పెడుతున్నదీ కూడా వివరాలతో తెలియ **పరిచారు! ఈ మంత్రిశేఖరులు పర్యటనకోసం ఎంత** ఖర్చు పెడుతున్నదీ, మొరార్జీకి ఆయన శాఖ చెప్తేనే బాగుంటుంది! ఒక ఉపమంత్రిని గూర్చి ఈ లేఖలో ఇదివర కొక తడవ, చెప్పానుగా! పదవిలోకి రాంగానే ఆయన బొంబాయి పూనా వెళ్లారు. అక్కణ్ణుంచి సరాసరి కాశ్మీర్ వెళ్లి కొత్త మెదడు చల్లబరచుకున్నారు. కొత్త ఋతువు మారగానే ఆ పర్యటన దక్షిణ దేశంలోని అజంతా, ఎల్లోరా, హైదరాబాద్, మద్రాస్ రామేశ్వరం, ఊటీ, తదుపరి నాగపూర్ మీదికి మళ్లింది. ఆ వెంటనే పశ్చిమ బెంగాల్, ఇండోర్‌లకు విహారం. ఆయన పుణ్యమాని వాళ్లావిడ దేశం సబ్బుతో దేశమంతా చూసేసింది. ఒకప్రక్క ఇలాంటి మహత్కార్యాల చిట్టాలతో శ్రీ దేశాయి, ప్రజల జీవన ప్రమాణాలలో కోతలూ, పొదుపు బోధించే బడ్జెటు ప్రతిపాదించారు! ఉదాహరణకు ఒకర్ని తీసుకుందాం.

గెజిటెడ్ రాంక్‌లో రెండవ తరగతి ఉద్యోగి ఒకరు నెలసరి రూపాయలు రు. 305 — సంపాదిస్తున్నాడనుకోండి. బడి చదువులు పిల్లలు ఓ యిద్దరు ముగ్గురుంటే, వాళ్ల జీతం, పుస్తకాలు వగైరాలకు సంవత్సరం రు. 103/— లు కర్పూరంలా అయిపోతుంది. పైగా ఇప్పుడీ బళ్లలోకి వెళ్లే మొగపిల్లలందరూ విధిగా నెలకు రెండు సార్లు 'క్రాపు' చేయించుకోవాలని ఆంక్ష పెట్టారట! కాలికి వేసుకొనే మేజోళ్లకు చిల్లులున్నా ఇద్దరు పిల్లల్ని బడిపిల్లల ముందర త్రిప్పారట! ఈ ఉద్యోగి తల్లిదండ్రులు ఏ మూల కుగ్రామంలోనో వుంటే వాళ్లకు కనీసం రు. 15/—అన్నా నెలకు పంపించాలి. మరి తనూ ఉద్యోగం ఒకటి ఆఘోరిస్తున్నాడు కనక కాస్త తెల్ల బట్టలు వేసుకోక తప్పదు! ఈ ఇబ్బందు లన్నిటినీ తనకు వచ్చే రు. 305 తోనే సరిపుచ్చుకోవాలి! ఖర్మంకాలి ఏదన్నా "జీతం తక్కువ" ఇలాంటి మాటలంటే అంతే! అతగాడు దేశభక్తుడు కానట్టే!

పోనీ నిర్బంధ పొదుపు పథకం విషయం చూద్దాం! పథకం అమలులో ఉన్న సాధక బాధకాల మాటటుంచి దాన్ని వ్యవసాయదార్లకు వర్తింప చేయటానికి సుతరామూ వీల్లేదని కాంగ్రెసు పార్లమెంటరీ పక్షం పట్టుబడుతున్నది. రేపు లాభసాటిగాని వ్యవసాయక్షేత్రాలను ఈ పథకం నుంచి

55—వ పేజీ చూడండి

హరివంశము

హారీత శివశర్మ

ఉజ్జయినీ పర్వం-16

స్నాతకమునకు మహారాజు ప్రత్యేకముగ పందిళ్లు వేయించెను. తాటియాకులతోటి పందిళ్లు వేయించెను. బ్రాహ్మణుల ఇండ్లలో స్నాతకమున కెన్ని సంబారములు సమకూర్పవలయునో నన్నియు సమకూర్చెను. సుదాముని తండ్రియు, తల్లియు పీటంమీద కూర్చుండిరి. మధ్య పుత్రుడును, ఇటు నటు వారుముగా కూర్చుండిరి. స్నాతకమున జేయ వలసి సర్వ వైదిక కర్మలును ఆచరింపబడినవి. పెండ్లికుమారుని స్వర్ణముతోడ నలంకరింపవలయు సమయము వచ్చినది. మహారాణి యా వేళకు తన మెడలోని యొక్క హారమును పంపినది. పెండ్లి కాబోవు సుదామున కిది యంతయు విచిత్రముగ నున్నది. అతని మనస్సు మనస్సునం దున్నట్లు లేదు. తాను బ్రహ్మచర్యమును వీడి గృహస్థు డగుటకు నిన్నియు జరుపబడుచున్నవి. ఈ బ్రహ్మచర్యమును తా నింతకాలము పాలించినాడు. ఇప్పు డది యేమగుచున్నది! తాను ఒక ఆశ్రమమును వీడి మరియొక యాశ్రమమున ప్రవేశింపబోవుచున్నాడు. అతని కది కష్టమో, సుఖమో తెలియ లేదు. మనస్సులో 'నేను కాశికి పోవుదును' అనుకొని నాడు. నా కీ పిల్ల నిష్టురు. ఆమెతో నేను కాపురము చేయవలెను. ఇది యంతయు అంతులేని సముద్రము. దానిని దరియుట కష్టమైన పని. కాశికి పోయి ఏ పదిమందికో చదువు చెప్పుకొని జీవింతును అనుకొనినాడు. అనుకొన్నదే తడవుగ కాళ్లకు తొడిగియున్న పాముకోళ్లతో, ఒక చేతిలోని గొడుగుతో, మరియొక చేతిలోని కర్రతో ఆ పెండ్లి కాబోవు నతడు పీటలమీదినుండి లేచి సభకు నమస్కరించి 'అయ్యా! సభవారు అనుమతించవలయును. నాకు ఈ సంసార మవిన ఏమో అనిపించుచున్నది. నేను కాశికి పోయెదను'' అని బయలుదేరినాడు. స్నాతకమునకు వచ్చిన బ్రాహ్మణు లందరును మందహాసము చేసిరి. ఆచార్య సాందీపనియు మెల్లన హసించెను. 'సుదాము! ఆచార్యాణిని పెండ్లి కాబోవు ముందు నాకును ఇట్లే యనిపించెను'' అనెను.

సుదాముడు నిజముగా పయనమాయెను. అట్టి యాచారము బ్రాహ్మణులయం దుండనే యున్నది. అప్పుడు పిల్ల నీయుతోయెడివారు వచ్చి, ''అయ్యా! మీరు కాశి పోవలయును. మా పిల్లను మీకిచ్చి పెండ్లి చేతుము. మీ రిచ్చుటనే సుఖముండుడు'' అందురు. స్నాతకుడైన వటుపందు కంగీకరించి ఆ ఇచ్చిన కన్యను పెండ్లియాడి గృహస్థగును. కాని సుదాముని పద్ధతి యట్లుగా లేదు. కాశికని నిజముగా ప్రయాణము కట్టినటులున్నది. అత డాచార్యుని మాటలు విని, ఇటు లనినాడు: ''ఆచార్య! తాము సంసారమును చూచి భయపడనివారు. ద్వంద్వములకు అతీతులు. నేను అట్లు కాదు. అది నాకు తెలియును. నన్ను కాశికకు పోనిండు'' అని నాడు.

ఆచార్య సాందీపని శ్రీకృష్ణదేవుని తిలకించెను. ఆయన కిది ఆశ్చర్య మనిపించినది. ఇంతకాలముగా నావాక్షిని పీని కితు మని యనుకొనుచున్నదే. అందుకు వాడును సమ్మతించెను. సంతోషమును గూడ పొందెను. పెండ్లియగుట కసమ్మతి నీత డెప్పుడును చెప్పియుండలేదు. మరి యిప్పు డిట్లు లేల చేయుచుండెను? ఆచార్యు డిట్లు లనుకొనెను. మరియు నిట్లు భావించెను: మనస్సు విచిత్రమైనది. అది యెప్పు డెట్టి వినిశ్చయమునకు వచ్చునో దానికే తెలియదు. మరి ఆ మనస్సు గల మానవుడిదియంతయు తా నాలోచించుచున్నట్లు భావించును. తా నాలోచన చేయుచున్నట్లు భావించును. ఆ భావించుటయు గూడ నా మనస్సుయొక్క లక్షణము. జాగరూకుడై యున్నప్పుడు, అనగా, మేల్కొని యున్నప్పుడు చేయు నాలోచనమును మానవుడు తానై చేయుచున్నా డనుకొనిన నంతగా దోషము లేదు. అట్లు అనుకొనును గూడ. కాని వాడు నిద్రపోయినాడు. ఆ నిద్రలో కల వచ్చినది. అప్పుడు మేల్కొనియున్నప్పటి జాగరూకత లేదు. తన్ను గూర్చి స్పృహయే తనకు లేదు. ఆ కలలోనే ఆలోచనము మనస్సులో జరుగును. నిద్ర లేచిన తర్వాత కలలో నిట్లు లనుకొంటిననుకొనును. మరియు నా ఆలోచనముల కాకలేదు. దానిని నియమించినచో యుండుట యున్నది. వీడు దానిని నియమించలేక, గార్హపత్యమువి నభయముతోడి యుండగా, వాని మన స్సట్లాలోచనము చేసినది. పెండిలి యిష్టమైనవాని యీ యాలోచన యేమి? జాగ్రదవస్థలో గనుక నిది జరిగినది. స్వప్నమందు గూడ నిట్టుల జరుగునా? స్వప్నమందు శరీరము లేదు; మనస్సున్నది. అనగా మనిషి లేడు. వానియందు నిహితమై యుండిన మన సున్నది. అది ఆలోచనము చేయుచున్నది. మరి మేల్కొనిన స్థితియందు మాత్రము శరీర మున్న దని యెట్లు! వ్యవహారమున నున్నది. పరమార్థమున లేదు. మనస్సున్నది. అది కలయందు యెట్లో, మేల్కొనినయప్పుడు గూడ నట్లే యాలోచనము చేయుచున్నది. అందుకే ఆలోచనము కల్గిన తర్వాత అది అట్లు వచ్చినదనిపించును. ఇప్పుడు సుదామున కట్లు ఆలోచనము వచ్చిన దనుకొన్నాడు ఆచార్యుడు. ఇటు లనినాడు:

''ఏమిరా! పెండ్లియన్న ముందులేని భయము ఇప్పుడు కల్గుచున్నది. గార్హపత్య మనిన నీ కేల ఈ భయ మేర్పడవలయును. నీవు నావద్ద చదువు కొంది; దాని నాచరణమున పెట్టుట యెట్లు! గృహపతి కావో, ధర్మమును నిర్వహించుట యెట్లు? పరులకు దానిని బోధించుట యెట్లు? బ్రహ్మచర్యమున నుండి యిది చేయరాదా అందువు! ఓరి! సుదామ! బ్రహ్మచర్యము జీవితమునం దొక యవస్థ. అది ఏకదేశము. అందున కల్గు జ్ఞానమును ఏకదేశము. మరియు అతిథిపూజ యున్నది; అది గృహపతి జరుపవలయు నట్టిది. అగ్ని యున్నది. దానిని వటువవై జీవితమంతయు నారాధింతువా! లోకమంతయు నీవలె నైనచో గార్హపత్యాగ్నికి ఇక సంస్కారము చేయువారే యుండరు. ఒక్కడు గృహమేధి యేల కావలయు నందువు? ప్రజ కోసము కావలయును. ప్రజా తంతువు నరుకరాదనినారు. నీవు దానిని నరుక బోవుదువా! ఓరి! వేద మిట్లు చెప్పుచున్నది. నేనును అట్లు చెప్పుచున్నాను:

ఋతంచ స్వాధ్యాయ ప్రవచనేచ
సత్యంచ స్వాధ్యాయ ప్రవచనేచ
తపశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ
దమశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ
అగ్నయశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ
అగ్నిహోత్రంచ స్వాధ్యాయ ప్రవచనేచ
అతిథయశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ
మానుషంచ స్వాధ్యాయ ప్రవచనేచ
ప్రజాచ స్వాధ్యాయ ప్రవచనేచ
ప్రజనశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ
ప్రజాతిశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ

—53 వ పేజీ చూడండి

ప్రాణగండంగాపరిణమించిన ప్రభుత్వపు పన్నులు

ఏ విధమైన ప్రమేయమూ లేకుండానే అన్ని వస్తువుల ధరలు వాటంతటవే, పెరుగుతూ పోతున్నాయి. నిర్ణీతమైన జీతాలమీద జీవించే ఉద్యోగస్తులకు ఇది మహా బాధాకరంగా పరిణమిస్తోంది. ఈ దుస్థితిని చూసి, పాపం! జాలిపడి కాబోలు, రాష్ట్ర ప్రభుత్వంవారు, వినియోగదారుల సహకార సంఘాలు నెలకొల్పి, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు, సౌకర్యాలు కలుగజేయటానికి పూనుకున్నారు. రాజుగారు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్టు, ఈ సహకార సంఘాలు, విశాల హైదరాబాదు నగరంలో అక్కడక్కడ వెలిసినాయి. వీటిని చూసి ఈ అధిక ధరల భారాన్ని కొంతవరకైనా, భుజాల్నించి దించవచ్చుకదా అని నిట్టూర్చారు. ఇంతకీ, మార్కెట్టు—రేటు కంటె (మార్కెట్టు — రేటంటూ నిలకడగా ఏదీ లేదనుకోండి) తక్కువ ధరకు, నిత్యావసరాలు సప్లయి చేయటమేగా, వీటి ధ్యేయం. బాగానే ఉంది. అయితే అమాంతం కొండ విరిగి నెత్తిన పడ్డట్టయింది. కేంద్ర బడ్జెట్, స్టేట్ బడ్జెట్ చూస్తే ఈ ఆశ కాస్త నిరాశయింది.

కేంద్ర ఆర్థికమంత్రి, రకరకాల వస్తువుల మీద భారీయెత్తున పన్నులు వేసి, ప్రతి ఇంటా వెలవెలా వేసుకుంటున్న బడ్జెట్ స్వరూపాన్నే తారుమారు చేసేశాడు. మన బడ్జెట్లకు, ప్రభుత్వాల బడ్జెట్లకు, ప్రధానమైన తేడా ఒకటి ఉంది. ప్రభుత్వంవారు ఖర్చునుబట్టి, ఆదాయాన్ని రాబట్టటానికి ప్రయత్నాలు చేస్తే, మనం ఆదాయాన్ని బట్టి ఖర్చును సరిదిద్దుకోటానికి ప్రయత్నం చేస్తాం. అయితే ఈ బడ్జెట్ల తీరుతెన్నులు చూస్తుంటే, ఈ భేదం కూడా కనిపించకుండా పోతోంది. మనం కూడా, ప్రభుత్వం వారి పద్ధతినే అవలంబించాల్సిన అవసరం ఏర్పడుతోంది. అంటే ఖర్చులనుబట్టి, ఆదాయం సరిపోదు కాబట్టి, అప్పో సొప్పో చెయ్యాల్సి వస్తోంది. దీనికి మార్గదర్శకులు ప్రభుత్వం వారేగా!

పొద్దున్నే లేచి రోజురోజుకు ఎక్కువవుతున్న విసుత్తును విదిలించుకుందామని, కాఫీ తాగుదామంటే, దానిమీద పన్ను; పోనీ చాయ్‌తో సరిపెట్టుకుందామంటే, దానిమీదా టాక్సే! గుటకలు వేసుకుంటూ, బాత్‌రూముకు వెళ్ళి, సబ్బు మొహంవంక చూడగానే అంగుళం మందాన దానిమీదా పన్ను కనిపించింది. ఈ బాధామయ జీవితాన్ని ఒక్క క్షణం మరచిపోయి పడక—కుర్చీలో పడుకుని హాయిగా ఓ సిగరెట్టు తగలేద్దామనుకుంటే, దాన్ని ముట్టుకోగానే చురుక్కుమంది టాక్స్ తీక్షణత. కాగితంమీద కలం పెడదామంటే కాగితమంతా గరగరమంటోంది, పన్ను రాపిడివలన. వచ్చే ఆదాయమంతా ఈ పన్నుల రూపకంగా, అధిక ధరలు పెట్టి ఈ వస్తువులు కొంటూంటే, యింకా తిండి గడిచేదెట్లా అంటూ నిస్పృహ వచ్చేసింది. ఉద్యోగరీత్యా, ఈ రాజధాని నగరం వెంచేశామాయెను. ఈసెల బడ్జెట్టులో గొప్ప లోటు వచ్చేసింది. అయిన—వాళ్ళకు, ఈ గోడున్న తెల్పుకుంటూ ఈ లోటును పూర్తి చేయమని అడుగుదామని ఓ కార్డు తీస్తే, దానిమీదా పన్నే ఆయె! అలసిపోయి, ప్రాణం విసిగి ఆఫీసుల్లో ఆరాటాలు ఎక్కువయి ఒకరిమీద ఒకరు అకారణంగా, అధికారం చెలాయించుకుంటూ, నెత్తిన పడ్డ నిస్పృహను, ఈ విధంగా ఇంకో చోటకు నెట్టేసి, యింటిదారి పడుతున్నారు. క్యూలో నిలబడటానికి సత్తువ చాలక, నడవటానికి ఓపిక లేక, రిక్షావాళ్ళ డిమాండును 'మీట్' కాలేక, ఏం చెయ్యాలో అర్థంకాక చతికిలబడి పోతున్నారు. కృష్ణపక్షం వస్తోందంటేనే, హడలు పుడుతోంది. చందమామ వెలుగు—రేఖలు, చల్లగా పడి, దారి తెన్నులు చూపిస్తూ ఉంటాయి. మేఘాలతో దోబూచులాడితే, వీధులన్నీ ఆ కాసేపు చీకటిమయమే! విద్యుచ్ఛక్తి సరఫరా తగ్గిపోవటంవలన పొదుపుగా ఆ శక్తిని వాడుకుంటున్నారు మన ప్రభుత్వంవారు. పొద్దూకితే సరే, బజార్లన్నీ చీకటిమయం. మిణుగురు పురుగుల్లాగ, మిణుకు మిణుకుమంటూ వచ్చే పోయే రిక్షాలను, సైకిళ్ళను తప్పించుకుంటూ, కొంపను చేరాల్సి వస్తోంది. ఇంతలోకే బర్రున ఏ కారో అట్టహాసం చేసిందంటే, ఆ లైటు షాకస్‌కు, కళ్ళు చెదిరి దేనికింద కొస్తామో తెలీదు. ఇంత అవస్థ పడుతూ రోడ్డుకు నిలువుగా నడిచే బదులు, కాలిబాట (పేవ్‌మెంట్) మీద వెళ్ళకూడదా అంటే, గేదెలు కొన్ని విశ్రాంతి తీసుకుంటూ ఉంటాయి.. నలువులో నలుపు కలిసిపోతుంది; ఈ ప్రమాదం ఒకటి. రెండోది: 'మాన్‌హోల్స్' ఎక్కడుంటాయో తెలీదు. దాంట్లో దిగబడ్డామంటే తర్వాత సంగతి చెప్పక్కర్లేదు అన్నాడు ఒకాయన. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ఈ చీకట్ల గుత్తుల్లోంచి చాకచక్యంగా బైటపడాలి. తీరా యింటికి వెళితే అక్కడ మాత్రం ప్రశాంతత ఎక్కడిది! మనస్సు కలవరపడిపోవటం; కరెంట్ — ఖర్చు జాస్తిగా ఉంది. పూర్వకాలం మనవాళ్ళు ఆముదం—దీపాలు పెట్టుకుని కాలక్షేపం చేసేవాళ్ళట. నాగరికత బలిసి, చుట్టూ ప్రపంచాన్ని కాస్త చూడటం మొదలుపెట్టిన తర్వాత, కిరసనాయిల్లోకి వచ్చారు. పోనీ, మనమూ ఈనాడు ఆ పనే చేద్దామంటే, కిరసనాయిలుమీద కూడా ఘోరమైన పన్ను విధించారు. ఉదయం లేస్తే, రాత్రి పడుకునేదాక ఈ భారత రిపబ్లిక్ జీవుని తరిమి తరిమి కొట్టి ఊపిరి ఆడనీయకుండా చేసేస్తున్నారు.

సూర్యునికంటే కూడా వాడి కళ్ళు, కవికి ఉంటాయని చెప్పుకున్నారు మనవాళ్ళు. వీళ్ళిద్దర్నీ మించినవాళ్ళయిపోయారు, మన ప్రభుత్వంవారు. వాళ్ళ భూతద్దాల్లో కనిపించని వస్తువంటూ లేదు. ధణా ధణా మంటూ, ఉత్తరదిశ నుంచి ఈ పన్నులొచ్చి దేశవ్యాప్తమయిపోతుంటే, మన రాష్ట్ర

54-వ పేజీ చూడండి

ఉగాది-ఉషస్సు

"రాజశ్రీ"

భూగోళపు టిరుసు నడక
మరో మలుపు తిరిగింది-!
ప్రకృతి తెలి పందిరిలో
క్రొత్త పూవు పూచింది-!!
కడలి రాణి నిజ సాక్షిలా
"ఓం" అని ఊ కొట్టింది...

* * *

క్రాంతి రేఖ లుద్భవించి
జగమంతా విరిసేయి-
శాంతి ఘంట రవళించే
ప్రతిధ్వనులు పలికేయి-
విశ్వప్రమిదలో జ్యోతులు
వేన వేలు వెలిగేయి...

* * *

ప్రగతి బాట కిరువైపుల
శాంతి తరులు మొలిచేయి-
మహోదయపు నీడలలో
సరాగాలు చిలికేయి-
మానవాళి మహాశయం
విజయాలై నిలిచేయి...

* * *

భువన చరిత కావ్యంలో
ఒక పేజీ తిరిగింది-
నవోషస్సు పల్లవులకు
యుగమే లయ వేసింది-
ఉగాదికీ; యుగాదికీ
వింత సంధి జరిగింది...

* * *

'శుభకృతు' తన నిస్తేజం
యుగ సంధిలో దాచుకుంది
'శోభకృతు' నవశోభతో
మేలి ముసుగు తీసింది-
నూత్నారుణ కిరణావళి
జగతి వెలుగు నింపింది...

* * *

విశ్వవాణి వీణమీట
క్రొత్త పాట పాడుకుంది-
శిశిర శైవ కథలో
సంతస మూపొందింది
చైత్ర మాస శిబిరంలో
చైతన్యం మెరిసింది.

ఆంధ్రసచిత్రవారపత్రిక

నవలా రచన పోటీ

మొదటి బహుమతి : రు. 1000
రెండవ బహుమతి : రు. 600
మూడవ బహుమతి : రు. 400

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సాంఘిక నవలా రచనకు మరొక పోటీ నిర్వహించదలచామని తెలుపటానికి సంతసిస్తున్నాము.

ఈ పోటీకి పంపే నవలలు మా కార్యాలయానికి 22-6-1963 లోగా చేరాలి.

నిబంధనలు

- రచనలు కాగితానికి ఒక వైపుననే వ్రాసి ఉండాలి.
- 250 అరఠావు (ఫుల్‌స్కేప్) పేజీలు మించి ఉండరాదు.
- కథా వస్తువు నేటి ఆంధ్రదేశం సాంఘిక జీవితానికి సంబంధించి ఉండాలి.
- రచనలు స్వంతమయినవిగా ఉండాలి. అనువాదాలు పంపకూడదు.
- పోటీలో తుది నిర్ణయం సంపాదకులదే. ఈ విషయంపైన ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.
- రచనలు త్రిప్పిపంపగోరేవారు తగిన పోస్టేజి జతపరచి పంపాలి.
- పోటీలో బహుమతి పొందని నవలలు యోగ్యములయితే విడిగా ప్రచురిస్తాము.
- బహుమతి నవలలకు మొదటి ముద్రణల హక్కులూ ఆంధ్ర సచిత్ర వారపత్రికకే చెంది ఉంటాయి.

రచయితలు ఎప్పటివలె మాతో సహకరించి ఈ పోటీ జయప్రదం చేయగోరుతాము.

ఇంతకుముందు పోటీకి నవలలు పంపినవారందరికీ కృతజ్ఞులము.

గ్రంధి వేంకటరావు

సినిమాలూ - జాతీయ సమైక్యతా

దేశంలో జాతీయ సమైక్యతను పెంపొందించే సాధనాలు చాల ఉన్నవి. కాని, వాటిలో సినిమా ముఖ్యమైన సాధనమని చెప్పక తప్పదు. రచయితలు కూడ, జాతీయ సమైక్యతను ప్రజలలో పెంపు చేయగలరు. ఒక భాషలోని ఉత్తమ రచనలను ఇతర భాషలలోనికి తర్జుమా చేసి, ప్రకటించడం ద్వారా ప్రజలు అన్ని భాషలలోని ఉత్తమ రచనలను చదివి ఆనందించడానికి అవకాశం కల్పించి విజ్ఞానం విస్తరించడానికి ఎంతో తోడ్పడుచున్నారు. తద్వారా జాతియందలి విభేదాలను మరపించి మనదంతా ఒకే జాతి అన్నటువంటి విశాలభావాన్ని ప్రజల మనసులలో నాటునట్లు చేస్తున్నారు. కాని మనదేశంలో విద్యావంతులు ఎంతమంది, వారిలో ఉత్తమ గ్రంథాలను ఓపికతో చదువగల అవకాశం కలవారు ఎంతమంది అని ప్రశ్నించుకొంటే, ఉత్తమ రచనలు జాతీయ సమైక్యతకు ప్రజల అందుబాటులో లేని సాధనం అని చెప్పక తప్పదు. కాని, ప్రజలందరికీ అందుబాటులో ఉండి, వినోదాన్ని, విజ్ఞానాన్ని కలుగజేసి, తద్వారా జాతీయ సమైక్యతను పెంపొందించగల ఉత్తమ సాధనం 'సినిమా' అని వేరే చెప్ప నక్కరలేదు.

సినిమాలు జాతీయ సమైక్యతకు ఎలాగ కృషిచేయుగల వన్నది ముఖ్యమైన విషయం. జాతీయ సమైక్యత వర్ధిల్లాలంటే, ప్రజలలోని అవివేకాన్ని, అజ్ఞానాన్ని పారద్రోలి, వివేకాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించాలి. వర్గ, వర్ణ, భాషా వైషమ్యాలను ప్రజలలో తాపులేకుండా చేయాలి. మన దేశ ప్రజలందరూ ఒకే జాతివారనే భావాన్ని వారిలో కలుగచేయాలి. ఇటువంటి కృషిని చేయగలిగే చిత్రాలే ఉత్తమ, లేక సజీవమైన చిత్రాలు. అటువంటి ఉత్తమ చిత్రాలే జాతీయ సమైక్యతకు చాల చక్కని సాధనాలు.

ఒక విధంగా నేటి చిత్రాలు జాతీయ సమైక్యతకు దారి తీస్తున్నవని చెప్పవచ్చు. వర్గ, వర్ణ, వైషమ్యాలు కేవలం మనుష్యులే కల్పించుకొన్నవని, కుల, మత విభేదాలు సాంఘిక దురాచార ఫలితాలని, అట్టి విభేదాలు కల్పించుకోవడం మానవునిలోని అహంకారాన్ని, ద్వేషాన్ని వెలిబుచ్చడమేనని, మానవులు వానిని పాటించక విశాల హృదయం అలవర్చుకొని అందరం ఒక్కటిగా మెలగాలన్న సత్యాన్ని చాటిచెప్పే చిత్రాలను మనం చూస్తున్నాము. అటువంటి ఉత్తమ భావాలతో నిండిన చిత్రాలు ప్రేక్షకుల హృదయాలను వికసింప చేయుడంలోను వారి మనసుల్లో జ్ఞాన బీజాలను నాటడంలోను తక్కువ కృషి ఏమీ చేయుడంలేదు.

భాషా విభేదాలు దేశ సమైక్యతకు మరియొక గొప్ప శత్రువు. భాషా విభేదాలు దేశంలో అంతరించే వరకు, జాతీయ సమైక్యతకు గట్టి పునాదులు పడ జాలవు. ఒక విధంగా నేటిచిత్రాలు ఇటువంటి భాషా వైషమ్యాన్ని కూడ ప్రజలలో లేకుండా చేయుడానికి తోడ్పడుతున్నట్లు కనిపిస్తున్నది. హిందీ, తదితర ఉత్తర భారత భాషా చిత్రాలు దక్షిణ భారతదేశంలో ప్రదర్శించబడడం, ప్రదర్శింపబడే చిత్రాల సంఖ్య రోజు రోజుకూ ఎక్కువ అవుతూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. దక్షిణభారత భాషా చిత్రాల్లో ఉత్తర భారత భాషా చిత్రాలలోని సంగీతాన్ని అనుకరించడం, ఆ సంగీతాన్ని హర్షించేవాళ్ళ సంఖ్య ఎక్కువ కావడం, చివరకు అన్ని భాషా చిత్రాలలోని సంగీతం ఒకే రీతిగా, ఒకేస్థాయిలో ఉండడం పైన చెప్పిన భావాన్ని బలపరుస్తున్నాయి. దక్షిణ భారత చిత్రాలలో హిందీ—ప్లేబాక్‌లతో పాటలు పాడించడం, అటువంటి పాటలు ప్రేక్షకుల మన్ననలను పొందడం, ఉత్తర భారత చిత్రాలలో దక్షిణాది తారలు నటించడం, అటువంటి చిత్రాలు బాగా డబ్బు చేసుకోవడం, ఇతర భాషలలోని ఉత్తమ

మొదటి బహుమతి పొందిన వ్యాసం


రచనల ఆధారంగా డబ్బు చేసుకోవడం, ఇతర భాషలలోని ఉత్తమ రచనల ఆధారంగా తీసిన చిత్రాలు శత దినోత్సవాలు చేసుకోవడం మొదలగువానివల్ల సినిమాలు భాషా భేదాలను రూపుమాపడంలో యథాశక్తి కృషి చేస్తున్నాయనే విషయం తేట తెల్లమవుతున్నది. భాషా విభేదాలను మరచి, ఉత్తమ సంగీతాన్ని, ఉత్తమ నటనను ఏ భాషలో ఉన్నా సరే (ఒకప్పుడు భాష తెలియకపోయినా) చూచి, సంతోషించాలనే ఉత్సుకతను సినిమాలు కలిగిస్తున్నవి. ఒక భాషా ప్రాంతపు ప్రజల సంస్కృతీ సంబంధాలను, అలవాట్లను, వేష భాషలను మరొక భాషా ప్రాంతానికి చెందిన ప్రజలు అవగాహన చేసుకొని, వారియందు పరస్పర సుహృద్భావాన్ని పెంపొందించుకొనడానికి, సహనాన్ని అలవరచుకొనడానికి, ఆచార వ్యవహారాలలోను, వేష భాషలలో తేడా లున్నప్పటికీ, తామంతా ఒకే జాతివారమని, ఒకే దేశమాత కన్న బిడ్డలమని అనుకొనడానికి సినిమాలు చేస్తున్న కృషి అల్పం ఏమీకాదు. నిజం చెప్పాలంటే, వేయిమంది ఉపన్యాసకులు దేశమంతా తిరిగి గొంతెత్తి అరిచే దానికంటే ఒక ఉత్తమ చిత్రం అధిక ప్రయోజనం సాధించగలదు. ఒకే చిత్రం వివిధ భాషలలోనికి డబ్బింగ్ చేయుబడి, వివిధ భాషా ప్రాంతపు ప్రజల ప్రశంసలు పొందిందంటే, దాని అర్థము దేశములోని వివిధ భాషా ప్రజల అభిరుచులు ఏకమౌతున్నవని, వేరే చెప్పనక్కరలేదు.

నేడు ఉత్తమ చిత్రాల ఆవశ్యకతను ప్రభుత్వము గమనించడంవల్లనే జాతీయసమైక్యతా సాధనలో సినిమాల ప్రాముఖ్యము బోధపడగలదు. ఒక ఉత్తమ చిత్రం ప్రేక్షకుల హృదయాల్లో ఉత్తమ భావాలనే వెదజల్లుతుంది. మన దేశ ఔన్నత్యాన్ని చాటుతూ, ఆ ఔన్నత్యాన్ని నిలుపుకోవడానికి సమైక్యత ఎంత అవసరమో తెలియజేసే చరిత్ర మన కెంతో ఉన్నది. అట్టి చరిత్రను కళ్ళకు కట్టినట్లుగ సినిమాలు మనకు చూపించగలవు. అందువలననే సినిమాలు ఉత్తమ స్థాయిలో ఉండడాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరము ఉత్తమచిత్రాలకు, ఉత్తమ దర్శకులకు, ఉత్తమ రచయితలకు, ఉత్తమ కళాకారులకు ప్రభుత్వము ఎన్నో బహుమతులు ఇస్తున్నది. చిత్ర నిర్మాతలు కూడ సినిమాను కేవలం ఒక వ్యాపార వస్తువుగా భావించక విశాల భావాలతో ప్రతి వ్యక్తికి అర్థమయ్యే పంథాలో వినోదం, విజ్ఞానం, వివేకం మేళవించి చిత్రాలు నిర్మించి జాతీయ సమైక్యతకు తోడ్పడితే సినిమావల్ల జరగని మహాకార్యం ఏమున్నది ?

ఈ విషయంలో అప్పుడే కొంతమంది నిర్మాతలు, దర్శకులు తమ ప్రయత్నాలు సాగించడమూ అందులో వారు కృతకృత్యులు కావడమూ కూడ జరిగినది. సుమారు రెండు దశాబ్దాలకు పూర్వమే శ్రీ శాంతారామ్ దర్శకత్వంలో తయారయిన 'పడోసీ' చిత్రము ఈ ప్రయత్నాలకు నాంది ప్రస్తావన అని చెప్పవచ్చును. ఆ తరువాత కొంత కాలము నిశ్శబ్దత ఆవరించినా మళ్లీ ఇప్పుడు చిత్ర నిర్మాతలు అట్టి చిత్రాల ఆవశ్యకతను గుర్తిస్తున్నారు. 'హమ్ ఏక్ హై' (హిందీ), 'పావ మన్నిప్పు' (అరవం), 'పాపపరిహారం' (తెలుగు) హంఫంచి ఏక్‌డాలీకె (హిందీ — బాలల చిత్రం) ఇవి ఇటీవల వచ్చిన చిత్రాలు. ఇవన్నీ కూడ పత్రికల, విమర్శకుల ప్రశంసల నందుకున్నవే.

ఇది ఇలా ఉండగా సినిమాలవల్ల వర్గ, వర్ణ, వైషమ్యాలు, అవాంఛనీయ శక్తులు తలఎత్తుతున్నాయని కొంతమంది అంటూ ఉన్నారనేదానికి ఆధారాలు ఏమీ కనబడడంలేదు. కాగా సినిమా పరిశ్రమలో వివిధ మతాలవాళ్లు, వివిధ భాషలవాళ్లు ఒక్కచోట చేరి, అన్నదమ్ములవలె మసలుతూ తమ కళా కౌశలాన్ని దేశ పురోభివృద్ధికి అంకితం చేస్తున్నారు. వారిలో మత వైషమ్యాలు లేవు. భాషా విభేదాలకు వారు అతీతులు. మహబూబ్ లాంటి చిత్ర నిర్మాతలు హిందూమత ప్రాధాన్యం గల కథలను ఎన్నుకొంటే రామకృష్ణలాంటి దర్శకులు 'లైలామజ్ను' వంటి మహమ్మదీయ మత ప్రాధాన్యంగల కథలను ఎన్నుకొని చిత్రాలు నిర్మిస్తున్నారు. అసలు జాతీయ సమైక్యతా బీజాలు ఈ సినిమాలలోను, ఈ సినిమా పరిశ్రమలోను ఉద్భవించాయంటే అది అతిశయోక్తి కాజాలదు.

★



మార్కుకీ మార్కుకీ మధ్య

లేక సప్లిమెంటరీ కథ

'తంబు'

"పరీక్ష అంటే—

ప—పండగ మామూలులాగ,

రీ—రివాజుగా,

క్ష—క్షవరమయ్యేది

పరీక్ష" అని మొదలుపెట్టారు గురూజీ సిగరెట్టు వెలిగించి.

నేను శ్రద్ధగా వింటున్నాను చెప్పమని అడిగినది నేనే కాబట్టి. ఈ పరీక్షల గురించి గురూజీకి తెలిసినంత కథా కమామిషూ మా పరగణాలలో ఎవరికీ తెలియడానికి వీలులేదు. ఎందుకంటే— వారు పరీక్షలమీద అనేక రకాల పరిశోధనలు చేసి కిటుకులు బోలెడు కనిపెట్టిన అనుభవశాలి. వారు వెళ్ళిన ఒక్కొక్క పరీక్షకి గుర్తుగా వారి జుట్టులో ఉన్న ప్రతీ నెరిసిన వెంట్రుక అతిశయంతో మెరిసిపోతూ ఉంటుంది. అనేక సంవత్సరాలు తపస్సుచేసి మోక్షమార్గం తెలుసుకున్న జ్ఞానికి మల్లే, వారి ముఖానికి చుట్టూ దివ్యతేజస్సు వారి పూర్వకాలంలో వచ్చే మార్కులని జ్ఞప్తికి తెస్తూ తెల్లగా 'సున్న'లాగ ఉంటుంది.

"నా ముఖంకేసి ఏం చూస్తావు! చెప్పేది శ్రద్ధగా విను" అని నన్ను చివాట్లేసి మళ్ళీ చెప్పడం ప్రారంభించారు గురూజీ.

"అసలీ పరీక్ష లనేవి ఇప్పుడు కొత్తగా వచ్చినవి కాదు. తరతరాలుగా పురాణకాలంనుంచీ వస్తున్నాయి. మహామహా పతివ్రత అయిన సీతాదేవికికూడా శ్రీరాముడు అగ్నిపరీక్ష ఒకటి పెట్టి అందులో పాసైన తర్వాతనే మళ్ళీ ఏలుకున్నాడట."

హరికథ వాతావరణం వచ్చి నేను ఆవలించాను. నా నోట్లో సిగరెట్టుపెట్టి నన్ను స్వప్రహలోకి తెచ్చారు గురూజీ.

"అసలు ప్రశ్న అంటే ఏమిటి ?" అని నన్ను ప్రశ్నించారు గురూజీ నా స్టాండర్డ్ ఏ మాత్రం ఉందో తెలుసుకుందామని.

నేను— నిజం చెప్పొద్దూ! వెర్రి—మొహం వేశాను.

"చూశావా ? ఇలా ఇవతలివారిచేత వెర్రి మొహం వేయించేదే 'ప్రశ్న' అనే పదార్థం. ఇటు

వంటి ప్రశ్నల తోరణమే పరీక్ష అనే యజ్ఞం."

"అది సరే గురూ! వాళ్ళు అడిగిన ప్రశ్నలకి మనకి సమాధానం తెలియనంతమాత్రాన మనకి విజ్ఞానం లేనట్లేనా? ఒకవేళ మనకి విజ్ఞానం లేకపోయినా అదృష్టవశాత్తు వాళ్ళు అడిగిన ప్రశ్నలకి సమాధానం తెలిస్తే మనకి అంతా తెలిసినట్టేనా?.... ఏమిటో గురూ! అందుకే నా కీ పరీక్షా విధానం నచ్చలేదు" అన్నాను పరీక్షల మీద నా అభిప్రాయం వెలిబుచ్చుతూ.

"అవును నువ్వు చెప్పింది నిజమే! పూర్వకాలంలో గురుకుల విద్యావిధానం ఉండేది. సదరు గురువు తన శిష్యుడిని అనేక విధాల పరీక్షించి చివరికి సర్టిఫికేట్ ఇచ్చేవాడుట. అయినా కొంతమంది శిష్యులు గురువుగారి ఆడంగుల జోలికి పోయి ఫైనల్స్‌లో ఫెయిలై పోయినట్టు బోలెడు దాఖలాలు ఉన్నాయి పురాణాల్లో. ఏది ఏమైనా మొత్తానికి ఈ పరీక్షలు విద్యార్థుల పాలిటి యమగండాలు" అని సిగరెట్టు గట్టిగా పీల్చి పొగ నిట్టూర్చారు గురూజీ విద్యార్థుల మీద ప్రేమ ఉట్టిపడేలా.

"అందుకే సర్కారువారు మద్యనిషేధం బదులు ఈ పరీక్షలు నిషేధించవలసినది" అన్నాను ఈ తప్పంతా ప్రభుత్వానిదే అనే ఉద్దేశంతో.

"ప్రభుత్వం అనగా ప్రజలు; అంటే మనమే. మనకి మనమే ఏర్పాటు చేసుకున్నామన్నమాట ఈ పరీక్షలు. ఒక విధంగా చూస్తే పరీక్షలు ఉండాలి. అందరూ ఫెయిలవ్వాలి. లేకపోతే దేశం బాగుపడదు" అన్నారు గురూజీ.

"పరీక్ష ఫెయిలవ్వడం ప్రతీ విద్యార్థియొక్క జన్మహక్కు" అని వివాదం చేశాను నేను ఆవేశంతో.

ఇంతలో "పరీక్షకీ జై!" అంటూ చందూ ప్రవేశించాడు. వాడిని చూడగానే నా గుండె కరిగిపోయింది. ఎల్లప్పుడూ హుషారుగా ఉండే చందూ అలా జాలిగొలిపే వాలకంతో వచ్చేసరికి నాకు ఏడుపొచ్చింది. కానీ వాడు మనసులో అగ్ని—పర్వతాలని దాచుకుని పైకి మాత్రం సరదాగా కన్పించడానికి ప్రయత్నిస్తూ మళ్ళీ ఒక్కసారి గట్టిగా "పరీక్షకీ జై!" అని అరిచాడు.

గురూజీ—గొంతు గద్గదమైంది "చందూ...." అన్నారు.

"గురూ! నేను ప్యాసయిపోయను గురూ...... నన్ను క్షమించు" అని వాడు గుండె కరిగేలా ఏడ్చాడు.

గురూజీ కూడా కన్నీరు తుడుచుకుని ప్రేమతో వాడిని పైకి లేవదీసి "చందూ.... ఏడవకు.... కష్టాలు మంచివారికే వస్తాయి" అని ఓదార్చారు.

వాడి మనసులో అంతవరకూ దాచుకున్న అగ్నిపర్వతాలు ఒక్కసారిగా ప్రబద్దలయ్యాయి.

"ఇంతకాలం మనం ఐకమత్యంతో అన్ని పరీక్షలు ఫెయిలౌతూంటే, మన స్నేహాన్ని చూసి ఓర్వలేక మామయ్య నన్ను మార్కులు వేయించి పాస్ చేయించాడు" అని బావురుమన్నాడు.

"పేపర్లో ఉన్నది నీ నెంబరు కాదేమో సరిగ్గా చూశావా?" అని వాడికి ధైర్యం చెప్పబోయాను.

"ఖచ్చితంగా నాదే! నా కళ్ళారా చూశాను."

"ముద్రా రాక్షసం అయిఉంటుంది. నీ నెంబరు పడటానికి వీల్లేదు" అన్నారు గురూజీ ధీమాగా.

"అటువంటిదేమీకాదు. ఇదంతా మా మామయ్య పన్నిన కుట్ర.... అయ్యో!.... మీరు నన్ను అపార్థం చేసుకుంటారేమో" అని వలవల విలపించాడు చందు.

"మీ మామయ్య చేసిన తప్పుకి నిన్ను శిక్షించేంత మూర్ఖులంకాదు మేం" అన్నాను నేను భారంగా మరే మనాలో తెలియక.

"నువ్వు పాసైనా, ఫెయిలైనా సరే! మనమంతా మునపటిలాగే ఐకమత్యంగా ఉంటాం!" అని గురూజీ హామీ ఇచ్చాక, వాడు మళ్ళీ మామూలు మనిషి అయ్యాడు.

"ఇంతకీ నువ్వు ఫెయిలయినట్టేనా" అని నన్ను ప్రశ్నించాడు చందు ఆతృతతో.

"ఓ" అన్నాను ఆనందంతో

"గుడ్. కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు వాడు హృదయపూర్వకంగా. గురూజీ ఆనందబాష్పాలు తుడుచుకున్నారు.

అంత సంతోష సమయంలో కూడా నాలో ఏ మూలనో దాగొనిఉన్న భయం పైకి వచ్చేసింది.

"ఎందుకలా భయపడుతున్నావ్?" అనడిగారు గురూజీ ఆప్యాయంగా.

"అదికాదు గురూ.... నేను క్రిందటిసారి ఎలా ఫెయిలయ్యానో అలానే ఈ సారికూడా ఫెయిలయ్యాను కదా! కానీ, మానాన్న ఈ మారు ఎలా, తంతాడో అని భయంగా ఉంది" అన్నాను భయపడుతూ.

గురూజీ ఆవేశపూరితులయ్యారు. పరీక్షపోయిన వారికి ఇటువంటి క్లిష్టపరిస్థితులు రావడానికి కారణభూతమైన సంఘాన్ని చీదరించుకున్నారు.

"మనమేమీ చెయ్యలేం గురూ" అన్నాను నిరాశతో!

"అవును. ప్రపంచం అంతా అజ్ఞానాంధకారంతో ఉంది. పరీక్షపోయినంత మాత్రాన మనిషిని

45—వ పేజీ చూడండి



వనితాలోకం

వంట చేయటంలో కొన్ని మెళకువలు

టి. ప్రభాకృష్ణమూర్తి

ఎప్పటినుంచో ఈ మెళుకువల గురించి వ్రాద్దామనుకున్నా, అశ్రద్ధ అయిపోయింది. కాని శాంతమ్మ వైరాణిగారు అందాలకు చిట్కాలు వ్రాసింది చదివిన తర్వాత పట్టుదలగా వ్రాయటం జరిగింది. 'కోటి విద్యలూ కూటి కొరకే' అనే నానుడి నిజ జీవితంలో ఎంతో నిజం కదా. ఆ కూడు రుచిగా, తృప్తిగా, మనస్సుకీ, శరీరానికీ ఆరోగ్యకరంగా, ఆహ్లాదాన్ని కలిగించేదిగా మహిళలు తయారుచేస్తేనేకదా మగవారి కోటి విద్యలూ రాణించేది. అలా ఉండటానికి వీలుగానే ఈ మెళుకువలు ఇక చదవండి.

కూరగాయలు తరగటం :—

కొన్ని రకాల కూరలు, పొట్లకాయ, అరటికాయ, దొండకాయ మొదలగునవి — తరిగేటప్పుడో, తరిగిన తర్వాతో చెయ్యి నల్లగా అవటం, అరచేతిమీది చర్మం పల్చటి పొరలా ఊడటం, చేతికి జిగురుగా అంటుకోవటం జరుగుతుంది. ఈ ఇబ్బంది లేకుండా, రెండు అరచేతులకూ కొద్దిగా గోరు—వెచ్చగా మంచినూనె రాసుకుని, కత్తిపీటకు కూడా కొద్దిగా రాస్తే బాగుంటుంది. కత్తిపీటకూడా పాడవదు. తర్వాత చేతులు గుడ్డతో తుడిచేసుకుని కడిగేసుకుంటే శుభ్రంగా ఉంటాయి.

కొంతమంది కూరగాయల్ని నీటిలోకి తరిగి, అప్పుడు కడిగి ఉపయోగిస్తారు. లేదా, తరిగిన తర్వాత ముక్కల్ని కడుగుతారు. అలాకాకుండా కూరగాయల్ని ముందు కడుక్కుని, అప్పుడు తరుక్కుంటే మంచిది. కొన్ని కొన్ని రకాలు నీటిలో వేసేటప్పటికి బాగా జిగురెక్కి, వండిన తర్వాత కూర కూడా ముద్దలా అయిపోతుంది— ముఖ్యంగా బెండకాయలు, చేమ దుంపలూను. కూరగాయల్ని ముందే కడుక్కోవటంలో ఇంకో లాభం కూడా ఉంది.—వాటికి ఉన్న అపరిశుభ్రాన్ని ముందే కడిగేసుకోవటం అవుతుంది. అలాకాక, తరిగేసినట్లయితే అదంతా ముక్కలకి పట్టుకుంటుంది. చిన్నచిన్న ముక్కలకి అంటుకున్నదాన్ని వదిల్చి శుభ్రం చేయటం కష్టం అవుతుంది.

ఇంకొంతమంది ఉల్లిపాయలు కూడా తరిగిన తర్వాతే ఆ ముక్కల్ని కడుగుతారు. అలా చేయడంవల్ల వాటి వాసన తగ్గిపోతుంది. ఉల్లిపాయల్ని ఒలిచి, పాయలుగా కడిగి అప్పుడు ముక్కలు తరుక్కుంటే మంచిది.

కంద అవటంతోనే [illegible] జ్ఞాపకం వస్తుంది. కంద చెక్కులను, బాగా

ఉప్పుతో రాసి కడిగేస్తే, దురద తగ్గుతుంది. తర్వాత ఉప్పువేసి, కొద్ది చింతపండు నీళ్లలో ఉడికించి వార్చేసి వండుకుంటే దురద చాలవరకు మాయమైపోతుంది.

ఇక వంకాయల్ని మాత్రం మామూలు కాయలుగా కడిగి తరుక్కున్నా, నీళ్లలోకి తరక్కపోతే బాగా కసరెక్కిపోతాయి. అందుకు తప్పక వాటిని నీటిలోనే తరగాలి. కూర వండుకునే వరకూ నీటిలోనే ఉంచాలి. ముక్కలు కోసి, కూర వండే లోపున ఎక్కువ ఆలస్యమైతే ముక్కలు నల్లగా తయారవుతాయి; నీటిలో ఉన్నా కూడా. కొంచెం ఉప్పులో ముక్కల్ని బాగా కడిగేస్తే, వలుపుదనం పోయి, రుచి తగ్గకుండా ఉంటాయి. పోపులోనో నూనెలోనో వేసిన తర్వాత కూడా వెంటనే ఉప్పు వేసేస్తే కూర కసరగా ఉండదు.

కాబేజి, కాలీఫ్లవర్, తోటకూర మొదలయిన కూరజాతుల్ని కూడా చాలామంది ఉడికించి నీళ్లు వార్చేసి వండుకుంటారు. అలా వండటంవల్ల కూరలోని విటమినులు పోవటమే కాకుండా, కూర కూడా అంత రుచిగా ఉండదు. తరిగిన తర్వాత ఉడకబెట్టకుండానే పోపులో వేసి, తగినంత ఉప్పు వేసి మూతబెడితే, ఆ కూరల్లోనే స్వతస్సిద్ధంగా ఉన్న నీరు, ఉప్పు వేయటంవల్లా, కూర వేగుతుండగా తయారయ్యే ఆవిరి బయటికి పోకుండా మూత పెట్టడంవల్ల ఏర్పడే నీరుతో చక్కగా మెత్తగా ఉడికి, కూర ఎంతో రుచిగా ఉంటుంది.

బీరకాయ కూడా ఈ విధంగానే వండుకోవాలి.

ఇక బీరకాయ చెక్కుని శుభ్రంగా కడిగి పోపులో వేసి బాగా వేయించి, తగినంత ఉప్పు, చింతపండు చేర్చి పచ్చడి రుబ్బుకుంటే చాలా బాగుంటుంది; పత్యకారి కూడా. సమపాళ్లలో వేగినట్లయితే 3, 4 రోజులు నిలువ కూడా ఉంటుంది పచ్చడి.

పొట్లకాయ, అనపకాయ మాత్రం బాగా ఉడికించిన తర్వాతే వండుకోవాలి. అయితే ఉడికిన ముక్కల్ని మాత్రం బాగా నీరు పోయేలా గరిటెతో నొక్కాలి. లేకపోతే అసలే నీరు గల కూరలు, ఇంకా నీరులో ఉడికించడంవల్ల నీరు బాగా పోకపోతే కూర ఎంతసేపు వేయించినా నీరునీరుగానే ఉంటుంది, పొటాటలు కూరలా. రుచిగా ఉన్న కూర మాత్రం కొద్దిగానే అవుతుంది.

[illegible] వేగుతుండగా మూత వేస్తే, ఆ ఆవిరికి చక్కగా ఉడికి బాగా రుచిగా ఉంటుంది. పైకప్పునుంచి బూజు మొదలగునవి రాలిపడటం కాని, గాలికి ఎగిరివచ్చి ఏ దుమ్మో పడటం కాని జరుగదు కూడా. పులుసు మరిగేటప్పుడు కూడా, మూత పెడితే ముక్కలు ఆవిరికి తొందరగా, మెత్తగా ఉడుకుతాయి. అలాగని, మూత పూర్తిగా పెట్టేరు సుమా. ఆవిరికి మూతలోంచి లోపలి పదార్థాలు పొంగిపోయి, స్టౌ ఆరిపోవటమో, హీటర్ పాడవటమో జరగటమే కాకుండా, వండే పదార్థాలు కూడా వృథా అవుతాయి. కొద్దిగా ఖాళీ ఉంచితే చాలు.

(సశేషం)

వంటలు

ఉగాది పచ్చడి

కావలసిన వస్తువులు :

వేపపూవు	ఓ గుప్పెడు
చింతపండు	2 పలములు
బెల్లం	3 పలములు
అరటిపళ్లు	2
మామిడికాయ	1
ఉప్పు	చిటికెడు

వేప పువ్వు చేటలో పోసి, బాగా నలిపితే పువ్వునంటిఉన్న తొడిమలు రాలిపోతాయి. చింతపండు తగుమాత్రం నీళ్ళలో గుజ్జుతీసి 'పులుసు' చేసుకోవాలి. బెల్లం చితక్కొట్టి అందులో కలపాలి. ఉప్పును చేర్చాలి. తరువాత మామిడికాయ, అరటిపళ్ళు సన్నగా తరుక్కొని ఈ చెక్కును, సిద్ధంగా ఉంచుకున్న వేప పువ్వును కలిపి, రసంలో కలుపుకుంటే అదే ఉగాది పచ్చడి. ★

ముత్తుస్వామి దీక్షితుల వారి కీర్తనలు

"సంగీతమూర్తి త్రయము" లో ఒకరైన శ్రీ ముత్తుస్వామి దీక్షితులవారి కీర్తనలను కొన్నింటిని, ఇంతవరకు అముద్రితములైనవి, ఆంధ్రసచిత్ర వారపత్రిక పాఠకులకు అందించుచున్నాము. వీటిని శ్రీ దీక్షితుల వారి వంశములో ఐదవ తరమునకు చెందిన శ్రీ బాలస్వామి దీక్షితార్. సేకరించి ఉన్నారు. వారి ద్వారా పాఠకులకు అందించగలుగుతున్నాము. వీరు ప్రస్తుతం మద్రాసులో వుంటున్నారు. మంచి వైణికులు. శ్రీ ముత్తుస్వామి దీక్షితుల వారి భగవదంశ గల వీణను వీరి వంశస్థులంతా పూజచేస్తారు. ప్రస్తుతం ఈ కీర్తనల సేకరణ కర్త కూడా ఆ 'వీణ' ను 'యిష్టదైవం'గా పూజిస్తారు.

రాగము : రుద్రప్రియా
తాళము : ఆది

ఆరోహణం : స రి గ మ ప ధ ని స
అవరోహణం : స ని ప మ గ రి స

22 వది ఖర హర ప్రియా - జన్య రాగము
ఈ రాగము ఎల్లప్పుడు గానము సేయ తగును

పల్లవి : 1. ;;; రి గా మా గా | రీ ;; స ని | సా రి రి రి గా॥
గ ణ నా య | కం భ - | జే హం భ ॥
మా ;;
జే

2. రి గా మా ప మ మా గా | రీ ;; స ని | సా రి రి రి గా॥
గ ణ నా - - - య | కం భ - | జే హంభ -॥
మా ;; గా రి సా; సా | ని, ధా, ని | ; సాసాసా॥
జే శ మ రె శ | మా త శ | మ రి పు॥
రి గ మ రి గ స రి గా॥
కు - - తం - గ ణ॥

అనుపల్లవి : 1. ;;; పా నీ సా ; నీ | పా ; మా పా | ధా నీ సా; ॥
అ ణి మా ది | సి ద్ధి దా | - య కం॥

2. సా;; పా ధా ధా ని సా ని | నీ పా మా పా | ధా నీ సా;॥
అ ణి మా - - ది | సి - ద్ధి దా | - య కం ॥
స ని స మ గ స రీ గా॥
కుమ రం - - గణ॥

చరణం : 1. ;;; ధా నీ ధా నీ సా | నీ పా ;; | ;;;; ॥
మా - ణి - ర | మ ణా | — ॥

2. స ని ధ ని స మ ధా నీ ధా నీ సా | రీ ; రీ సా | రీ స రి గ రి గా గా॥
అ - - - - - నా - ణి - ర | మ ణ క | ం దం - - - - ద॥
రీ సా ; నీ సా నీ పా మా | ప ధ నీ సా ని స | నీ పా మా గా॥
వ దం వ - ద నే ద్వి | ర - దం వ ర | బా ల కు దు॥
గ రి రి సా, రి గా॥
హం - - గణ॥

మన్మథుని జయించిన శివ కుమారుడును, అష్టసిద్ధియు ఉం
డు చోటైన (స్థలమైన) బ్రహ్మ, గురు గుహ మొదలైన వారిచే
కొనియాడబడియు, దేవులకు మొదటి వాడైన
శ్రీ గణనాయకునికి మ్రొక్కెదన్.

సమర్పణ: తిరువారూర్ బాలుస్వామి దీక్షితార్

శ్రీదేవి

రంగధామి

జరిగిన కథ

దుర్గాప్రసాద్, విశ్వేశ్వరరావు కుమారుడు; భార్య అనసూయమ్మను హింసిస్తూ ఉంటాడు. దుర్గాప్రసాద్ కుమార్తె శ్రీదేవి జగన్నాథం వద్ద సంగీతం నేర్చుకుంటూ ఉంటుంది. సంపన్న కుటుంబీకుడే అయినా దుర్గాప్రసాద్ పిల్లలను, భార్యను ఉపేక్షించి, త్రాగుడూ, స్త్రీలోలతలకు అలవడతాడు. విశ్వేశ్వరావుగారి విధవప్ప చెల్లెలు సుభద్రమ్మ అనే ఆమెతో శ్రీదేవికి అని పరిచయం అవుతుంది. అక్కడ శ్రీదేవికి ఆమె మరిది వేణుతో పరిచయమై, అతనంటే ఆకర్షణ ఏర్పడుతుంది. శ్రీదేవికి, శ్యామల, సావిత్రి అనేవారు ఆత్మీయులౌతారు. వేణూ శ్రీదేవీ, పారిపోయి వివాహం చేసుకుంటారు. మోజుతీరిన వేణు శ్రీదేవిని నిరాదరిస్తాడు. సావిత్రి శ్రీదేవి నోదారుస్తుంది. శ్రీదేవి పుట్టింటినుండి డబ్బు తెప్పించలేదనే కోపంతో వేణు నళినితో ఇల్లు వదలిపోతాడు. శ్రీదేవికి సరస్వతిబాయ్, సుందరమ్మ, శారద, మీనాక్షమ్మ అనే స్త్రీలతో పరిచయమౌతుంది. మెట్రిక్కు ప్రైవేటుగాకట్టి ఉత్తీర్ణురాలౌతుంది. క్షయవ్యాధిలో సావిత్రి మరణిస్తుంది. శ్రీదేవి కాలేజీలో చేరుతుంది.

12

వారంరోజులు వరుసాగ్గా శ్రీదేవి, విద్యార్థులు తనని చేస్తున్న అల్లరి గమనించింది. నలుగురు విద్యార్థులు తప్పనిసరిగా ఆమె వెంటబెడుతూ, మాటిమాటికీ "వదినా! అన్నయ్యని, అబ్బాయినీ కాలేజీకి తీసుకురాలేదేం?" అని వెక్కిరించడం, అన్యాపదేశంగా చంటిపిల్లాడి ఏడుపులూ, మాటలూ, చేష్టలూ చెయ్యడం చూసింది. ఆ నలుగురిలో, రమణారావనే విద్యార్థి అందరికన్నా ఎక్కువ చొరవ గలవాడు, ఎక్కువ అల్లరి చేసేవాడు. అతను ఇంచుమించు కాలేజీలో అందరు అమ్మాయిల్నీ ఏదో అంటూ ఏడ్పించాలని చూసేవాడు. హేమలత కొంచెం చలాకీగా ఉండి, రకరకాల బట్టలు ధరించి కాలేజీకి వస్తూండేది. ఒకనాడు ఆమె క్లాసులోంచి బయటకు వస్తోంది. ఆమెతో మరి నలుగురు అమ్మాయిలు ఉన్నారు. వారి వెనకాల రమణారావు ఇద్దరు స్నేహితులతో వస్తున్నాడు. వారి వెనకాల ప్రిన్సిపాలు వస్తున్నాడు.

రమణారావు ప్రిన్సిపాలుని గమనించలేదు. తన స్నేహితులతో గొప్పగా, "ఆ పరికిణీ, ఓణీ వేసుకున్న అమ్మాయినేరా నేను ప్రేమించాలనుకొంటున్నది" అన్నాడు. హేమలత వెనక్కైనా చూడకుండా, "మన వెనకాల వాగుతున్న అబ్బాయినేనే, నేను ఎడంకాలి జోడుతో కొట్టాలనుకుంటున్నది' అంది. ఆ మాటలు విన్నవాళ్లంతా పకాలుమని నవ్వారు. రమణారావు తెల్లబోయాడు. వెనకాల నుండి ప్రిన్సిపాలు, "ఆ డోసు చాలనుకుంటాను నీ పైత్యానికి" అని, రమణారావుని చూసి వెళ్లిపోయారు.

కాలేజీ అంతా, రమణారావు మాటలకి హేమలత యిచ్చిన జవాబు తెలిసిపోయింది. ప్రతివారూ 'బలేగా జవాబిచ్చిందిరా!' అంటే 'బలేగా పాఠం చెప్పిందిరా!' అని అనసాగారు. లేడీస్ గదిలో అమ్మాయిలంతా, హేమలతని అభినందించారు. శ్రీదేవికి ఈ సంఘటనతో, కాలేజీలో చాలామందికి రమణారావంటే అసహ్యమనీ, నిజానికి విద్యార్థులలో అందరూ అమ్మాయిల నేడిపించే దృష్టితో ఉండరనీ తెలిసింది. చాలామంది, మనసులో ఇష్టం లేకపోయినా, పైకి, ఎవరో రౌడీతనం ప్రదర్శిస్తూంటే— బాధపడేది తాము కాదుకదా అని—ఆనందిస్తారని గ్రహించింది. అంతే కాక, ప్రిన్సిపాలూ, లెక్చరర్లూ మొదలైనవారంతా వీలైనంతవరకూ విద్యార్థినులను, ఈ రౌడీల బారి నుండి తప్పించాలని చూస్తారని, అందువల్ల వెకిలి మాటలనడం తప్ప ఈ కుర్రాళ్లు చేయగలిగిం

41-వ పేజీ చూడండి



చిన్న కోతలను,
గాయములను
మరియు
దెబ్బలను



జాన్సన్స్

బ్యాండ్-ఎయిడ్

ప్రథమ చికిత్స పట్టీలతో కప్పండి!

బ్యాండ్-ఎయిడ్ ప్రథమ చికిత్స పట్టీలు

- రోగ క్రిములను అంటనీయవు
- గాయములను నీరు పట్టకుండా మరియు శుభ్రముగా ఉండేలా ఉంచును
- గాయములను త్వరగా మానేలా చేయును
- చర్మమునకు గాలిని తగలనీయును
- ఒక్కొక్కటే విడివిడిగా ప్యాకు చేయబడినవి.... తీసుకొనిపోవుట సులభము ... ఉపయోగించుట తేలిక



బ్యాండ్-ఎయిడ్ ప్రథమ చికిత్స పట్టీలను ఎల్లప్పుడూ సిద్ధముగా ఉంచుకోండి!

జాన్సన్ & జాన్సన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

జాతీయ సేవకు రెడ్ క్రాస్‌లో చేరండి!

అ. దుర్గాప్రసాద్

సినిమాలూ - జాతీయసమైక్యతా

అందరికీ అందుబాటులో వినోదం అందిచ్చే సాధనం సినిమా. సాధించలేని అనేక ప్రయోజనాలను సినిమా సాధించగలదని అనడం పరిపాటయి పోయింది. సినిమా జాతీయ సమైక్యతా సాధనంగా ఏనాడూ ఉపయోగపడలేదు. ఏనాడూ ఉపయోగ పడదు.

అత్యధిక ప్రచారం గల ఈ సాధనంద్వారా సాధించలేని ప్రయోజనాలు సాధించా లనుకోవడం నిష్ప్రయోజనమే కాక, సినిమా ఉపయోగాన్ని ఆవలకు నెట్టడమే.

అర్థశతాబ్దపు భారతీయ చలనచిత్ర చరిత్రలో అసాధారణము, అపూర్వము అయిన విజయాలను మనం పేర్కొనవచ్చును. విప్లవాత్మకమైన పరిణామాలను మనం గుర్తించవచ్చును. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, నైతిక వ్యవస్థలకు దర్పణాలుగా నిర్మింపబడి ప్రశంస లందుకొన్న కళాఖండములను చూపించవచ్చును.

రెండవ బహుమతి వ్యాసం

ఇక దక్షిణ భారతదేశంలో ఉత్తర భారతీయ చిత్రాలు రజతోత్సవాలు చేసుకొంటే, అది జాతీయ సమైక్యతకి తార్కాణమా ? దక్షిణ భారతీయులకు హిందీ అర్థం కావడమే అందుకు కారణం. ఉత్తర భారతంలో ఒక దక్షిణ భారతీయ భాషా చిత్రం అర్ధమాం వారం రోజులు వరుసగా ప్రదర్శింపబడిందా? అంటే, జాతిలో సమైక్యత లేదని భావించుకోవాలి అర్థమా ? పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే 'మిత్రత్వము' గల దేశాల్లో ఆంగ్ల భాషా చిత్రాలు ఆదరింపబడి విజయవంతముగా ప్రదర్శింపబడడానికి ప్రధాన కారణంగా ఆంగ్లము 'ప్రపంచ భాష' అని ఈ సందర్భంలో పేర్కొనవచ్చును.

దశాబ్దం క్రితం శాంతారామ్ నిర్మించిన ఒక చిత్రంలో ఒకే కుటుంబంలో వివిధ రాష్ట్రాల స్త్రీలను ప్రవేశపెట్టారు. ఆ చిత్రం ప్రజలకు నిస్సందేహంగా వినోదం అందించింది. శాంతారామ్ చేసిన ప్రయోగం ఆయనకు ఆర్థిక విజయాంతెచ్చి పెట్టింది. కాని, ఆ పాత్రలు ఏ ప్రాంతానికి చెందినవని చెప్పబడ్డాయో, ఆ ప్రాంతాల ప్రజలు భాషా రాష్ట్రాలు ఏర్పడడానికి నాంది పడిన ఆ కాలంలోనైనా, ప్రాంతీయ దురభిమానాలు లేకుండా దేశాభివృద్ధికి తోడ్పడ్డారా ?

హిందీ — ముస్లిమ్ సమైక్యత ప్రధాన ఇతివృత్తంగా నిర్మించబడిన చిత్రాలు అవిభక్త భారత దేశంలోనే కాక, దమిలా కూడా నిర్మించబడ్డాయి. ఆ చిత్రాలు ఏమి సాధించాయి ? ఆ చిత్రాలు చూచి చెంపలేసుకుని హిందూ, ముస్లిములు కౌగలించుకొన్నారా ?

ఒక భాషకు చెందిన కళాకారులు వేరొక భాషా చిత్రంలో పాల్గొన్నా, ఒక భాషా చిత్రాలను వేరొక ప్రాంతంలో విజయ వంతముగా ప్రదర్శించినా జాతీయ సమైక్యత సాధింపబడుతుంది అని అనుకోవడంలో అర్థంలేదు.

వినోదం ప్రధానంగా అందిచ్చే ఈ సాధనాన్ని ప్రచారానికి ఉపయోగిస్తే, అది ప్రభుత్వంనుంచి ప్రశంసలు, బహుమతులు పొందవచ్చు కాని, ప్రేక్షకులు ఆశించే కనీస వినోదం అందించదు. ఏ విధమైన చైతన్యము కలిగించదు.

ఒక రాజకీయ నాయకుడు వేదికమీద చెప్పింది విని, ఒక కవి వ్రాసింది చదివి, తమ అభిప్రాయాలను ప్రజలేనాడూ మార్చుకోలేదు; మార్చుకోలేరు.

ఇది ఇలా ఉండగా సినిమాలు ప్రజలలో అవాంఛనీయమైన పరిణామాలకు తోడ్పడుతున్నాయని వినోబాభావే, లీలావతీ—మున్షీ మొదలగువారు అనడంలో నిజం లేకపోలేదు. ప్రతీ పరిశ్రమా లాభదాయకమైన సంస్థలో పురోగమించడానికి ప్రయత్నిస్తుంది. ఆ లాభాలు ఆర్జించటానికి 'కృషి' జరుగుతోంది. ఇది క్షమించరాని విషయ మయినా పరిపాటయిపోయింది. అలాగే సినిమా; ఇదీ పరిశ్రమే కనుక లాభాలు ఆర్జించడానికి కొందరు నిర్మాతలు తమ చిత్రాలలో ప్రజలు పదేపదే చూడడానికి కొన్ని 'ఆకర్షణలు' ప్రవేశ పెడుతున్నారు. ఇవి సభ్యప్రపంచము సహించలేనివి; క్షమించరానివి. అన్ని చిత్రాలూ ఇలా ఉన్నాయా అంటే లేవు.

ఏ విధమయిన విభేదాలు లేక, భారత జాతి ఒకే త్రాటిమీద ఉంది నేడు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న క్లిష్టపరిస్థితి దృష్ట్యా ప్రబోధం ప్రధాన ఇతివృత్తంగా చిత్రాలు నిర్మిస్తే, అవి ప్రచార సాధనాలుగా మిగిలిపోతాయి. ప్రభుత్వం ప్రచార చిత్రాలు నిర్మిస్తే ఫరవాలేదు. కాని వేరే నిర్మాతలు ఈ పని చేస్తే, ఎన్నడూ లేని ఈ మంచి బుద్ధి వాళ్లకు ఎందుకు కలిగిందంటే ఊహించుకోవచ్చు.

కాబట్టి చలనచిత్రాలు జాతీయ సమైక్యతా సాధనాలుగా రాజకీయపు బురఖాలు తొడుక్కొని రాకుండా ఉంటే చాలు. ప్రజలకు ఆయా భాషల్లో దృశ్య—శబ్ద కావ్యము వినోదం అందించడమనే తమ ప్రయోజనం నెరవేరుస్తే అదే పదివేలు. ★



"ఏం చెయ్యమన్నావ్ ? బ్రదర్ ? ధరలు పెరిగి [illegible] రెండు సిగరెట్లు, ఆరు బీడీలు మాత్రమే శాంక్షన్ చేసింది !..."



బిడ్డత

ఎ. వేణుగోపాలరెడ్డి

"అబ్బాయి ఎటుబోయాడు సుబ్బరామయ్యా?"

గుడ్డలంగట్లోకి అడుగెడుతూనే, గల్లాపెట్టె ముందరిసీటు ఖాళీగా ఉండటంచూసి కంగారుగా అడిగాడు, అంగటి స్వంతదారు కోటిలింగంశెట్టి, లెక్కల గుమాస్తా సుబ్బరామయ్యనుద్దేశించి.

శెట్టిని చూడటంతోటే సీట్లోంచి లేచి నిల బడి ముక్కు చివర కూర్చొనున్న కళ్లద్దాలను పైకి సవరించుకుని, నమ్రత ఉట్టిపడేలా 'అబ్బాయి గారు యిప్పుడే వో పావుగంట ముందు మ్యాటినీ సినిమా కెళ్లాలని వెళ్లారండి. మీ రొచ్చేదాకా అంగడి చూసుకుంటూండమని చెప్పి తాళం చెవి నా చేతికిచ్చి వెళ్లారు." అంటూ తన ఖద్దరు చొక్కా జేబులోంచి గల్లాపెట్టె తాళంచెవి తీసి అతనిచేతి కిచ్చిడు సుబ్బరామయ్య.

శెట్టి గల్లాపెట్టె ముందర కూర్చుని, పాలో చనగా వీధిలోకి చూస్తూ "వీడితో ఎల్లా వేగడ మబ్బా. మరీ హద్దుమీరి పోతున్నాడే ఒక్క గంట సేపు యిక్కడ కూర్చోరా భోజనంచేసి వస్తానని వచ్చేలోపల ఏదో రాచకార్యం ముంచుకు పోయి నట్లు సినిమాకు ఉడాయిస్తాడా ? .... సుబ్బ రామయ్యా .... వాడొక్కడే వెళ్లాడా లేక వాడితో గూడ యింకెవరన్నా" వాక్యం పూర్తిచేయక మునుపే సుబ్బరామయ్య అందుకుని "రాజశేఖరంగా రబ్బాయి శివరాంతో కలిసి వెళ్లాడండి" అని జవాబిచ్చాడు.

శెట్టి వెంటనే వెటకారంగా కనుబొమ లేగరేసి "ఆ అదీ, అనుకున్నా. ఆ శివరాంగాడికి అసలు పనిపాటా లేదు. వాడు తిరిగేది చాలక వీడి గూడ చెడిపేస్తున్నాడు" అని అన్నాడు.

అంగడంతా గుడ్డలు కొనడానికి కొచ్చిన జనంతో సందడిగా ఉంది. శెట్టి యాంత్రికంగా ఖాతా దార్లు అందిస్తున్న డబ్బు పుచ్చుకుని బిల్లు చూసి వాళ్లకు చిల్లర యిస్తున్నాడే గాని అతని మన స్పంతా కొడుకు నిర్లక్ష్యానికీ, అశ్రద్ధకూ చింతా క్రాంతమై పోయింది. "ఎలా వాడిని దారికి తీసుకురావడమా" అనే ఆలోచనతో అతని మనసు సతమతమయిపోతోంది. వాడిలా ప్రవర్తించటానికి తనూ, తన భార్యా కూడా చాలవరకు కారకులే. వచ్చిన చిక్కల్లా ఏమిటంటే రామానందం అత నికి లేకలేక ఏళ్లతరబడి దిక్కుమాలిన వ్రతాలూ, నోములూ చేసి అడ్డమొచ్చిన దేవుళ్లకూ, దేవతలకూ మొక్కగా కలిగినవాడు. అందువల్ల చిన్నప్పట్నించీ వాడికి అమ్మా, నాన్నా దగ్గర్నించేగాక చిన్నాన్న పెదనాన్నల దగ్గర్నించి కూడ గారాబానికి కొదవలేదు. వాడు చిన్నప్పుడు ఎంత అల్లరిచేస్తే అంతకు రెట్టింపు మురిపెం కురిపించేవాళ్లు శెట్టి దంపతులు. అందువల్ల యిప్పటికీ యింట్లో వాడు 'ఆడిందిఆట, పాడింది పాట' గా సాగిపోతోంది. ఇక రామానందం చదువు విషయంలో "చదివినోడికన్నా ..... మేలు" అనే సామెత నిజమేనని ఋజువు చేయబోయాడు. వాడు చదివే తరగతి సంఖ్యకన్నా, వాడి వయస్సు త్వరగా పెరగడంతో "ఆ. మనబోటి వ్యాపా రస్థులకు ఎందుకొట్టి పెద్ద చదువు. చదివింది చాలు నాయనా" అని శెట్టి తృప్తిపడి రామా నందానికి చదువనే బాధ కాస్త తొలగించేశాడు— యిక వాడికి తన అంగటి వ్యవహారం అప్పజెప్పుదా మనే అభిప్రాయంతో కానీ అది ఫలిస్తేగా ! రామానందానికి అస్తమానూ అడ్డదిడ్డాలు తిరగడ మన్నా, చీట్లాట ఆడడమన్నా ఎవరికీ లేనంత వోపిక. అదే ఓ గంటసేపు కుదురుగా అంగట్లో క్యాషియరు సీట్లో కుర్చోమంటే వల్ల మాలిన చికాకూ, బద్ధకమూను.

శెట్టికి వాడి తరహా నచ్చలా. ఇక లాభం లేదని అతను కుమారుడిమీద మనస్సు కాస్త కఠిన పరుచుకుని ఏదన్నా కోపంగా మాట్లాడబోతే అతని భార్యకు వాడిమీది చనువు కాస్త తటాలున అడ్డుపడుతూంటుంది అసలామె వాడిమీద ఈగ నైనా వాలనిస్తేగా ! "చాల్లెండి మీరు మరీ. వాడిమీద వేళాపాళా లేకుండ రుసరుసలాడుతుం టారు. వాడికి మహా ఎన్నేళ్లొచ్చాయని. మీలాగ యిప్పట్నుంచే అంగట్లో పడుండమంటారు. మనకు కొడుకన్నా, కూతురన్నా వాడొక్కడే నాయె" అని వాడిని వెనకేసు కొస్తుంది శెట్టి భార్య ముత్యాలు. రామానందం, తల్లి ఆసరా చూసుకుని మరీ పెంకి ఘటమై పోతున్నాడు. తను ఎలా వేలం అంగటితో మొదలెట్టి దాదాపు పదమూడేళ్లు అష్టకష్టాలూ పడి దీక్షతో యిప్పుడు తన అంగడిని ఆ బజారులో చెప్పుకో దగ్గంత పెద్దదిగా చేసింది, గుర్తించలేక పోతు న్నారే తన భార్యా కొడుకూ అని అప్పుడప్పుడు వాపోతూంటాడు శెట్టి. నయానా, భయానా చెప్పి చూశాడు కొడుక్కి వ్యాపారం అంటే ఏమిటో. "వ్యాపారం అంటే లాటరీలాంటిదిరా నాయనా. ఎల్లకాలం పచ్చగా సాగిపోతుం దనుకోటానికి వీల్లేదు. అంచేత కాస్త మెలకువతో కనిపెట్టుకో నుండక పోతే ఎప్పుడు నట్టేట ముసుగుతామో చెప్పలేం" అని వాడికి శతవిధాల చెప్పి చూశాడు. ఆ చెప్పినంత సేపూ మారు పలక్కుండా బుద్ధిగా వింటాడు రామానందం. రెండు మూడు రోజులు శ్రద్ధగా అంగటి వ్యవహారాలు చూసుకుంటాడు గూడ. కానీ మళ్లీ "నా దారి నాదే" అనే తీరుకు వచ్చేస్తాడు. శెట్టి యిక విధిలేక కొన్నిసార్లు వాడి కింకా "కుర్ర తనంగదా" అని తనే సమాధాన పరుచుకుంటాడు. మరికొన్నిసార్లు "ఇంకా కొన్నాళ్ళ పోతే ఆ తిరగడం, సినిమాలూ, పేకాటలూ—పోతే మోజు కాస్త సన్నగిల్లితే యిక దారికిరాక పోతాడులే' అని అనుకుంటాడు!

—36 వ పేజీచూడండి

బొంబాయి ఆంధ్ర మహాసభ పోటీలో బహుమతి పొందిన కథ

హమేషా తమాషా!

ఉగాది సణుగుడు

మధ్య[మ]తరగతి సణుగుడు :

బంగారం లాక్కుంటానంటే అదేపోయె
ఉన్నది కాస్తా అమ్మి అప్పులేనా తీర్చుకున్నాం;
కిర్సనాయిలు ఖరీదు పెంచేస్తే
సరే! సారాయిల్లా వాడుకుంటున్నాం.

కాని! హే! మొరార్జీ! హా! ఛేక్సానురా !!
బనా, చేశావు కాదయ్యా నువ్వు మా కో హెల్పు!
గోల్డుమార్కు సిగరెట్ లుతాగే అల్లుళ్లకు
బీడీలు కాల్చాలని ఓ 'ఏక్టు' చేసినా బాగుణ్ణు
లేదా ఆ పన్ను వాళ్ళనెత్తిన వేసినా బాగుణ్ణు.

పైలా పచ్చీస్ తరగతి సణుగుడు :

హే! "చాణక్యా" సారీ! హే! మొరార్జీ! నీ అర్థశాస్త్రరీతి
నిలువునా తీసింది కదయ్యా మా పరువు
పబ్లిక్‌గా సరోజా! కోమలా
చూస్తూ ఉండగా 'చైన్ స్మోకింగ్' యింపాజిబిల్ గదా!
ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ కూడా
'ఎమర్జన్సీ' మూలాన నానాన్నారి నింత పిసురు కదుపనేలేము గదా!

అదిసరే! యిది విను!

కాఫీ ఏం చేసిందయ్యా నిన్ను?
'బుద్ధుడు' ఈ భూమ్మీద పుట్టిన
నేరానికి 'పన్ను' 'పన్ను' 'పన్ను' మంటూ
అన్ని 'తాగుళ్ళ' మీద విరుచుకుపడటం శాస్త్రమా'?!
ఇలా 'యువత'ను నీళ్లు గార్పజేయడం భావ్యమా!?

పరువం లోని భామల సణుగుడు:

అందాలకు చిట్కా ఫలానీ 'సబ్బ'ని
అందాల తార అట్టమీద బొమ్మలో ఒప్పుతుంది·
కాని ఆర్థికమంత్రిసత్తమా!
స్త్రీలమీదింత కీతకన్ను వేస్తారా?
బంగారం పోతేపోయె ప్లాస్టిక్ వుంది;
సింగారానికి ఎర్రని లిప్‌స్టిక్ కూడా వుంది.
కాని సబ్బులనెత్తిన పన్నులు విగించి
మా అందాలను కంట్రోలు చేయడం నీకు భావ్యమా!!

(తెరలో) మొరార్జీ కంఠం: 'పన్నే'
'పన్నే' కాపాడున్ మనలను
'పన్నే' అనగా 'టాక్సే'
అనగా పన్నే మన లోటును పూడ్చున్!

—సీ రాజీ

నమ్మండి!

నుదుట తిలకం తప్ప వంటిమీద ఒక్కనగ గూడా లేని స్త్రీ పాత్రలు గల ఒకచిత్రం విడుదలయినోంది(ట) ప్రభుత్వానికి ప్రచారం ధనంగానూ, ప్రజలలో ప్రబోధం కలిగించేదిగానూ ఆ చిత్రం ఉపయోగపడుతుంది కనుక ఈ సంవత్సరం రాష్ట్రపతి సువర్ణపతకం (14 వన్నెల బంగారంతో చేసినది) ఆ చిత్రానికే దక్కవచ్చు.

అ. దుర్గాప్రసాద్ (మద్రాసు)

మేల్కొనవయ్యా! బస్తీప్రియా!

1. ఖగముల్ మేల్కొని గొంతు విప్పినవి, వికన్ రేడియో ధ్వనముల్
నగరం బంతట వ్యాప్తి జెందె నపుడే నక్షత్రముల్ జారె నీ
యుగ యంత్రాల చలింపజేయుటకు విద్యుద్దీపముల్ మల్గె, షా
కుగ సూర్యుండదె వెల్గుచుండె నిక మేల్కొనవయ్యా బస్తీప్రియా!

. కాఫీ త్రాగెడి వేళ మించె జలముల్ కాకన్ గనెన్, గడ్డముల్
సాపుం జేయగ, బ్రష్షు, బ్లేడు మొదలౌ సంబారముల్ వచ్చె, నీ
కాఫీనున్నది, ఆదివారమని నీ వట్లే పడున్నావొకో
కోపంబున్ వలదోయి, తప్పదిక మేల్కొనవయ్యా బస్తీప్రియా!

3 నల్గా పోయెడి వేళయయ్యె, ప్రజ నానావిధ కార్యాలపై
ఉల్లాసంబున పోవగా దొడగె, నా యుద్యోగి బృందంబులున్
మెల్లంగా జనినారు వేవిధములన్, మేస్త్రీలు, కూలీలు, కో
కొల్లల్గా పని కేగుచుండి రిక మేల్కొనవయ్యా బస్తీప్రియా!

4 శిశువుల్ రోదన సేయుచుండ గృహిణీ చిత్తం బదెట్లుండు! "మీ
కళవం బబ్బిన దెట్లు పల్లెముప" కంచున్ క్రోధ రక్తాక్షియై
మశితో నిండిన చేత పిల్లలను కొట్టన్ బూనె, నీ వింక నీ
కుశలంబున్ గమనించి వేగముగ మేల్కొనవయ్యా బస్తీప్రియా!

5. అప్పారావు, కిరాణదారు, మరి పాలమ్మాయియున్, డబ్బుకై
చెప్పంగా జనుదెంచి వేచికొని యా చెంతన్ భవత్పూర్తియున్
తప్పన్ వారికి పోవలేదు, ఇక నీ చిత్తంబు ఏమన్న నీ
గొప్పల్ పోవవో నిర్ణయించుకొన మేల్కొనవయ్యా బస్తీప్రియా!

—శ్రీ భాష్యం శ్రీనివాసాచార్య
(విలాసపురం)

* * *

విచిత్ర సంభాషణ

[ఈ క్రింది సంభాషణను త్రిప్పి చది వినా అదే]

కిట్టయ్య : రారా! శ్రీశ్రీ! రారా!
శ్రీశ్రీ : యాటకి రాకియా!
కిట్టయ్య : సినిమకురా పరాకుమనిసి!
శ్రీశ్రీ : రాలేనుకేరా!

కె. జి. జయరామిరెడి

సినీ సీమలో సంగీతం

సుమారు రెండు దశాబ్దాల నుంచీ సంగీత దర్శకునిగా, నేపథ్యగాయకునిగా సినిమా సంగీత ప్రపంచంలో నేను చేసిన పరిశ్రమకు ఆధారభూతమైన విశ్వాసాలు, తద్భవమైన అనుభవాలు రసికులూ, రసజ్ఞులూ అయిన ప్రేక్షకలోకానికి తెలియజేయడం అప్రస్తుతం కాదనే నమ్మకంతో ఈ మాటలు వ్రాస్తున్నాను. తన సాధనా, కృషి, ఫలించాలంటే, సార్థకత చెందాలంటే ప్రతి కళాకారుడూ ప్రజలతో తనకు గల సంబంధాన్ని నిత్యమూ గుర్తిస్తూ, కళారంగంలో తనకున్న బాధ్యతలను, యెదుర్కొనవలసిన శక్తులను వారికి తెలియజేస్తూ వారినుండి విజ్ఞతాపూర్వకమయిన సలహాలను, అభిమానోపేతమయిన సానుభూతినీ పొందుతుండటం అవసర మవుతుంది.

ప్రతిజాతి సంస్కృతీ కళారంగంలో తన కృషినీ, ధ్యేయాన్నీ, ఒక విశిష్టమైన పద్ధతిన రూపొందించుకొంటుంది. భారతదేశం కూడా సహస్రాబ్దాలుగా లలితకళ లన్నిటిలోనూ తన విశిష్టతను అడుగడుగునా ప్రస్ఫుటంగా ప్రకటిస్తూ తన సాధనను కొనసాగిస్తూనే ఉంది.

భారతీయ జీవన రంగంలో సంగీతకళ కున్న స్థానం మరే సంస్కృతిలోనూ లేదని చెప్పడం సాహసంకాదు. భారతజాతి అనాదిగా, సంగీతకళను ప్రత్యేకమైన విధానాలతో, విభిన్న మార్గాలలో వయనింపజేసి ఎంతో ఉజ్వలమైన ఫలితాన్ని సాధించింది. సంప్రదాయసిద్ధమైన ఈ కళా విశేషాన్ని విస్మరించి మనం ఏవిధమైన అభివృద్ధినీ సాధించలేము.

భారతీయ సంగీతం ఎన్ని భిన్న సాంప్రదాయాల్ని అనుసరించినా, ఎన్ని భిన్న రీతుల్ని ప్రదర్శించినా, రస సిద్ధిలో ఈ భిన్న ఫణుతులు అవలంబించే మార్గములో ఒక విచిత్రమైన ఐక్యతను ఏర్పరచుకొంది. సూక్ష్మంగా పరిశీలిస్తే, భారతీయ సంగీతంలో — ఏ ప్రాంతపుదైనా సరే— ఈ ఏకత్వం గోచరించక మానదు.

ప్రధానంగా భారతీయ సంగీత ప్రవంతి రెండు రసవాహినులుగా ప్రవహించినది. ఒకటి స్వరరాగ తాళ ప్రధానమైనది. శాస్త్రీయమైన వ్యక్తిత్వాన్ని కలిగినది. నాదోపాసన కుపయుక్తమైనది. రెండవది జీవన శకట ప్రయాణానికి ఆహరహమూ అయి కలుపుతూ నిత్య జీవితాన్ని సుమధురం చేసేది. మొదటిది 'మార్గ' సంగీతమని, రెండవది 'దేశి' సంగీతమని పండితులు చెప్పారు. ఒకటి రసాత్మక మైనది. రెండవది భావాత్మక మైనది. ఒకటి స్థితి ప్రధానమైనది, మరొకటి గతి ప్రధానమైనది. జీవితంలోని వైవిధ్యాన్ని తొలగించి ఒకే నాదాత్మలో స్వరాన్ని అనుభవింపజేసేది మార్గ సంగీతమైతే ఒకే ఆత్మను జీవితంలోని వివిధ రంగాలలో ప్రతిబింబించి హృదయ స్పందనం కలిగించేది దేశి సంగీతం.

మార్గసంగీత సంప్రదాయసరళి ఉన్నత వర్గాన్ని ఆకర్షించి రాజాస్థానములలోనూ, దేవస్థానములలోనూ తన ప్రతిభను ప్రసరింపజేస్తే, దేశి సంగీతం ప్రతి పామరుని హృదయాస్థానంలోను సింహపీఠం వేసుకొంది. మార్గసంగీతం భారతీయాత్మను తాత్వికమైన రసానుభూతితో మైమరపింపజేస్తే దేశి సంగీతం ఐహికమైన రస పుష్టితో ప్రజావీకాన్ని మురిపింపజేసింది. ఇందు చేతనే శాస్త్రీయ వాగ్గేయ రచనలలో భక్తి భావానికే అధికమైన ప్రాచుర్యం లభించింది.

ఒకవిధంగా అనుకోవచ్చును. శాస్త్రీయ సంగీతం భక్తిభావ పునీతమైతే దేశి సంగీతం నవరసభరితం. జీవితంలోని ప్రతి రసాత్మక సన్నివేశాన్ని తనలో యిముడ్చుకొంది దేశి సంగీతం. ఈ భిన్న రసాల సన్నివేశాలను ఒకే నాదవర్ణంలో చిత్రించినది మార్గ సంగీతం.

ఉడుపుల వేళల్లో పచ్చని పొలాల్లో పనిచేస్తూ, తమ కష్టాన్ని మరచి గొంతెత్తి పాడే పల్లె పడుచుల పాటలలోనూ, నూర్పుల కళ్లాలలో ఆనందోత్సాహంతో వూగుతున్న రైతు యువకుల పదాలలోను, ఏలేలో పాటలలోనూ, జోల పాటలలోనూ, పెండ్లి పాటలలోనూ, వదినా మరదళ్ల సరాగాలలోను, ఆలూ మగల సరసాలలోనూ, అత్తా కోడళ్ల సంవాదాలలోనూ, నలుగు పాటలలోనూ, తత్త్వ కీర్తనలలోనూ, పడవ పాటలలోనూ యక్షగానాలలోనూ, బుర్రకథలలోనూ, గొల్ల సుద్దులలోనూ, వీధి భాగవతాలలోనూ, జముకుల పాటలలోనూ వినిపించేది దేశి సంగీతమే.

ఇంతవరకు మన జాతీయ సంగీతం, మార్గ పద్ధతి అయితేనేమి, దేశి పద్ధతి అయితేనేమి, వివిధ శాస్త్రీయ సంగీత రచనల రూపంలోనూ, పద్య పఠన రూపంలోనూ, హరికథాది రూపాలలోనూ, పైన చెప్పుకున్న దేశీయ రూపాలలోనూ వ్యక్తమయింది.

ప్రస్తుత నాగరిక జీవన విధానాన్ని బట్టి, పాశ్చాత్య సంగీత ప్రభావాన్ని బట్టి, వ్యావహారిక భాషా ప్రాభవాన్నిబట్టి ఒక నూతన సంగీత సంప్రదాయం భారత సంగీతంలో రూపొందించు కొంటున్నది. ఇదే సినిమా సంగీతం. ప్రజా బాహుళ్యంలో సినిమాల కున్న ఆశేషాదరాన్ని బట్టి ఈ నూతన సంగీత సంప్రదాయ నిర్మాణం అతి ఉత్సాహకరంగాను, అతి త్వరితంగాను సాగుతున్నది. కొంత కాలంగా నిశ్చలంగా ఉన్న మన దేశీయ సంగీతం సినిమా కళయొక్క అభివృద్ధితో నూతనోత్తేజాన్ని పొంది కొత్త రంగులు సంతరించుకొంది.


ఈ నూతన సంగీత సంప్రదాయ నిర్మాణం సినీ సంగీత దర్శకుల ప్రతిభా విశేషాల బట్టి నిర్మింపబడుతున్న దనడం సాహసం కాదు. కారణం ఏమంటే మన మార్గ సంగీతకళ ఏవిధమైన మార్పుల్ని చేర్పుల్ని సహించగలిగే స్థితిలో లేదు. ఏవిధమైన పరిణామమైనా, తన విశిష్టతకు భంగం కలిగిస్తున్నదేమో యని భయపడుతున్నది. అందుచేత సంగీతంలో నూతనమైన ప్రయోగాలనూ, వినూత్నమైన విశేషాలనూ, విచిత్రానుభూతులను, వివిధ మార్గాలలో అభివృద్ధులను సినీ సంగీత దర్శకుల నుండి మాత్రమే దేశం ఆశిస్తున్నదనడం వాస్తవం.

ఇటువంటి పరిస్థితిలో సంగీత దర్శకుడు మన జాతీయ ధోరణులైన రసాత్మక ప్రాధాన్యమైన మార్గ సంగీతాన్నీ, భావాత్మక ప్రాధాన్యమైన దేశి సంగీతాన్ని, విజాతీయ సంగీత రీతుల్ని, తన నూతన సంప్రదాయ సృష్టికి ఉపకరణములుగా తీసుకొంటున్నాడు.

ఈ నూతన సంప్రదాయ నిర్మాణం ఉత్తర భారతదేశంలోనే ప్రారంభింపబడిన దనటం సాహసం కాదు. సినిమా పరిశ్రమకు పూర్వం కూడా మన నాటక సంగీతంలో పద్య పఠనానికి శాస్త్రీయ సంగీత రాగాలనూ, పాటలకు ఉత్తర దేశ లలిత సంగీత రచనలనూ ఒరవడిగా తీసుకొనడం జరిగింది. అయితే ప్రస్తుతం ఈ సంప్రదాయ నిర్మాణం సినిమాయొక్క పారిశ్రామిక పరిమితుల్నిబట్టి మాత్రమే సాగుతున్న దన్నమాట యదార్థం.

నేటివరకూ నడచినసినిమా సంగీత చరిత్ర ఒకమారు సింహావలోకనం చేస్తే తొలినాటి సినిమా సంగీతంలో శాస్త్రీయసంగీత ప్రభావమే ఎక్కువగా ఉండి రాగ ప్రధాన రచనలే ఎక్కువగా కనబడతాయి. కాని కాలక్రమాన సంగీత దర్శకులు భాషయొక్క పలుకుబడికీ, నుడికారపు గమనానికీ, భావావేశానికీ దేశి సంగీతమే అనుకూలమైనదని గ్రహించారు. ఈ దేశి రీతిని సినిమా సంగీతంలో మొదట ప్రవేశపెట్టిన మార్గదర్శి నౌషద్ అనేమాట సర్వ జనామోదం పొందుతుందనే నమ్ముతున్నాను. దేశి సంగీత పద్ధతులలో, ప్రతి రసాత్మక సన్నివేశానికీ ఆయన తన సంగీత రచనలతో రూపించిన రాగం తాళముల ప్రయోగం సమకాలిక సంగీత దర్శకులకు స్వీకారయోగ్య మయినది. శృంగారగీతాలు, యుగళగీతాలు, విషాద గీతాలు, ప్రేమగానాలు, బృంద గానాలు మొదలైన ఆయన

—34 వ పేజీ చూడండి



రచయిత శ్రీ ఘంటసాల.

దేశ రక్షణకై ఆయుధాలు
ఎంత అవసరమో ఉత్పత్తి కూడా అంత అవసరమే!

కమెండేటర్ — గ్యుసెప్పిదోసి

ముక్కలుగా వచ్చిన స్త్రీ

కొత్తగా జరిగిన ఏ హత్యయినా సరే పరిశోధించవలసి వచ్చినపుడు అనుకోకుండా నా మనస్సు— కౌంట్ సిసేరీ సెర్వియటీ చేసిన భయంకర హత్యాకాండల మీదికి వెళుతుంది.

చురుకుగా 'స్టాంప్ ఫోర్జరీ' చేసే అసంఖ్యాకులైన (పని) వాళ్లను పట్టుకోవడంలో, మత్తు పదార్థాలను (నిషేధింపబడినవి) రహస్యంగా అమ్మే వాళ్ళను పట్టుకోవడంలో, నేను పడ్డంత శ్రమ— పడకపోయినా — మామూలు అపరాధ పరిశోధకులు పడే అంత శ్రమా— సెర్వియటీని పట్టుకోడంలో పడ్డాను.

సెర్వియటీ డబ్బుకోసం ఆడవారిని ఆకర్షించి, హత్యచేసి— గొడారివాడిలా వాళ్ళ శరీరాల్ని ముక్కలు ముక్కలుగా కోసేవాడు.

ఇటాలియన్ సైన్యంలో పనిచేస్తున్న అతని తండ్రి— సెర్వియటీని బహు చిన్నతనంనుంచే జాగ్రత్తగా 'భ్రష్టుణ్ణి' చేశాడు. చచ్చిపోయే సమయంలో— పద్దెనుగేళ్ళ సెర్వియటీని చేరదీసి "స్త్రీలు సృష్టింపబడింది మన ఆనందంకోసమే! నీ కోర్కెలు తీర్చలేనినాడు స్త్రీ 'ఉండడం' అనవసరం" అని బోధ చేశాడు. ఆనక తను ఖర్చు చేయగా మిగిలిన కొంత ఆస్తి, లలిత కళలమీద అభిరుచీ కొంచెం, సమయానుకూలంగా మార్చుకునే తత్వజ్ఞానం వదిలేసిపోయాడు.

కానీ, దురదృష్టవశాత్తూ అతని తల్లి ఈ చెడు తలపులకు దోహదం ఇవ్వలేక, కొడుక్కి చెడ్డయ్యింది. త్రాగుడుకి బాగా అలవాటుపడిన ఆమె — భర్త వదిలిన ఆస్తిలో చాలా భాగం త్రాగుడుక్రింద ఖర్చు చేసింది. కీళ్ళవాతంతో ఆమె చనిపోయిన తర్వాత "హమ్మయ్య" అని సెర్వియటీ నిబ్బరంగా గాలి పీల్చాడు.

కొద్దికాలంలో మిగిలిన ఆస్తి అతని చేతికి వచ్చింది. స్వతహాగా ఉద్యోగంమీద ఆపేక్షా, ఆశా, అర్హతా లేనందువల్ల 'సిసేరీ సెర్వియటీ' ఆ డబ్బుతో లాస్పిజాలో ఒక షాపు నడుపుతున్న రోజ్ అనే ఆమెతో చేరాడు. ఆమె అతని కన్నా, పదేళ్ళు పెద్దది. కొన్నాళ్ళపాటు వారి 'పొత్తు' ఏ గొడవా లేకుండా సాగింది. కానీ, రానురాను ఆమెను డబ్బుకోసం పీడించడంవల్ల కలహాలు ప్రారంభమయ్యాయి. ఆమె సంపాదనంతా అతని ఖర్చుకి కూడా చాలకపోవటంవల్ల కలహాలు పెరిగాయి.

ఆనాడామె తను 'తల్లి' అవబోతున్నట్టు సెర్వియటీతో చెప్పింది. సెర్వియటీ ఉలిక్కిపడి కోపం పట్టలేక — పక్కనున్న నిప్పు కదిపే కోలా (Poker)తో ఆమెను చంపేసి, పెరట్లో పాతేసి, మట్టి కప్పి—ఆపైన నాపరాళ్ళు పరిచేశాడు.

సెర్వియటీ ఎన్నడూ క్షణిక భయాలకు గురి కాలేదు.

రాత్రికి రాత్రే — రోజ్, రోమ్ వెళ్ళిందనీ, అక్కడ మంచి రద్దీ—బజారులో ఓ కొట్టు పెట్టబోతోందని, యీ చిల్లరసామానులూ, కొట్టూ తనని అమ్మేయమందనీ చెప్పి చుట్టుపక్కల వాళ్లను నమ్మించాడు. కొట్టును సామానుతో సహా తనకు తోచిన ధరకి అమ్మేశాడు. ఇరుగుపొరుగు లెవరూ అతన్ని ఆటంకపరచలేదు; అనుమానించలేదు.

ఒక హత్య చేసి, అది చక్కగా 'మాపు' చెయ్యగలిగేసరికి అతనిలో ఉత్సాహం పేట్రేగి పోయింది. ఉత్సాహంతో ఒకటికి పది హత్యలు చేసి— చివరికి 'హత్యావ్యాపారి' అనే పేరు గణించుకున్నాడు. ఓనాటి వార్తాపత్రిక— "డబ్బు తీసుకుని ఎంచక్కా మనుష్యుల్ని చంపి, ముక్కలు ముక్కలు చేసే ముచ్చటైన వ్యక్తి" అని యితన్ని గురించి రాసింది. అతను చంపిన నికరమైన 'లెక్క' సరిగ్గా తేలలేదు గానీ, "వివాహాన్వేషణలో ఉన్న వరుడు సెర్వియటీ" అనే ప్రకటన చూసి వెళ్ళిన చాలామంది ఆడవాళ్లు తిరిగి కనుపించలేదన్న సంచలనం మాత్రం బయలు దేరింది.

—ఒకే రోజు రెండు రైళ్ళల్లో కనుపించిన భయంకర హత్యలు జనాన్ని గజగజలాడించాయి. ఒక నర రూప రాక్షసుడు జనంలో పడ్డాడనే సంచలనం బయల్దేరింది. అది నవంబరు 16వ తేదీ (1932.) ట్యూరిన్‌నుంచి ఎక్స్‌ప్రెస్ — బండి నేపుల్సుకు వచ్చింది. డ్యూటీలో ఉన్న యిద్దరు పోలీసులు (ఫాసిస్టుపార్టీ స్థాపించిన తరువాత ముసోలినీ ఏర్పరచిన సిబ్బందీ) రైలుని పరీక్షిస్తూ ఒక సెకండు—క్లాసు కంపార్టుమెంటులో 'ఈ నెలతో' అల్లిన రెండు పెద్ద పెట్టెలను చూశారు. బాగా బరువుగా, కొత్తగా ఉన్న ఆ రెండు పెట్టెలనూ "పోయిన సామాన్లు భద్రపరిచే గది"కి (Lost Property Office) తీసుకు వెళ్ళి—ఓ అరలో పెడుతుండగా—ఒక పెట్టె మూతవిడి-ఒక స్త్రీ-తల క్రిందికి దొర్లింది. గమ్మున రెండో పెట్టెకూడా పగలగొట్టి చూసేసరికి అందులో రంపపు పొట్టులో మిగతా అవయవాలు— కాళ్ళూ, చేతులు కనుపించాయి.

లాస్పిజా నుంచి రోముకు వచ్చిన మరో రైలులో ఇంకో మొండెం దొరికింది. రైల్వే పోలీసు ఒకడు సెకండు క్లాసులో తనకి కనబడ్డ ఓ పెద్ద పెట్టెని పట్టించుకొచ్చి బద్దలు కొట్టేసరికి — నగ్నంగా ఉన్న ఓ స్త్రీ—మొండెం, విడివిడి అవయవాలూ కన్పించాయి. డాక్టర్లు ఆమె శరీర భాగాలన్నీ కలిపి శరీరంగా చేసి, ఆమెకు ముప్ఫై ఏళ్ళు ఉండి ఉండచ్చని తెల్పారు. మనిషి ఓ మాదిరి ఎత్తు. ఎడం కాలు కొంచెం వంకర తిరిగినట్టుంటుంది. శరీరంనిండా గాయం మచ్చలున్నాయి.

ఆమెను హంతకుడు వెన్నులో పొడిచాడనీ, ఆనక, చనిపోయేలోగా—చిత్రవధ చేసి, కాళ్ళూ చేతులూ నరికేసి ఉండాలనీ తెల్పారు.

ఏ మాజీ నేరస్తుడికైనా దీనితో ముడి పెట్టాలని— సంబంధం ఉందేమోనని, పరిశోధనలు ప్రారంభించారు. కానీ, యిలాంటి అసందర్భ హత్యలను కనుక్కోడానికి ఓర్పు— ఉత్సాహం, తరగని పట్టుదల, నమ్మకం— సహజమైన తెలివీ ఇవన్నీ ఉంటే, అదృష్టం ఒక్కపాలు ఉన్నా— పట్టుకోవచ్చు.

దేశంలో అనేక మూలలనుంచి వచ్చిన 'కనబడని స్త్రీల జాబితా' సహాయంతో— ఈ స్త్రీ (శవం) వివరాలు— "స్క్వాడ్రా మొబైల్" (హత్యాపరిశోధశాఖ) కనుక్కో నారంభించింది. కానీ, ఒక్క పీసమైనా పని జరుగలేదు. రోజూ టెలిగ్రాములు, ఫోనులు, వార్తలూ మాత్రం ధారాళంగా ఇటలీలో అన్ని ప్రదేశాలనుంచీ రాసాగాయి.

ఈ రకమైన హత్యల్లో — హతుల పోలిక దొరకాలన్నా — హంతకుల జాడలు తెలియాలన్నా ప్రజాసహకారం ఉండితీరాలి. కానీ వార్తాపత్రికల్లో ఈ విషయంమీద ఎన్నడూ ఓ ముప్ఫై లైన్లకన్నా పడలేదు. ముసోలినీ వేసిన ఒక ఉత్తరువు ప్రకారం హత్యా వివరాలు జనానికి ఎక్కువగా తెలియనివ్వకుండా ఉంచవలసి వచ్చింది. ఫాసిస్టు (పార్టీ) ఇటలీలో ఆ రకమైన ఘోర హత్యలు చేసే వాళ్ళుండరని, ఒకవేళఉన్నా, వారిని గురించి ప్రజలకు ఎంత తక్కువ తెలిస్తే అంత మంచిదనీ ముసోలినీ తెలియజేశాడు.

హత్యా పరిశోధన ముందుకు సాగలేదు. వార్తాపత్రికలు వెనుకాడలేదు. నిషేధాన్ని — నిషేధించి విజృంభించాయి. వార్తల్లో ఈ వార్త అగ్రస్థానాన్ని అలంకరించింది. 'వార్తలు' చదివిన ఇద్దరు పౌరులు 'ఆరోజు' రైల్లో వాళ్ళిద్దరూ ప్రయాణం చేస్తుండగా, ఓ 'మీసాల వ్యక్తి' రెండు పెట్టెలతో — కంపార్టుమెంటులోకి ఎక్కాడని— పెట్టెలు పైనపెట్టి, ఓ మూల కూర్చున్నాడని— ఓ కునుకు తీసి—లేచి చూసేసరికి అతను కనబడలేదని, పెట్టెలు మాత్రం

—33 వ పేజీ చూడండి

నా అనుభవంలో కెల్లా పెద్ద పరిశోధన-7

కె. సరోజిని

సినిమాలూ - జాతీయ సమైక్యతా

సినిమాలకు గల ప్రభావం, నేడు మరి ఏ ఇతర వినోద, వికాసములను కల్పించే సంస్థలకూలేదు. ప్రజాబాహుళ్యానికి ఒక విలాసంగా కాక, జీవితావసరంగా పరిణమించింది— సినిమా ! సంగీతం, సాహిత్యం, నాట్యం మొదలైన శబ్ద, దృశ్య కావ్య కళల నన్నిటినీ, అతి తక్కువఖర్చులో అందరికి అందుబాటులోకి తీసుకురావడంతో సకల జనరంజకత్వాన్ని సులభంగా సాధించటమేకాక, ప్రేక్షకుల మనోభిప్రాయాల్ని సరిదిద్దగల శక్తినికూడా అధికంగా సంపాదించింది. అయితే ఈ శక్తి, సరియైన పద్ధతిలో, ఉన్నత ఆదర్శాల కొరకై వినియోగింపబడుటలేదు. కేవలం ధనార్జనే పరమార్థంగా భావించి, ప్రేక్షకుల తాత్కాలిక ఉద్రేకాలకు ప్రాధాన్యతనిచ్చి తద్వారా, వారిని రజింప చేయడమే ఈ సినిమాలలోని ఇతివృత్తానికిగాని, నన్నివేశాలకుగాని, సంగీతానికిగాని, లక్ష్యంగా కనిపిస్తోంది. ఆ విధంగా తీసినప్పటికీ, తమకుగల ప్రభావం వల్ల సినిమాలు అనుకోకుండానే, కొంత మంచినీ, చెడును, సాధిస్తాయి. కాబట్టి, సినిమాల ప్రభా

మూడవ బహుమతి వ్యాసం

వాన్ని గుర్తించి, కేవలం ధనార్జనకొరకు ప్రేక్షకుల నానందింపజేయడమే లక్ష్యంగాకాక, కొన్ని ఆదర్శాలను దృక్పథంలో ఉంచుకొని సినిమాలు తియ్యడం, నిర్మాతల బాధ్యత

నేడు మనదేశాన్ని ఎదుర్కొంటున్న సమస్య 'జాతీయ సమైక్యతా సాధన'. ఇది సాధించాలంటే, రెండే-మార్గాలున్నాయి. ఒక్కటి, బలప్రయోగం ద్వారా భౌతికమైన ఐక్యతను నెలకొల్పడం, రెండవది పరస్పర సానుభూతితో ఒకరి భాషనూ, సంస్కృతినీ మరొకరు అర్థంచేసుకోవటంద్వారా వివిధ రాష్ట్రీలవారూ తమ సమానత్వాన్ని అంగీకరించి భావైక్యతను పొందటం. ఈ రెండవ విధానమే రెంటిలోను ఉత్తమమైంది. సాంస్కృతికంగా జాతీయైక్యతను సాధించటంలో సినిమాలు ఒక ముఖ్యపాత్ర నిర్వహించగలవు. కాని ఈ ఆదర్శం సాధించుటనే తమ దృష్టిలో పెట్టుకుని నిర్మాతలు తీసిన సినిమాలు అరుదు అయితే అంత మాత్రాన సినిమాలు జాతీయైక్యతకు తోడ్పడటంలేదని అనలేము. సినిమాలద్వారా, ఒక

చదువుల్రావు - బి. వి. సత్యమూర్తి



సినీ మాలా...

ప్రాంతానికి చెందిన సంస్కృతి, భాషా మరొక ప్రాంతం వారికి సులభంగా పరిచయ మవుతున్నాయి. అందుకు హిందీ సినిమాలకు దక్షిణాదినిగల ఆదరణే నిదర్శన. హిందీ సంగీతంకూడా దక్షిణాదిని చాలా వ్యాప్తమైంది. ప్రజల్ని సులభంగా ఆకర్షించింది. దీనిద్వారా ఔత్తరాహిక సంస్కృతిమీదా, వారికళల మీదా దక్షిణాదివారికి సదభిప్రాయం ఏర్పడింది.

అయితే దక్షిణాది వారిగురించి సినిమాలద్వారా ఉత్తరాదివారు తెలుసుకునే అవకాశం ఇంతవరకూ ఎక్కువగా కలుగలేదు. ఎందువల్లనంటే, హిందీ భాష దక్షిణాదివారి కర్థమైనంతగా, తెలుగుగాని, తమిళంగాని, మళయాళంగాని ఉత్తరాది వారి కర్థంకావు. అంతేకాక దక్షిణాదివారు చాలా తక్కువ హిందీ ఫిల్ములు తీయడంకూడా ఒక కారణమేమో.

కొన్నికొన్ని దక్షిణాది ఫిల్ములు, ఉత్తరాదిని మంచిపేరు ప్రఖ్యాతులు సహించి, తద్వారా దక్షిణ భారత సంస్కృతిమీదా, దక్షిణాత్యుల సంగీతం మీదా గౌరవభావం ఔత్తరాహికులలో కలిగించక



లేదు. అందుకు, 'సువర్ణసుందరి' సినిమా, ఆదినారాయణరావుగారి సంగీతం— నిదర్శనం.

ఇక దక్షిణాదిలో వున్న తెలుగు, తమిళ కన్నడ, మలయాళ రాష్ట్రములలో, సినిమాలు ఒక భాషలో తీసినవి మరొకభాషలో డబ్బింగు చేయబడటంవల్ల చాలావరకు ఈ రాష్ట్రాలవారొకరి నొకరిని, బాగుగా అర్థంచేసుకోగలుగుతున్నారనేది, నిర్వివాదాంశం. మొత్తంమీద జాతినంతటనూ దృష్టిలో వుంచుకుంటే హిందీ సినిమాలు, హిందీ భాషకుగల బలమైన పలుకుబడి, స్పష్టమవుతాయి. భాషకు సంబంధించినంత వరకూ ఇది మంచి పరిణామమే— ఇందుకు సినిమాలద్వారా జరిగిన సేవ మెచ్చుకోదగినదే.

సినిమాలోని కథావస్తువులు ఎంతవరకూ ఈ జాతీయైక్యతకు తోడ్పడుతున్నాయి అని అడిగితే, సాంఘికసినిమాలలో తద్విషయకమైన ఇతి వృత్తం ఎక్కడోగాని కన్పించదు, పౌరాణిక, చారిత్రక, సినిమాలలో, దేశానికంతకు సంబంధించిన ఇతివృత్తాల్ని తీసుకున్నా, ప్రాంతీయత స్పష్టంగా కన్పిస్తూ, జాతీయైక్యతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కన్పించటంలేదు. నిజానికి, మన దేశ చరిత్రలో అనేక రసవంతమైన ఘట్టాలున్నాయి. ఆ సంఘటనలను వినియోగించి, జాతీయైక్యతను ద్యోదించగలిగిన అవకాశాన్నెవరూ వినియోగించుకోటంలేదు— సినిమాలలో. పౌరాణిక గాథలలోకూడా, అవి చిత్రీకరించినప్పుడు ప్రజలకొక ఉత్తమ సందేశాన్నివ్వవలెననే భావం నిర్మాతలలో కన్పించదు. కానీ, అట్టి ఉన్నతాశయాలను వాటి చిత్రాలను తీసిననాడే, సినిమాలు ప్రజారంజకములు అగుటేకాక, ప్రజా మార్గదర్శకము లవుతాయి.

ప్రస్తుతం అన్ని రాష్ట్రాలలోనూ సాంఘిక ఆర్థిక పరిస్థితులూ— వాటివల్ల వ్యుత్పన్నమయ్యే సమస్యలు ఒకేవిధంగా వున్నాయి. వర్ణ, వర్గ వైషమ్యాలు శిల్లెడలా వున్నాయి. మధ్య తరగతి యొక్క కడగండ్లు అన్ని రాష్ట్రాలలోనూ ఒకలాగే వున్నాయి. నిరుద్యోగం, దారిద్ర్యం, అందరికీ ఎదురవుతున్నాయి. వీటిగురించి, వీటిపరిష్కారం సినిమాలు తీసినట్లయితే ఇంచుమించు అన్నిరాష్ట్రాల వారియొక్క, సమస్యలనూ చిత్రీకరించినట్లే. సాంఘిక చిత్రాలలో, వాస్తవానికి దూరంగా ఉండే ఇతి వృత్తాలూ, నిజజీవితంలో సంఘటించని సన్నివేశాలూ ఎక్కువగా వుంటున్నాయి. కాని, సహజమైన ఈ సమస్యలకు ప్రాధాన్యతలేదు. ఈ అసహజత్వం మితిమీరి ప్రదర్శించటంవల్ల, ప్రజాబాహుళ్యానికి వాస్తవిక సమస్యలయందు శ్రద్ధగానీ, వాటి నెదుర్కొనుటకు గల చైతన్యంగానీ, కలుగటంలేదు. మనది చాలా వెనుకబడిన దేశం. మన దేశం అభివృద్ధి చెందాలంటే, ప్రజలకృషి ఎంతో అవసరం. ఆ కృషి ఫలించడానికి జాతీయ ఐక్యత ముఖ్యం. ఈ ఐక్యతను సాధించటంలో సినిమాలు నిర్వహించగల పాత్ర ప్రత్యేకమైనది. సినిమాకథలు వాస్తవికతకు దూరమవడం ద్వారా, సంఘానికీ, ప్రజకూ మంచికన్నా, చెడునే ఎక్కువగా కలుగ జేస్తాయి.

హిమాలయాల్నుండి కన్యాకుమారి వరకూ, వివిధ భాషలూ వివిధ సంస్కృతులు ఉత్పన్నమైనా, అన్ని జాతులలోనూ కల, మానవతనూ, వ్యక్తిత్వపు విలువలనూ, భావసౌందర్యాన్ని ఆరాధించటంద్వారా మానవజాతి నంతటనూ ఏకమొనర్పటమే కళలన్నిటికీ ప్రధానలక్ష్యం. విభిన్నత్వంలో ఏకత్వాన్ని స్థాపించేసి, అన్నిజాతులయొక్క సమానత్వం, సౌభ్రాతృత్వం, సామరస్యం సాధించాలంటే, ఇంతవరకూ సినిమాలు చేసిన సహాయంకన్నా, చేయవలసిన కృషి ఎక్కువగా వుందని చెప్పకతప్పదు. కాని కొంతవరకు సినిమాల ప్రభావం ఇందుకు సద్వినియోగమైనదని కూడ చెప్పితీరాలి. ★



పి. సుబ్రహ్మణ్యం సమర్పించు
“[illegible] చిత్రంలో రాగిణి.

1863 1963

ಭಾರತದಲ್ಲಿ ಬ್ಯಾಂಕಿಂಗಿನ 100 ವರ್ಷಗಳ ಸೇವೆ

నేషనల్ అండ్ గ్రిండ్లేస్

సర్వదా మీ సేవకు సంసిద్ధం



నేషనల్ అండ్ గ్రిండ్లేస్‌వారి సమగ్రమైన బ్యాంకింగ్ సర్వీసు ఇప్పుడు ఒక్క ఇండియాలో 40 బ్రాంచీల ద్వారా విస్తృతం చేయబడింది. ప్రతి బ్రాంచి అతి పెద్ద ఖాతానుగాని, అతి చిన్న ఖాతానుగాని సమర్థంతో నిర్వహించగల స్థితిలో కలదు.

మీ స్థానిక బ్రాంచికి వెళ్ళి అది ఎంత సమర్థంగా నిర్వహించబడుతున్నదో చూడండి. మీ బ్యాంకింగ్ సమస్య ఏది అయినా నేషనల్ అండ్ గ్రిండ్లేస్ మీకు సముచితమైన సలహా ఇవ్వగలదు.


నేషనల్ అండ్ గ్రిండ్లేస్ బ్యాంక్ లిమిటెడ్

యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇన్‌కార్పొరేట్ చేయబడింది — మెంబర్ల బాధ్యత పరిమితం

హెడ్ ఆఫీసు: 26, బిషప్స్‌గేట్, లండన్ ఇ.సి.2.

బ్రాంచిలు: మద్రాసు: 3, నార్త్ బీచ్ రోడ్డు; 378 నేతాజీ సుభాస్ చంద్రబోస్ రోడ్డు, (లామెడ్స్ బ్రాంచి); 6, ఆర్మీనియన్ స్ట్రీట్; 168, మౌంట్ రోడ్డు. హైదరాబాద్: అబిడ్ రోడ్.

NGB/50 /B-TEL



దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

29-3-1963 శుక్రవారము మొదలు

4-4-1963 గురువారము వరకు

గ్రహస్థితి

కర్కాటకంతో అంగారక రాహువులు; మకరంలో శని కేతువులు; కుంభంలో శుక్రుడు; మీనంలో సూర్య బుధ గురువులు; మేష వృషభ మిధున కటక–సింహాలలో చంద్రుడు.

మేషం:

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

మీ ఆశలు పూర్తిగా ఫలించగల అవకాశాలు తక్కువ. ఉన్నదున్నట్లు మాట్లాడటంవల్ల పది మందికీ విరోధం కావలసివస్తుంది. ఆదాయం మాత్రం లోపం కాదు. వృత్తి ఉద్యోగాలలో శ్రమ కరంగా ఉన్నా, మెదలకుండా పనిజరుపుకొని పోవటం మంచిది. కుటుంబంలో పిల్లల ఆరోగ్యాదులను గురించి విచారం కలుగుతుంది. కాని, దైవికంగా వెంటనే అనుకూలత కలుగుతుంది. ఒకటి రెండు సందర్భాలలో అధికారులవల్ల వత్తిడి కనుపించ వచ్చు. అనుకోకుండా ఖర్చులు తగులుతవి. అగ్ని, ఆయుధాలు మొదలయినవాటితో నిర్లక్ష్యంగా ఉండవద్దు. ఈ సమయంలో అప్పులు తీసికొనటం గాని, ఈయటం గాని, రెండూ చిక్కుగానే తయారు కావచ్చు.

* * *

వృషభం:

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

వృత్తి, ధనాదాయాది విషయాలలో ఇంతకు ముందున్న కాఠిన్యము, చిక్కులు తొలగి, పనులు సాఫీగా జరుగుతూ వస్తవి. సంఘంలో మీయందు నమ్మకము, ఒక విధమైన గౌరవము పెరుగుతవి. విశేషంగా ఫలితం లభించటం అనేది ఎలా ఉన్నా అనేక సందర్భాలలో మీ పేరు పైకి రాగల అవకాశాలు ఏర్పడుతవి. శ్రమను ఓర్చుకొనవలసిన సమయం. ఈ సమయంలో ముందుగా ఆదాయ వ్యయాలు చూచుకొనకుండా ఏ పనిలోను దిగవద్దు. ఎవరు—ఎన్ని చెప్పినా "ఆత్మబుద్ధి సుఖంచైవ" అనే విషయాన్ని మరచిపోవద్దు, దైవకార్యాలు ప్రశాంతంగా నెరవేర్చుకుంటారు. వారాంతంలో నీచులతో కలహాలు వస్తవి. జాగ్రత్త.

* * *

మిథునం:

(మృగశిర 3, 4 పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

ఎప్పటికప్పుడు గత— విషయాలను మరచి పోవలసిన సమయం. ధనం ఖర్చుపెట్టినా, పనులు సంతృప్తికరంగా పూర్తికావు. ఒక పనికి రెండు సార్లు ప్రయత్నించవలసివస్తుంది. మీ ఆలోచనలకు అంతు అంటూ ఉండదు. లలితా సహస్రనామ స్తోత్ర పారాయణము, దేవీపూజ జరుపుకొనుట వల్ల మనశ్శాంతి, పదిమందిలో గౌరవము, కార్యసాఫలము పొందగలరు. మీ వ్రాతలలోను, మాటలోను పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తపడండి. వారం రెండవ భాగంలో వృత్తిలో మంచి మార్పులు కనుపించగలవు. క్రొత్త మనుష్యుల స్నేహం లభిస్తుంది. తూర్పు, ఉత్తర దిశలనుంచి అనుకూల వార్తలు తెలుస్తవి. ప్రయాణ సూచనలున్నవి.

* * *

కర్కాటకం:

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

ప్రస్తుతం గ్రహస్థితి అంత తృప్తికరంగా లేదు. ఆగ్రహం, ఆవేశం తగ్గించుకొనటం అవసరం. మీకు సహాయం చేయవలసినవారు తమ అశక్తతను బైట పెడతారు. ఏ సందర్భంలోను, ఎవ్వరినీ విమర్శించటం, నొప్పించటం అనేది జరుగకుండా చూచుకొనండి. మీ వ్యవహారాలలో శ్రమ తోస్తుంది. కాని, న్యాయం లభిస్తుంది. తలవని తలంపుగా ఆప్తులకు సహాయం చేయగలుగుతారు. ముందు వినోదంగాను, ఉత్సాహకరంగాను తోచిన పనులే చివరకు విరోధాలకు అవకాశాన్నిస్తవి. బంధుమిత్రులవల్ల ఖర్చులు పెరుగుతవి. ప్రయాణాలు సుఖంగా జరుగుతవి. వృత్తిలో అభివృద్ధికరమైన మార్పులు గోచరించగల సమయం.

* * *

సింహం:

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

కష్టాన్ని సహించుకొంటారు. ఇతరుల మాయోపాయాలు, కుయుక్తులు మిమ్ములను ఏమీ చేయజాలవు. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ముందుగా, ఏ ప్రయత్నము చేయకుండానే ఆయా సమయాలలో మీ పనులను చక్కబెట్టుకోగలుగుతారు. విందు—వినోదాలు మొదలయిన వానిలో పాల్గొంటారు. ఆత్మబంధువులనుంచి విచార వార్తలు తెలియగలవు. కుటుంబంలో ఏవో కొన్ని కొరతలు కనుపిస్తూ ఉంటవి. వారాంతంలో ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులకు సంబంధించిన మార్పులు, వ్యవహారాలు మొదలయినవి చాలా నిదానంగా సాగుతూ ఉంటవి. ధన వ్యయం అధికం.

* * *

ఈ వారము ధరలు

మిర్చిధర వారం రెండవభాగంలో తగ్గగల అవకాశాలున్నవి. వేరుశనగపప్పు, నూనెల ధరలు పెరిగి తగ్గుతవి. మినుముల ధర కొద్దిగా పెరుగుతుంది. చింతపండుకు కూడా గిరాకీ వస్తుంది. ఆహారధాన్యాల ధర నిలకడగా ఉంటుంది.

కన్య:

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

ముందు—యోచన లేకుండా చేసిన పనులవల్ల భారం మీపైన పడుతుంది. బంధువుల నిష్ఠూరాలను పట్టించుకొనతగిన సమయంకాదు. శక్తిని మించకుండా కార్యక్రమాలను జరుపుకొనటం ముఖ్యం. మానసిక శ్రమతో కూడిన పనులు అధికం. అయితే విజయం సాధిస్తారు. ప్రసంగాలలో మృదువుగానే, ఎదటివారి లోపాలను తెలియజేయగల్గుతారు. సాహిత్యకృషి, వినోద కాలక్షేపాలు, గ్రంథావలోకనం మొదలయిన వాటికి చాలా అనుకూలమైన కాలం. వారం మధ్యలో అకస్మాత్తుగా వచ్చిన కలహాలు మీ మనస్సును చెడగొట్టవచ్చు. కాని, బుద్ధిబలంతో నిగ్రహించుకొనగలుగుతారు.

* * *

తుల:

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

ఎక్కడి కక్కడ మృదువుగా మాట్లాడటం అవసరం. సాధ్యమైనంతవరకు నౌకరులమీద ఆధారపడటం మంచిదికాదు. వ్యాపార వృత్తులో ఆర్థిక ప్రయోజనం అంతగా ఉండకపోవచ్చును. సంఘంలో గౌరవ స్థానం లభిస్తుంది. మీరు ఏ వ్యవహారంలో చెయిపెట్టినా సులభంగా ఒక తీర్మానానికి తీసుకొని రాగలుగుతారు. సంఘంలో పోటీ ఉన్నా, సమర్థించుకొని నిలబడగలుగుతారు. ఆదాయం ధారాళంగా ఉన్నట్లే, తలవని తలంపుగా ప్రతిబంధకాలు వస్తవి. మీకు అసలు సంబంధం లేకపోయినా, సహవాసదోషంవల్ల అపవాదులు రాగల అవకాశాలున్నవి. కుటుంబంలో దైవకార్యాలు జరుగుతవి.

* * *

వృశ్చికం:

(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

తలపెట్టిన పనులు సందిగ్ధంగా నిలబడతగిన సమయం. మనస్సులో ఆదుర్దా ఉంటుంది. కాని, అవకాశం వెంటనే కనుపించకపోవచ్చు. కోర్టు కచేరీలలో పట్టుదలలు తగ్గించుకొనండి. మీ ఆరోగ్యం బాగుంటుంది. ఏది ఎలా ఉన్నా, మీరు మాత్రం బాధ్యతలను ఇతరులమీదకు త్రోసిపుచ్చి ప్రశాంతంగా గడపటం మంచిది. ఇంతకుముందు చేసిన

ఆలోచనలను, పనులను ప్రస్తుతం విరమించు కొనవలసివస్తుంది. ప్రయాణాలు సాగిస్తారు. ధనం ముందు ధారాళంగా ఖర్చుచేసి, పిమ్మట ఉపయోగం లేకపోయిందని తెలుసుకుంటారు. వారాంతంలో శుభవార్తలు తెలుస్తవి.

*　*　*

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

మూరెడు ముందుకు సాగితే, బారెడు వెనుకకు జరిగినట్లుగా ఉంటుంది. స్వశక్తి తగ్గుతుంది. ఇతరుల ఆధారం సంపూర్ణంగా దొరకదు. ముందు ఖర్చు చేస్తూ, ఫలితానికి ఎదురుచూస్తూ ఉండవలసిన సమయం. ఎప్పటి కప్పుడు ముందు ఏమి చేయవలయునో తెలియని స్థితిలో పడుతూంటారు. కాని, ఆకస్మాత్తుగా జరిగే మార్పులు మీకు కొంతవరకు అనుకూలిస్తవి. శారీరక శ్రమ, మానసిక శ్రమకూడా అధికమవుతవి. ప్రయాణాలు కాని, స్థానచలనంకాని చెప్పతగిన సమయం. జీర్ణకోశాలతో బాధ కనుపిస్తుంది. సాధారణంగా అప్పులు చేయు ప్రయత్నాలు విరమించుకొనటం అవసరం.

*　*　*

వారఫలాలు

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

మీ ఆర్థిక స్థితి క్రమంగా బాగుంటుంది. వృత్తిలో మంచి మార్పు వస్తుంది. మంచివారి స్నేహము, సహాయము అందుతవి. కుటుంబంలో కూడా అనారోగ్యాలు, అసంతృప్తులు తగ్గి మెల్ల మెల్లగా ఉత్సాహ లక్షణాలు గోచరిస్తవి. అయితే ఎంత ఆదాయం వచ్చినా, చాలని సమయం. తొందరపడి, విలువగల వస్తువులు కొనే ప్రయత్నాలు పెట్టుకోవద్దు. "కరవమంటే కప్పకు కోపం, విడువమంటే పాముకు కోపం" అనే స్థితిలో పడి, యధార్థం మాట్లాడడానికి వెనకాడవలసివస్తుంది. అధికారుల సహాయం లభిస్తుంది. మీరు చేయు పనులలో నిర్లక్ష్యము, సాచివేత పనికిరాదు. దీర్ఘ ప్రసంగాలకు అవకాశం లేకుండా పనులు పూర్తి చేసుకొనండి. ప్రయాణాలు లాభిస్తవి.

*　*　*

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

ఆడంబరము, హంగులు లేకుండా అభివృద్ధిని సాధించుకొంటారు. దైవబలం కలసివస్తుంది. కుటుంబంలో ఒడిదుడుకులు లేకుండా, హాయిగా జరుగుతుంది. మీతో అనుకూలంగా సంచరిస్తూ మీమీద చాడీలు చెప్పేవారుంటారు. ఆదాయం పెరుగుతుంది. ఉత్తర దిక్కునుంచి కష్టవార్తలు తెలుస్తవి. వారం రెండవ భాగంలో కొంత విసుగుదల, అసౌఖ్యము కనుపించగలవు. సంఘకార్యాలలో పాల్గొంటారు. ఇంతకుముందు చేసిన శ్రమకు ఫలితం అందుతుంది. వారాంతంలో మీ వ్యక్తి కార్యక్రమాలలో పొరపాట్లు, దండగ ఖర్చులు.

*　*　*

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

ఎక్కడికక్కడ సరిపెట్టుకొనవలసిన సమయం. ఇతరులవల్ల జరిగిన పొరపాట్లు కూడా మీవిగానే లెక్కకు రాతగిన సమయం. పనుల యందు నిరుత్సాహం తోస్తుంది. పిల్లల ఆరోగ్యం గురించి శ్రద్ధ చూపవలసి ఉంటుంది. మీ ఆలోచనలు ఒక క్రమంలో సాగకపోవటంవల్ల ముందు పనులు వెనుకా, వెనుక పనులు ముందూ జరుగుతూ ఉంటవి. ఇతరుల మాటలను లెక్కపెట్టుకుని అనవసరంగా బాధపడవద్దు. ఈశ్వరాభిషేకము, పూజ జరుపుకొనుటవల్ల ధైర్య స్థైర్యాలు లభిస్తవి. ★

అక్కడే ఉన్నాయనీ, శైలాపాటికి 'రోమ్'లో కి ప్రవేశించిందని చెప్పారు. ఈ విషయాలను ఆధారంగా తీసుకుని, స్కార్వ్లా మొబైల్‌వారు తమ పరిశోధనను కొనసాగించారు. రోముకు, నేపుల్సుకు శవాలను ఒకేనాడు పెట్టెల్లోపెట్టి పంపే వ్యక్తి మసూరు లాస్ప్రిజాస్టేషను నుంచి— (లేక ఆ ప్రాంతాలనుంచి) పంపిఉండాలని అనుమానించారు. అనక ఈ కేసు లాస్ప్రిజా కూడా ప్రాకింది.

నేనప్పుడు లాస్ప్రిజాలో హత్యా (Homicide) పరిశోధకశాఖలో చీఫ్‌గా ఉండడంవల్ల ఈ కేసు నా వరకూ వచ్చింది. రోమ్ నగరానికి చెందినది ఆ హత్య అని అనుకునేదల్లా — లాస్ప్రిజా వరకూ పాకడంవల్ల, హంతకుణ్ణి పట్టుకుని అప్పగించే బాధ్యత నామీద, నా అనుచరులమీదా ఉందని నమ్మాను. నా సిబ్బంది అంతా మంచి చురుకైనవారు. హోటళ్ళూ, వసతిగృహాలు, గృహాలు, పదిమంది కలిసే చోట్లన్నీ 'మీసాలవాడికోసం గాలించడం' ప్రారంభించారు. కానీ, పెద్దగా ప్రయోజనమేమీ లేకపోయింది. ఆరోజు నేను పేపరు చదువుతుండగా రైల్వేస్టేషను—పక్క పొదలో ఓ కుర్రాడికి ఒక కత్తి కనబడినట్టూ, అతడు దాన్ని రైల్వే పోలీసులకు వెంటనే అందజేసినట్టు ఉన్న ఓ వార్త కనబడింది.

ఈ కత్తికీ — ఆ హత్యకూ ఏమైనా 'ముడి' ఉంటుందా అని ఓ క్షణం ఆలోచించి — ఒక్కగెంతులో స్టేషనుకువెళ్ళి, కత్తి స్వాధీనపరచుకుని, పోలీసు లాబరేటరీ (పరిశోధనశాల)కి పంపాను. ఆ కత్తిమీది మరకలు మనిషి—రక్తానికి చెందినవే అని ధృవపడింది. ఇక కాలికి పని తగిలింది. ఇనప కొట్లకూ, కార్ఖానాలకూ, ఫ్యాన్సీ షాపులకూ— తదితర చోట్లకూ తిరుగుతూ, ఆ కత్తి అమ్మినది ఎవరని వాకబు-చెయ్య నారంభించాము. మా శ్రమ ఫలించింది. ఓ 'మీసాలతను' తనదగ్గర ఆ కత్తి కొన్నట్టు ఒక షాపువాడు గుర్తుపట్టాడు. 'ఈ' వర్ణన 'ఆ' వర్ణనతో సరిపోయింది. మరి నాలుగు కొట్లు దాటేసరికి అదేరకం 'మీసాలవాడు' తన దగ్గర ఈ నెలలో అల్లిన రెండు పెట్టెలను కొన్నట్లు ఆ షాపువాడు చెప్పాడు.

కనుక — హంతకుడు లాస్ప్రిజాలోనే ఉండితీరాలని నిశ్చయంచేసుకుని, ఇంటింటి సోదా ప్రారంభించాము.

హత్య జరిగి నెలరోజులు దాటిపోయింది. మా ఇంటింటి సోదా ఊరంతా తిరిగి — ఒక ఇరుకు సందులోఉన్న నాలుగంతస్తుల మేడ దగ్గరకొచ్చింది. ఆ రోజు డిసెంబరు 16(1932). ఆ రోజంతా ఇద్దరు డిటెక్టివు (పోలీసు)లను కాపలా పెట్టాను. లోపలనుంచి బయటకు గానీ, బయటనుంచి లోపలకు గానీ ఎవ్వరూ రాలేదు, పోలేదని తేలింది. ఇక ప్రారంభించవచ్చు అనుకుని, తుపాకి సిద్ధంగా పట్టుకుని, ప్రాణాలను బిగ్గపట్టుకుని ఒక్కొక్క అంతస్తూ ఎక్కి నాలుగో అంతస్తు (అనుమాన స్థలం) చేరాము. డిటెక్టివ్ ఆఫీసరు కూడా నన్ను అనుసరించాడు.

'ఆ' తలుపు ఓరవాకిలిగా వేసిఉంది. నెమ్మదిగా తోసి, మునివేళ్ళమీద నడుస్తూ, లోపలకు వెళ్ళేసరికి— 'అదే రకం' రంపం పొట్టుతో ఉన్న పెద ఒకటి కనుపించింది. మిగతా గదంతా వంటిళ్ళలా గందరగోళంగా ఉంది. నెమ్మదిగా నడిచి,

ముక్కలుగావచ్చిన స్త్రీ

25-వ పేజీ తరువాయి

ఆ గది అవతలి—పక్క తలుపు తోశాను. ఆ గదిలు అటు తిరిగి మాట్లాడుకుంటున్న యిద్దరు వ్యక్తులు ఛట్టున వెనక్కు తిరిగి జేబుల్లోనికి చేతులు పోనివ్వబోయారు.

"కదలకండి ! కదిలితే కాల్చిపారేస్తాను" అని అరిచాను నేను.

వాళ్ళిద్దరూ చేతులు పైకెత్తి నించున్నారు. "మంచిది. మమ్మల్ని మేమే పరిచయం చేసుకుంటాం— నా పేరు "ఎరికో"— రోమ్— అపరాధ పరిశోధక శాఖ కమిషనర్ని— ఇతను ముస్కో— నా అసిస్టెంటు" అన్నా డొకతను.

ఈ మాటలు వింటుంటేనే, నేను నిశ్చేష్టుణ్ణై— నీళ్ళుకారిపోయాను. కోపము, అవమానము, కలవరము నన్ను చుట్టుముట్టాయి. నా అధికారం కిందఉన్న లాస్ప్రిజాలో— నాకు తెలియపరచకుండా—రోమ్ నుంచి పోలీసుశాఖ వచ్చి — పరిశోధనలు కొనసాగించుకోడం చూసేసరికి నా ఒళ్ళు మండిపోయింది.

"సిసేరీ సెర్వియటీని నేను బంధిద్దామని వచ్చాను. అతనేడి ?" అన్నాను నేను.

కమిషనర్ ఎరికో నాకేసి పరీక్షగా చూస్తూ "మీరు లాస్ప్రిజాకి చెందిన పోలీసు చీఫ్ అనుకుంటాను" అన్నాడు.

నేను నోరు—విప్పి మాట్లాడేలోగా— "అతన్ని మేము అనుమానించి, నిన్ననే రోమ్‌లో అరెస్టు చేసి, రిజైనాకొలీ అనే జైల్లో పెట్టాము" అని ఎరికో చెప్పాడు.

నేను నీళ్ళు కారిపోయాను. ప్రఖ్యాత హంతకుడు 'సిసెరీ సెర్వియటీ'ని పట్టుకున్న ఖ్యాతి లాస్ప్రిజా పోలీసు శాఖకు వస్తుందని పడ్డ ఆనందం తక్కున ఎగిరిపోయింది — రోమ్‌ను వరించింది.

అనక నేనూ, కమీషనర్ ఎరికో కలిసి మాట్లాడుకున్నాము. మామూలు పరిశోధనల్లా లేకుండా, ఈ పరిశోధన కొత్త రకంగా సాగిందని చెప్పాడు. ఒకడిటెక్టివుఆఫీసరు చేసిన సూచన ప్రకారం "వధువు కావలెను" అనే రకం వివాహ ప్రకటనల నుంచి పరిశోధన ప్రారంభం చేసినట్టు చెప్పాడు. పాత వార్తా పత్రికలన్నీ తిరగేసిచూడగా— స్థితిపరుడు— అతనికి కుటుంబ బాదరబందీలు లేని ఒక అందమైన యువతి కావలెను—అని ఉన్న ఒక వివాహ ప్రకటన కనిపించినట్టూ— ఆ ప్రకటనను ఆధారంగా చేసుకుని పరిశోధన ప్రారంభించినట్టు కూడా చెప్పాడు.

రోమ్‌లో ఒక ముప్పైఏళ్ళ యువతి వున్నట్లుండి మాయమయ్యింది. ఆమె తను వుద్యోగం చేసే చోట—తను ఆ పెళ్ళి ప్రకటనకు దరఖాస్తు పెట్టినట్టు— తోటి ఉద్యోగులతో చెప్పిందని తేలింది. లాస్ప్రిజా వెళ్ళినట్టు— అనక మళ్ళీ కనిపించలేదని తేలింది. ఇంకా ఆమెను గురించి ఆచూకీ తీయగా—ఆమెకు ఒక కాలు కుంటిగా ఉండేదని కూడా తెలిసింది. ఆనాడు రైలుపెట్టెలో దొరికిన శవం—యీమెది అని నిర్ణయం అయింది.

ఈ "హత్యా కాండల రాజు"ని పట్టుకోవడం ఇక కష్టమైన పనికాదు. కొందరు పోలీసులు రోమ్‌నుంచి లాస్ప్రిజాలో అతన్ని పట్టుకోవడానికి పరుగెట్టారు. తనని అనుమానిస్తున్నట్టు హంతకుడు తెలుసుకునేలోగానే పట్టుకుందామని పోలీసులు ఉబలాట పడినా, సెసిరీ లాస్ప్రిజానుంచి రోమ్ పారిపోయాడు. అనక అతన్ని రోమ్‌లో ఒక హోటల్లో పట్టుకుని—రిజైనా—జైల్లో పెట్టి— అతనింటిని సోదా చేయడానికి లాస్ప్రిజాకు వచ్చినట్టు ఎరికో వివరంగా చెప్పాడు.

హంతకుణ్ణి పట్టుకుంటున్నావన్న సంబరంతో— హంతకుణ్ణి పట్టుకోడానికి వచ్చిన రోమ్—పోలీసు అధికారులను పట్టుకోడానికి సిద్ధపడినా— కనీసం అసలు వ్యక్తిని అనుమానించి, అసలు చోటుకు వచ్చినందుకు సంతృప్తి పడ్డాను.

సెర్వియటీ ఆఖరు హత్య—అతని యింటి యజమానురాలు. అందరినీ చంపిన పద్ధతిలోనే ఆమెనూ నరికి ముక్కలు చేశాడు.

పెళ్ళి అనే మిషమీద వరులను ఆకర్షించి, రప్పించి, వాళ్ళదగ్గరున్న డబ్బు ఊడలాక్కుని, ముక్కలు ముక్కలుగా వాళ్ళను నరికిన 'బెల్లీగైనెస్' అనే ఆమె కథ నాకు గుర్తువచ్చింది. ఆమె సెర్వియటీకి మార్గదర్శకురాలయ్యుంటుందనుకున్నాను. సిసెరీ సెర్వియటీ సొంత హోటల్లో అతని హింసాకాండకు గురై, బలైన మిగతా శరీరాలు కొన్ని దొరికాయి.

వాళ్ళల్లో ఒకామెను చూసి, ఒక దంతవైద్యుడు ఆమె పళ్ళను ఆనవాలుకట్టి, అవి తను కట్టిన పళ్ళేనని, కనుక ఆమె—పేరు 'బైస్ మార్గరుసే' అని తెలియజేశాడు.

మరణ—దండనంత కటువైన శిక్ష ఈ నాడు ఇటలీలో పెద్దగా లేదు. కానీ- ఆనాడు ముసోలినీ ఈ రకం నేరగాళ్ళను వదల్లేదు. సెర్వియటీ కూడా తన పాప ఫలితం పొందాడు.

అతన్ని అరెస్టు చేసి నెల అయింది. తీర్పు జరిగింది. ఆనాటి ప్రాతఃకాలంలో అతన్ని వధ్యాస్థలానికి తీసుకొచ్చి— దయాదాక్షిణ్యాలకోసం గోలపెడుతున్న అతని నోటిని శాశ్వతంగా మూసేశారు. ★



సినీసీమలో సంగీతం

23—పేజీ తరువాయి

సంగీత రచనలన్నీ ఆయనను నవ్య సంప్రదాయ నిర్మాతగా నిరూపిస్తాయి.

నౌషద్‌తోబాటు ప్రతిభావంతులయిన యితర సంగీత దర్శకుల మేధస్సు కూడ ఈ కొత్త సంప్రదాయాన్ని సముజ్జ్వల పరచింది. నవ్య సంగీత నిర్మాతలుగా పేర్కొనబడవలసిన వారిలో ప్రధములు సి. రామచంద్ర, అనిల్బిస్వాస్, పంకజ్మల్లిక్, వసంతదేశాయి, హేమంతకుమార్, ఓ. పి. నయ్యార్ శంకర్‌జైకిషన్లు. మరొక ముఖ్యులు ఎస్. డి. బర్మన్. దక్షిణ దేశంలో స్వర్గీయ సుబ్బరామన్ శ్రీయుతులు రామనాథన్, కె.వి. మహాదేవన్, విశ్వనాథ న్రామ్మూర్తి ఎస్వి వెంకట్రామన్, సాలూరి రాజేశ్వర రావు, పెండ్యాల నాగేశ్వరరావు మొదలగువారు గణనీయులు.

సినిమా సంగీతాన్ని స్థూలంగా పరిశీలించి నప్పుడు గేయానికి చెందిన భాగం మన సంప్రదాయాలనూ, చిత్రీకరణకు అవసరమయే నేపథ్య సంగీతం పాశ్చాత్య పద్ధతులనూ అనుసరిస్తున్నట్టు తెలుసుకొనవచ్చును. గేయ భాగంలో కూడా విదేశీ సంగీత రీతుల్ని వాడిన సందర్భాలు లేకపోలేదు. అయితే ఈవిధమైన ప్రయోగాల వలన మన జాతీయమైన పలుకుబడికి దూరమై అనౌచితికి పాల్పడే అవకాశం ఎక్కువగా ఉంది ఈ



షయంలో సంగీత దర్శకులు శ్రద్ధ తీసుకొనటం ఎంతైనా అవసరం.

అయితే ప్రస్తుత సంగీత రచనా విధానం ప్రయోగస్థితిలోనే ఉంది. నిర్దిష్టమైన పరిమితుల్ని ఏర్పర్చి ప్రతిభావంతులైన సంగీత దర్శకుల కృషికి అవరోధం కలిగించే పరిస్థితిలో లేదు.

భారతీయ సంగీత చరిత్రలో జంత్ర సమ్మేళన పద్ధతి నూతనమైనది. ప్రాచీన సంగీత రచనలలో ప్రత్యేకించి జంత్ర సమ్మేళనకై నిర్దేశింపబడిన స్వర రచనలు కనపడవు. ప్రధానంగా భారతీయ సంగీతం మెలొడి (Melody) మీద ఆధారపడి ఉంది. ఇది రస నిష్పత్తికి గమకయుక్తమైన రాగ ప్రస్తారానికి ప్రాముఖ్యత నిస్తుంది. ఇట్లుకాక పాశ్చాత్య సంగీతం హార్మొని (Harmony) కి ప్రాధాన్యం యివ్వడం వలన జంత్ర సమ్మేళనల విషయంలో పాశ్చాత్య సంగీతకారులు అతి ఉదాత్తమైన ఫలితాలను సాధించియున్నారు. ఈ సమ్మేళన విషయంలో పాశ్చాత్య పద్ధతి నుంచి మనం తెలుసుకొనవలసినది ఎంతో ఉన్నది. వాది, సంవాది, వివాది స్వర ప్రయోగాలలో పాశ్చాత్యులు రసార్ణవంయొక్క అగాధమైన లోతులలోకి పోయారు.

ఈ పరిస్థితులలో భారత సంగీత దర్శకుడు ప్రజారంజన అనే తన లక్ష్యసిద్ధికోసం వివిధ విజాతీయ సంగీత సంప్రదాయాల సమన్వయం అనే కృషిలో భాగంగా తీసుకొంటున్నాడు. ఈ క్రొత్త ప్రయోగాలలో కొన్ని అవాంఛనీయమైన ఫలితాలు రావచ్చును. అందుకు రసికలోకం నిరుత్సాహ పడకూడదు.

సంగీత దర్శకుని బాధ్యత పాటలతోనే తీరదు. చిత్రంలోని ప్రతి సన్నివేశానికి ఆయా రసాలకు తగినట్లుగా నాదరూపమైన వ్యాఖ్య యివ్వటం కూడ అతని పనే. ఈ నాదాత్మకమైన వ్యాఖ్యానాన్ని రీ రికార్డింగ్ అంటారు. ఈ రీరికార్డింగులో వినపడే నేపథ్య సంగీతం ఒక సంగీత దర్శకుని ప్రతిభకు దర్పణం వంటిది. రసాత్మకమైన సన్నివేశలకు ఆయా రసోత్పన్న శక్తిగల ఈ సంగీత వ్యాఖ్యను సృష్టించటానికి ఎంతో భావనాశక్తి, కాల జ్ఞానమూ, అనుభవమూ అవసరం. అసమర్థమైన రీ రికార్డింగ్ చిత్రం పేలవంగా తోపింపజేస్తుంది ప్రజ్ఞావంతమైన రీ రికార్డింగ్ ఎంతో హీనమైన సన్నివేశాన్ని కూడ చిత్రంలో కుదుటపర్చగలదు.

ఎంతో ప్రతిభ, వ్యుత్పత్తి, అనుభవమూ కల్గిన సంగీత దర్శకుని కృషి కూడా వ్యక్తిగతమైన ఉదాత్త కళాలోభంవలన ప్రజాభిరుచికి దూరమయే అవకాశం ఉంది. అందుచేత సంగీత దర్శకుడు తన స్వంత కళాభిరుచితోబాటు, ప్రజాభిరుచిని, చిత్ర పరిశ్రమయొక్క ఆర్థిక నిబంధనలని గుర్తుపెట్టుకొనవలసి ఉన్నది.

నేపథ్య గాయకునిగా నాకు గల అనుభవాన్నిబట్టి నాలుగు మాటలు చెప్పవలసి ఉంది. నేపథ్య గాయకునికి శ్రావ్యమైన కంఠస్వరమూ, వివిధ సంగీత గమకములను పరికించగల శక్తితోబాటు రసభావములకు అనుగుణ్యమైన నాదోత్పత్తి, స్పష్టమైన ఉచ్చారణ, కంఠస్వరముయొక్క పట్టు విడుపులు తెలియడం చాలా అవసరం. రస భావాలను పోషించగల గాత్రశైలి యే శాస్త్రములోను, యే పారిభాషిక పదాలతోను నిర్వచింపబడనిది, అనుభవమే గురువుగా తనకు తానై తెలుసుకోవలసినది. నా భావనలో నేపథ్య గాయకునికి సంగీత హృదయంతోబాటు కవి హృదయమూ, కంఠస్వరములోని మెళకువలతోనే నటించగల నటనాకౌశల్యమూ కూడా అవసరం.

వృత్తినిబట్టి నేపథ్య గాయకుని బాధ్యతలు యింకా ఉన్నవి. తననుండి ఉత్తమ ఫలితాన్ని ఆశించే సంగీత దర్శకుల భావనకు అనుగుణంగా తన సంపూర్ణ సహకారం ఎంతో సద్భావంతో ఇవ్వవలసి ఉంది. ఈ సందర్భంలో వివిధ సంగీత దర్శకుల ప్రతిభాన్వితములైన సంగీత రచనలను తమ గాత్ర మాధుర్యంతో రసికలోకానికి అందించిన ఉత్తమ గాయకులు ప్రశంసార్హులు. లతామంగేష్కర్, గీతాదత్, షంషాద్, ఆశా, మహమ్మద్ రఫీ, తలత్ మహమ్మద్, మన్నాడే, ముఖేష్ మొదలగు ఉత్తరదేశ గాయకులు, సుశీల, లీల, జానకి, సౌందరరాజన్, గోవిందరాజన్, జయరామన్, లోకనాథన్, శ్రీనివాస్, రాజా, మాధవపెద్ది, పిఠాపురం మొదలగు దక్షిణదేశ గాయకులు సినీ సంగీత సీమకు వర ప్రసాదులుగా భావించవలసి ఉంది.

కళాకారునిగా నా అనుభవాని బట్టి నా గాఢ విశ్వాసాన్ని తెలియజేసేమాట ఒకటి చెప్పవలసి ఉంది. కళాకారుని నుండి వ్యక్తమయే కళాకాంతిలో అతడు జీవితంలో పొందిన అనుభవాల గాఢత్వము, తీవ్రత ప్రతిబింబించకమానవు. భావ తీవ్రత, ఆర్ద్రతలేని హృదయం నుండి ఉత్తమమైన కళ వ్యక్తమయ్యే అవకాశం లేదు. అందుచేత కళాకారుడు కళా సాధనతో తుల్యంగా జీవిత అనుభవాల నుండి ఉన్నతమైన హృదయ సంస్కారాన్ని కలిగించుకోవలసి ఉంది.

ప్రజల ఉత్తమమైన అభిరుచితో, విజ్ఞత, బాధ్యత, సానుభూతితో కూడిన సద్విమర్శతో ప్రతిభావంతులైన సంగీతదర్శకుల ప్రజ్ఞా విశేషంతో, నేపథ్య గాయకుల నైపుణీ రాగంతో, మన క్రొత్త సంగీత సంప్రదాయం ఎంతో వృద్ధినీ, ఉత్తేజాన్నీ పొందగలదని నా అచంచల విశ్వాసం. ★



"మీనాన్న ఉత్తరం రాశాడు, పండక్కి నిన్ను తీసుకొని, రమ్మని!... ఉంగరం పెడ్తాడుట! ఇన్నాళ్లూ లేని ఉంగరం ఇప్పుడు ఎవడిక్కావాలి? సిగరెట్ టిన్నులేనా కాదు! అదీ పధ్నాలుగు కాళ్ల ఉంగరం!! నువ్వెళ్లు! నేను రాను!!..."

ఇంతలో అంగట్లోకి అడుగుపెట్టిన సీతారామయ్య పంతులు శెట్టి మొహం చూసి ఏదో దిగులుతో బాధపడుతున్నాడని యిట్టే పసిగట్టేసి "ఏమిటి శెట్టిగారేదో పెద్ద ఆలోచనలో మునిగి పోయినట్టున్నారు" అన్నాడు పరోక్షంలో మాట్లాడుతున్నట్లు వ్యంగ్యంగా.

శెట్టి వెంటనే ఆలోచనల్లోంచి తేరుకుని "ఎవరూ. పంతులుగారా. ఏం ఈమధ్య తమ దర్శనం దొరకడమే కరువైపోయింది. ఊళ్లో

బాధ్యత

20-వ పేజీ తరువాయి

లేరా ఈమధ్య" అని పలకరించా డతన్ని.

సీతారామయ్య పంతులు శెట్టికి చిరకాల మిత్రుడు—అంటే తను వేలం అంగడి పెట్టుకుని అవస్థ పడుతూండిన రోజుల్నించీ అతనితో స్నేహం. శెట్టి దృష్టిలో పంతులు ఈపాటికి ఏదో హైకోర్టులో జడ్జి పని వెలగబెట్టాల్సినంత మేధావంతుడు. ఏదో అతని గీత తిన్నగా లేకా, కాలం కలిసిరాకా, యింకా తాలూకాఫీసులో గుమాస్తాగా తగలడుతున్నాడని శెట్టి అభిప్రాయం. అందువల్ల శెట్టికి పంతులంటే చాల గౌరవం. సాధారణంగా తన వ్యాపార విషయాల్లోనే కాక తన కుటుంబ విషయాల్లో గూడ పంతులుతో సలహాపడుతూంటాడు. అతను.

" ఊళ్లో లేకేం. తాసీల్దారు కేంపునించి

వచ్చాడుగా. నెలరోజులుగా వూపిరాడనివ్వనంత పని ఆఫీసులో. నిన్నటికి ఒక మోస్తరుగా పూర్తయ్యాయి యియ్యాయి లెఖ్ఖలు .... అది సరేగాని ఏమిటి నువ్వేదో తెగాలోచిస్తున్నట్టున్నావ్ ?'' అని అసలు విషయం ఏమిటో చెప్పమని సూటిగా అడిగాడు. పంతులు. పంతులు ఎప్పుడూ ఏకవచనంలో మాట్లాడుతాడు శెట్టితో.

"మీకు తెలిందేది పంతులుగారూ. మా అబ్బాయి విషయమేగా''

"ఏమిటి సంగతి ? త్వరలో ముహూర్తం ఏదన్నా పెట్టిస్తున్నావా ఏం కథ'' అని హుషారుగా కనుబొమ ఎగరేస్తూ అడిగాడు పంతులు.

శెట్టి వెంటనే ముఖం చిట్లించి "వాడి కీక అదొక్కటే తక్కువ ..... చూడండి పంతులుగారూ. ఈరోజు మధ్యాహ్నం ఒక గంటసేపు యిక్కడ కూర్చోరా, నేను భోజనంచేసి వస్తాను అని మళ్లీ వచ్చేలోపల, ఆ రాజశేఖరంగా రబ్బాయితో కలిసి సినిమాకు ఉడాయించాడు వాడు. బాధ్యత తెలిసిన కుర్రాడైతే యిలా జేస్తాడా చెప్పండి. ఈ అంగడి ముఖ్యమా ఆ వెధవ సినిమా ముఖ్యమా. ఆ బోడి సినిమా యిప్పుడు గాక రేపు జూసుకో కూడదూ ? ,... అసలు వాడి అంగటి వ్యవహారం కొంచమన్నా పట్టించుకుంటేగా, చూడండి'' అని పంతులిని దగ్గరకు పిలిచి రహస్యంగా అతని చెవిలో "వెళ్ళేటప్పుడు వీడు గల్లాపెట్టె తాళాలు సుబ్బరామయ్య చేతి కిచ్చివెళ్ళాడు. సుబ్బరామయ్య నమ్మకస్థుడు గనక సరిపోయింది. ఇలాగే రేపు యింకెవరి చేతికన్నా యిచ్చిపోతే యిక ఈ అంగట్లో ఏమన్నా మిగులుతుందీ ? ఒక్క క్షణంలో గుల్లయిపోదూ ?'' అని మళ్లీ మామూలుగా "ఇలాగుంది వీడి తరహా. వీణ్ని ఎలా దారికి తీసుకురావడమా అని యిదొక పెద్ద బెంగై పోయింది .... పంతులుగారూ. అబ్బాయి పెద్దవాడయ్యాడు కదా యిక వాడికీ అంగటి వ్యవహారాలు అప్పగించి నేను కాస్త విశ్రాంతి తీసుకుందామని తలిస్తే అది నెరవేరేలా లేదు'' అని తన గోడు చెప్పుకున్నాడు.

పంతులు సావధానంగా విని సానుభూతిపూర్వకంగా తలూపుతూ "వూ'' అన్నాడు.

శెట్టి మళ్లీ మొదలెడుతూ "నెల రోజుల క్రితం మెడ్రాసునించి సరుకు తీసుకురారా అని పంపిస్తే, గుడ్డల పార్శిల్సు స్టేషనులో దింపి, వాటిని యిక్కడికి తీసుకొచ్చి పడెయ్యమని వో రిక్షా వాడి కప్పగించి, చక్కా యింటి కెళ్లాడు వాడు. అదేమిట్రా అంటే రిక్షావాడు ఎక్కడికి పారి పోతాడులే అని నిర్లక్ష్యంగా మాట్లాడుతాడు. మన అదృష్టం బాగుండి ఆ రిక్షావాడు నేరుగా మన అంగటికి జేర్చాడు సరుకు. అంతా చూడబోతే ఏదో వాడు నాకోసం చాకిరీ చేస్తున్నట్టు తలుచుకుంటాడే గానీ అది వాడి బాధ్యత అని యింతవరకూ గ్రహించలా. నేనేమన్నా కాస్త వాడి మీద కఠినంగా మాట్లాడబోతే, వాళ్లమ్మ కళ్ల నీళ్లు బెడ్తుంది. నాకేం చేయటానికి తోచటంలే'' అని తన మనస్సులోని ఆవేదనను వెళ్లబోశాడు.

పంతులు, శెట్టి పరిస్థితికి జాలిపడి సీరియస్‌గా ముఖంపెట్టి "అయితే శెట్టీ దీనికొక ఉపాయం చెబుతాను. అలా చేస్తావా ?'' అనడిగాడు.

"ఏమిటది ?''—శెట్టి ఆత్రంతో అడిగాడు.

"వెంటనే రామానందానికి ఓ పిల్లను చూసి పెళ్లిజేసెయ్.'' శెట్టి పొడిగానవ్వి "బాగుంది మీహాస్యం ! పెళ్ళనుకుంటే ఇప్పుడు వాడికి పిల్లను వెతకాల్సిన పనే లేదుగా, అప్పుడే పలుగురైదుగురు వాడికిపిల్ల నిస్తామంటూ మా ఇంటికి చుట్టూ తిరుగుతూంటే! కానీ వాడు కాస్త ఆ సినిమాలూ, చీట్లాటలూ మానేసి బుద్ధిగా వ్యాపార విషయంలోకి దిగాకగానీ పెళ్లిమా టెత్తకూడదని అనుకుంటున్నా. అందుకూ ఈ తాపత్రయమంతా.''

"సరేలేవయ్యా. పిచ్చి కుదిరితేగాని పెళ్లి జరగదని నువ్వంటున్నావ్. వాడికి పెళ్లి జరిగితేగానీ పిచ్చి కుదరదని నా వాదన. ముందు వాడికో భార్యను అంటగట్టు. చచ్చినట్టు ఈ కుర్ర చేష్టలు మాని దారికి రాకపోతే నన్నడుగు. ఒకవేళ వాడుగా తెలుసుకొని రాకపోయినా వాడి భార్యయినా వాణ్ని దారిలోకి తీసుకొస్తుంది

ఈజిప్టులో ఫరూక్ పెళ్ళి చేసుకున్నప్పుడు, దేశంలో 'పిక్ పాకెట్'లు వివాహం పూర్తి అయ్యేవరకూ జేబులు కొట్ట రాదనే తీర్మానం అమలుపరచుకున్నారుట!

కొ॥టా. ఆదిశేషయ్య (నెల్లూరు)

చూస్తాండు'' అని సవాల్ చేశాడు పంతులు.

"ఇప్పుడే పెళ్లిమాటంటే చాలు, వాడి విషయం ఎటున్నా వాళ్లమ్మ మాత్రం వెంటనే సంతోషంతో ఇంటి కప్పు తాకేటట్టు ఎగిరి ఒక్క గంతు వేస్తుంది. కోడల్ని త్వరగా తీసుకురావాలని నాతో ప్రతిరోజూ ఏదో ఒక వంకబెట్టి చెబుతూంటుందిలే. అయితే వాడికి పట్టుమని ఇరవై ఏళ్లన్నా లేవు అప్పుడే పెళ్లేమిటి పంతులుగారూ''

"నీకు తెలియదులేవయ్యా. వాడి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలంటే, వాడి ఆటలు కట్టెయ్యాలంటే వాడిక్కావల్సింది వెంటనే పెళ్లి. అదీ నా గట్టి అభిప్రాయం.'' అని నొక్కి చెప్పాడు పంతులు.

"అంతేనంటారా'' శెట్టి అడిగాడు సంకోచిస్తూ.

"ఆఁ. అంతే'' అంటూ గల్లాపెట్టె మీదున్న శెట్టి ముక్కు పొడుంకాయ తీసి నశ్యం బిర్రుగా ముక్కులకు పట్టించి "ఇక వస్తా'' అంటూ అక్కడినించి నిష్క్రమించాడు పంతులు.

శెట్టి, కుమారుడి పెళ్లి విషయమై ఆలోచనలో పడ్డాడు. తీవ్రంగా ఆలోచించాడు. ఒక్క రోజు కాదు. మూడు రోజులపాటు ఆలోచించాడు. పంతులు సలహామీద శెట్టికి ఎప్పుడూ మాంచి గురి ! ఏ సమస్యనైనా, ఏ విషయమైనా యిట్టే సూక్ష్మంగా ఆలోచించి వజ్రపు తునకలాంటి సలహా ఒకటి విసిరేస్తాడు పంతులు అని అతని నమ్మకం.

ఆరోజు రాత్రి భోజనం చేశాక తాపీగా తమలపాకులు నములూ, శెట్టి భార్యతో "ఏమేవ్, ఆ వెంకటసుబ్బయ్యగా రమ్మాయికి వేరేచోట సంబంధము కుదుర్చుకున్నారా ?'' అని అడిగాడు.

ముత్యాలు వెంటనే కోపం పటిస్తూ "ఏమో నాకేం తెలుసు. పాపం వాళ్లమ్మాయిని మనబ్బాయి కివ్వాలని ఎంత ఉబలాట పడ్డారు. ఎన్ని విధాల ప్రయత్నించారు. అసలు మీరామాట పడనిస్తేగా. అంత మంచి సంబంధాన్ని ఎవరైనా కళ్ల కద్దుకుని చేసుకోరూ'' అంది కసిగా.

శెట్టి ముక్తసరిగా నవ్వి "అయితే రేపు వాళ్లను కనుక్కో. వాళ్లింతవరకు ఎక్కడాకుదుర్చుకోకపోతే, మనవాడికి చేస్తామని చెప్పు.''

"ఏమిటి'' — దీర్ఘం తీస్తూ ఆశ్చర్యంతో ఒక్క కేకేసి గట్టిగా చేతులు చరిచి ముత్యాలు "నిజమేనా, లేకుంటే నన్ను తమాషా పట్టిస్తున్నారా'' అంది సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బైపోతూ.

"నిజమేనే. ముందు వాళ్లను కనుక్కో'' అని లేచి పడకగదికి దారితీశాడు శెట్టి.

"వాళ్లనెందుకు కనుక్కోడం, వాళ్లింకా ఎక్కడా కుదుర్చుకోలేదులే. నిన్నకూడ అమ్మాయి అమ్మ నాకు దేవాలయంలో కనబడి చెప్పింది. మీతో వూరికే అలా అన్నాను. అయినా ఎంతమంచి వారండీ మీరు.... అయితే ఉదయాన్నే మనిషిని పంపించి వెంకటసుబ్బయ్యగారిని యిక్కడికి రమ్మంటాను.'' అంది గుక్క తిప్పుకోకుండా ముత్యాలు పట్టలేని సంతోషంతో. ఆమె కారోజు రాత్రి నిద్రేలేదు.

శెట్టి ఉదయం లేవటంతోటే అతనికోసం వెంకట సుబ్బయ్య బృందం అక్కడ హాజరైంది. సంప్రతింపులు అన్నీ జరిగాయి.

మరో నెల తిరక్కముందే కోటిలింగం శెట్టి కుమారుడు చి. రామానందానికీ, వెంకటసుబ్బయ్య చెట్టి కుమార్తె సౌ. త్రిపుర సుందరికీ వైభవంగా వివాహం జరిగింది.

* * *

రామానందం పెళ్లి జరిగాక మళ్లీ వో నాలుగు నెల్ల తరువాతగానీ శెట్టికి తటస్థపడలా పంతులు.

"ఏమిటి శెట్టి సంగతులు, రామానందం ఎలాగున్నాడు ? చల్లగా ఈ అంగటి వ్యవహారం వాడి మీదికి వదిలెయ్యక నువ్వే కనిపెట్టుకున్నావే'' అంటూ పంతులు ప్రవేశించాడు అంగట్లోకి.

శెట్టి ఆట్టే హుషారుగా లేడు. ఏదో అవ్యక్తమైన దిగులు యిదివరకటికన్నా ఎక్కువగా క్రుంగదీస్తోందతన్ని. ముఖంలో ముడతలు. మరింత స్పష్టమవుతున్నాయ్. అయినా "రండి, యిలా కూర్చోండి'' అని పంతులుని కూర్చోబెట్టి "అసలు మా వాడు యిక్కడుంటేగా, ఈ వ్యవహారం వాడి నెత్తి నేయటానికి.... వాడికి పెళ్లిచేయటం, కొరివితో తలగోక్కున్నట్లుంది నాకు.'' అన్నాడు ముఖం చిట్లించి నిస్పృహతో.

"ఎక్కడి కెళ్లాడేమిటి ?'' కంగారుగా అడిగాడు పంతులు.

"నెలరోజుల క్రితం వాడూ, కోడలూ బెంగుళూరూ మైసూరు తిరిగిరావటానికి వెళ్లారు షికారుగా.''

"పెళ్లయిన కొత్తగదూ ఏకాంతంగా భార్యతో

బాధ్యత

కాలక్షేపం చేయాలని సరదా కలిగుంటుంది.... ఎప్పుడు తిరిగొస్తాడేమిటి ?''

"ఏమో, ఇరవై రోజుల్లో వచ్చేస్తానని వెయ్యి రూపాయలు పట్టుకెళ్లాడు. నెల దాటింది యింత వరకు ఎప్పుడొచ్చే సంగతి అంతులేదు. పైగా, మొన్న ఓ ఐదొందలు అర్జంటుగా టెలిగ్రావ్ మనియార్డరుద్వారా పంపమని ఉత్తరం వ్రాశాడు. ఏదో కేమెరా కొనాలట.''— శెట్టి చికాకుగా వీధి లోకి చూస్తూ చెప్తున్నాడు.

" ఊఁ....!''అని అంతకన్నా యింకేమీ అనలేక వూరుకున్నాడు పంతులు, శెట్టి కోపంచూసి.

"అసలెందుకండీ, ఈ వూళ్లు తిరగడాలు— వృధాగా డబ్బులు తగలెయ్యడంతప్ప. ఇదంతా యిప్పుడే ఎందుకురా. బెంగుళూరు అవీ చూడటా నికి యిక రోజులేలేవా' అంటే పంతంపట్టి అన్నం తినటం మానేశాడు ఆ పూటవాడు. ఇక వాళ్లమ్మ వాడి తరపున సాధించింది. సరే ఎలాగన్నా ఏడవమని పొమ్మన్నా. ఏం చేయమంటారు అంతకన్నా.'' అని తన నిస్సహాయతను చెప్పుకున్నాడు శెట్టి.

"సరేలే. పసితనంగదా, ఈ కాలపు కుర్రా ళ్లకు పెళ్లిగావటంతోటే కొన్నాళ్లపాటు భార్యతో పట్నాల్లో ఏకాంతంగా గడపాలన్నా కోరిక ఉండ టం సహజమేగా.'' అని రామానందం తరపున వాదించ బోయాడు పంతులు.

"అయితే మనం పెళ్లి చేసుకున్నప్పుడు యిలాగే భార్యతో షికార్లు కొట్టామా చెప్పండి. అంతా వెకిలిచేష్టలుగాకపోతే'' శెట్టి నుండి సడ్డాడు.

"ఆ రోజుల్ని ఈ రోజులతో పోలిస్తే ఎలాగ. నానాటికీ నాగరికత పెరుగుతోందాయె, అయినా ఈ ముచ్చటా మోజు యింకా కొంత కాలమేగా, అదీ తీరిపోయాక చచ్చినట్టు మనదారికిరాక యింకేంచేస్తాడు.'' అని శెట్టిని ఓదార్చబోయాడు పంతులు.

"ఏమో నాకేం నమ్మకంలేదు. లేకపోతే పెళ్ల య్యాక కాస్త బాధ్యత తెలిసి గుణంగా నడుచు కుంటాడని మనం అనుకోవడమేమిటి, వాడిలా పైలా పచ్చీసుగా డబ్బులెగరేసూ వూళ్లు తిరగడ మేమిటి ? ఇదిజాలక కేమెరా కొనడాని కర్జం టుగా డబ్బులు గావాలి. రేపు ఇంకో కారు కొనా లని ఓ వెయ్యి పంపమంటాడేమో ఎక్కడేదో డబ్బుల గనులు బోసున్నట్టు'' అని ... తన ... క్కను వెళ్లగ్రక్కాడు.

"ఏం భయపడకు. వాడికిక ఒకరుచెప్పే ... ... దు శెట్టి. తనంతట తనే తెలుసుకొని దారికి వస్తాడులే. ఇంకొంతకాలం ఓపిక పట్టూ'' అని శెట్టికి ఉపశమన వాక్యాలు చెప్పి అక్కడనించి ... గా జారుకున్నాడు పంతులు.

* * *

రామానందం, భార్యాసమేతుడై నెలాపది హేను రోజులు మైసూరు, బెంగుళూరు, మద్రా సంతా తిరిగి యిల్లు చేరుకున్నాడు. శెట్టి కోపం వల్ల కొడుకునుగానీ కోడల్నిగానీ పలకరించలేదు. అయినా రామానందం తను తీసిన ఫోటోల ఆల్బమ్ తీసుకొచ్చి శెట్టికి చూపించబోయాడు, గాని శెట్టి "అవన్నీ మీ అమ్మకు చూపించు చాలు'' అని ముక్తసరిగా చెప్పి ముఖం అటువేపు త్రిప్పుకున్నాడు. ... నీ రామానందం అందుకు చిన్నబుచ్చుకోలేదు. నాన్న ఏదో వ్యాపార విషయంమీద బెంగతో ... న్నాడు గాబోలు'' అనుకుని వెళ్లిపోయాడు.

శెట్టి అప్పట్నించి కొడుకుతో మాట్లాడ్డం దాపు మానేశాడు. తను బెట్టుసరిగా ఉంటేనన్నా కొస్త పశ్చాత్తాపపడి దారికి వస్తా డేమోనని అతని ఆశ ! తనేదైనా రామానందంతో చెప్పాల్సివస్తే, ఆ మాటలు భార్యద్వారా చెప్పించే వాడు. అయినా రామానందం ప్రవర్తనలో చెప్పుకోదగ్గ మార్పు ఏమీ రాలా. ఇన్నాళ్లు బయట షికార్లు కొట్టొండేవాడు యిప్పుడు అస్తమానం యింటిదగ్గరే తిష్టవేసి భార్యామణితో కబుర్లాడుతూంటాడు. అయితే సినిమాల పిచ్చి మాత్రం వదులుకోలేదు. కొత్త సినిమా అంటూ ఏదైనా వచ్చిందంటే చాలు, ఆరోజే సతీసమే తుడై ఆ సినిమాకి హాజరవక తప్పదు. కనీ ఎప్పుడేనా తన కొట్టే యింట్లో ఏమీ తోచ నప్పుడు అంగటిదాకా వెళ్లి వస్తూండేవాడు గూడ.

శెట్టి యధాప్రకారంగా ఉదయం ఆరున్నర

నించి రాత్రి 9 వరకూ విరామం లేకుండా అంగట్లో గడుపుతున్నాడు. పెరిగి పెద్ద వాడైన కొడుకు ఉండి కూడ తనకీ భారం తగ్గ లేదు గదా అని అప్పుడప్పుడూ, లోలోపలే కుమిలి పోతూంటాడు.

ఓరోజు మధ్యాహ్నం రామానందం భార్య త్రిపురసుందరిని చూడటానికి ఆమె స్నేహితు రాలు రమ వాళ్లింటి కొచ్చింది. రమ, త్రిపుర ఒకే తరగతిలో స్కూలుఫైనల్ వరకూ చదువు కున్నారు. రమ భర్త ఆ ఊళ్లోనే హెల్త్ ఆఫీ సరుగా పనిచేస్తున్నాడు.

రమ, త్రిపురసుందరి ఉన్న గదిలోకి అడుగెడు తూనే అక్కడ రామానందం కూడా కూర్చొ ఉండటం చూసి సిగ్గుపడి తటాలున వెనక్కొ చ్చెయ్యబోయింది.

కానీ అంతలో "ఫరవాలేదులే రా రమా" అని త్రిపుర, ఆమె చెయ్యి పట్టుకుని లాక్కొచ్చి కుర్చీలో కూర్చోబెట్టింది. రామానందం స్నేహితురా ళ్లిద్దర్నీ ఏకాంతంగా మాట్లాడుకోనివ్వటానికి, మెల్లగా ప్రక్క గదిలోకి దాటుకున్నాడు.

"సారీ త్రిపురా మీ యిద్దర మధ్యా ఏకాంతాన్ని చెడగొట్టాను. నేను మీ ఆయన ఈ వేళప్పుడు యింట్లో ఉంటారని ఎదురు చూడలేదు. తెలి సుంటే యిక్కడికి రాకపోదును." అంది రమ పెద్ద తప్పు చేసిన దానల్లే బాధపడుతూ.

"ఏం ఫరవాలేదు వూరుకో. మళ్లీ మనం ఎన్నాళ్లకు కలుసుకున్నాం. నిన్ను చూస్తుంటే ఎంత సంతోషంగా ఉందో తెలుసా" అని రమను సమాధాన పరచింది. తరువాత స్నేహితురా ళ్లిద్దరూ చీరెలనించీ సినిమాలదాకా అన్నీ పిచ్చా పాటీ మాట్లాడుకున్నారు. ఆఖరికి తమ భర్తలను గురించి ప్రస్తావ నొచ్చింది.

త్రిపుర అడిగింది "మీ ఇంటాయన ప్రతి రోజూ ఆఫీసుకి ఎన్ని గంటలకు వెళ్తాడు" అని.

"ఉదయం తొమ్మిదికల్లా వెళ్లి సాయంత్రం ఐదుకి గానీ రారు. కొన్నిసార్లు ఆఫీసులో పని ఎక్కువగా ఉంటే చాల ఆలశ్యమవుతుంది కూడ. ఆయన టయానికి రాకపోయారనుకో ఇక అప్ప ట్నుంచి ఆయనకోసం కళ్లు కాయలు గాసేలా ఎదురుచూడటంతో సరిపోతుంది నాకు. ఏపనీ చేయటానికి తోచదు. ఆయన మళ్లీ యిల్లు చేరే వరకూ నా మనస్సు మనస్సులో ఉండదనుకో" అని రమ చెబుతూంటే, త్రిపుర ఆ అనుభవాల్ని వింతగా వింటోంది.

"సరేగాని మీవారికేం ఉద్యోగమే ?" అని రమ ప్రశ్నించింది త్రిపురని.

"ఉద్యోగమా ఉహు ఏమీలేదు. వ్యాపారం" అంది త్రిపుర.

"ఇంటిదగ్గరే చేస్తూంటారా. ఏం వ్యాపారం?" అని అమాయకంగా మళ్లీ అడిగింది రమ.

"గుడ్డల వ్యాపారం. బజారులో క్లాత్ స్టోర్ లేదూ, అది మాదే. అయితే ఈయన అంతగా అంగటికి వెళ్లరు. అంతా మా మామగారే చూసుకుంటారు." అంది త్రిపుర తేలికగా.

"అయితే తెలి కడుగుతాను మీ ఆయన ఎప్పుడూ ఇంట్లో ఉంటే ఆయన కెలా ప్రొద్దు పోతుందే ? విసుగు పుట్టదూ" అనడిగింది ఆశ్చ ర్యంగా రమ.

"ఎందుకూ ?" అర్థంకానట్టు ఎదురు ప్రశ్న వేసింది త్రిపుర.

"ఏమోనమ్మా మా ఆయనకు ఎప్పుడన్నా ఒక్క సారిగా రెండు రోజులు శెలవు దొరికిందంటే, ఆ రెండోరోజు 'నా కింట్లో ఏమీ తోచడంలేదు. ఆఫీసు కెళ్లినా బాగుంటుంది. నాకు ఏదైనా పని చేస్తూంటేనే ఉత్సాహంగా ఉంటుంది' అని అను కుంటూంటారు. అలాంటిది మీ ఆయనకు ఏపనీ లేకుండా ప్రొద్దెలా పోతుందోనని అడిగాను." అంది రమ. ప్రక్క హాల్లో సోఫాలో కూర్చొ న్న రామానందానికి ఆ మాటలు వినటంతోటే మనస్సు చివుక్కు మన్నది పౌరుషంతో. ఒళ్ళంతా సూదులతో పొడిచినట్లుంది అతనికి తన భార్య స్నేహితురాలు అలా చులకనగా మాట్లాడుతుంటే.

త్రిపురకు ఏం సమాధానం చెప్పటానికి తోచలా. ఆ విషయం మార్చెయ్యాలని ప్రయత్నిం చింది. ఇంతలో రమ లేచి "అప్పుడే నాలుగున్న రయింది. మావారు వచ్చేలోపల కాఫీ, టిఫిను సిద్ధంచేసి తయారుగా ఉండాలి. వస్తానే" అంటూ వెళ్లిపోయింది.

ఆ మరునటిరోజు : సాయంత్రం ఆరుకల్లా ఇంటికి వచ్చేశాడు శెట్టి. వస్తూనే పడకగదిలో కెళ్లి ముసుగుదన్ని పడుకుంటూ భార్యను పిలవ నంపాడు. ముత్యాలు వచ్చాక "నాకేదో ఒళ్లంతా నొప్పిగా ఉంది. ముందు కాస్త కాఫీ తయారు చేసి తీసుకురా. కాస్సేపు విశ్రాంతి తీసుకోవాలి" అన్నాడు నీరసంగా శెట్టి.

"అయ్యో, డాక్టరుని పిలవనంపనా. ఎప్పుడూ లేదే ఎందు కిలా వచ్చింది మీకు" అని కంగారు పడిపోయి అడిగింది ముత్యాలు.

"దీని కెందుకే డాక్టరు. రేపు ఉదయానికి చూసుకోవచ్చులే" అన్నా డతను.

ముత్యాలు కాఫీ తయారుచేసి తీసుకెళ్లి యిచ్చింది భర్తకి. ఇంతలో రేడియో పెట్టుకో టానికి హాల్లోకి వచ్చిన రామానందానికి, పడక గదిలోంచి తన నాన్నగారి మాటలు వినబడు తోంటే ఆశ్చర్యంతో ఆగిపోయాడు—ఇంత త్వరగా ఎందుకు వచ్చేశాడని.

"రాత్రికి సుబ్బరామయ్య అంగటి తాళం చెవి తీసుకొచ్చి యిస్తాడు. రేపు కూడ ఉద యాన్నే వచ్చి అంగడి తెరవటానికి తాళంచెవి తీసుకుపొమ్మని చెప్పు. ఉదయాన్నే సుబ్బరామయ్య వస్తే తాళంచెవి యివ్వు. రేపటికి నాకు ఒంట్లో బాగుంటుందో లేదో" అంటున్నాడు శెట్టి భార్యతో. "అలాగే మీరేమీ దిగులుపడక పడుకోండి" అని గది లోంచి వచ్చేసింది ముత్యాలు.

మర్నాడు ఉదయం ముత్యాలు తాళంచెవి కోసం వచ్చినసుబ్బరామయ్యతో "అంగడి తెరవటానికితాళం చెవి యిప్పుడే అబ్బాయి తీసుకెళ్లాడు సుబ్బరామ య్యా. ఈపాటికి అంగడి చేరుకోనుంటాడు"అంది.

"అలాగామ్మా, అబ్బాయిగారా" అన్నాడు సుబ్బ రామయ్య ఆశ్చర్యపోతూ.

"ఆఁ. రోజంతా అంగట్లోనే ఉంటాను. మధ్యాహ్నం అన్నం కూడ అక్కడికే పంపించ మన్నాడు" అంది ముత్యాలు.

ప్రక్కన పడకగదిలో మగత నిద్రలో ఈ మాటలన్నీ విన్న శెట్టి ఆశ్చర్యానికి అంతులేదు! ★



"నేనేం పిచ్చివాణ్ణికాదు ... కలి పురుషుణ్ణీ కాదు, యుద్ధకాలపు బడ్జెట్‌ను 'సంతోషంగా భరిస్తున్న' సామాన్య మానవుడిని ...'

మీ శ్రీదేవి తెలుసుకొంది.

ఓ! అమ్మాయి, తనంత వాడికి కోపమని జవా బిచ్చి అవమానపరచడం రమణారావుకి తల కొట్టేసి నంత పనైంది. ఎలాగైనా, కాలేజీ అంతా చూస్తూండగా, వారంతా మెచ్చుకొనేట్టు తను హేమలత నేడ్పించాలి, అని నిశ్చయించుకున్నాడు.

మర్నాడు ప్రొద్దున్న కాలేజీ — గేటు దగ్గర తనతోబాటు కొంతమంది విద్యార్థులను పోగు జేసుకొని, హేమలత కోసం ఎదురుచూడ సాగాడు. రమణారావు పొడుగ్గా, బలిష్టమైన శరీరంతో, ఎథలెటిక్ ఛాంపియన్‌లా ఉంటాడు. వల్లని మాటు వేసుకొని, సిగరెట్టు కాలుస్తూ, ఆరోజు ఏమైనా సరే, హేమలత నవమానించాలని నిశ్చ యించుకొని ఆమెకోసం ఎదురుచూడ నారంభిం చాడు.

కొంతమంది పైవాళ్ళు కూడా ఈ ప్రదర్శన చూడాలనే కుతూహలంతో దూరంగా నిల్చున్నారు. ముందు కొంతమంది ఇతర క్లాసుల చదివే విద్యా ర్థినులు కాలేజీ లోపలకి వెళ్తున్నా, రమణారావు సిగరెట్టు కాలుస్తూ దర్జాగా నిలబడ్డాడే కాని, వారి నేమీ అనలేదు. అతని వాలకం చూసి, అతను ఏదో దురుద్దేశంతో ఉన్నాడని వాళ్ళు గ్రహిం చారు. వారు లోపలికి వెళ్లి ప్రిన్సిపాలుతో చెబుదా మనుకున్నారు కాని, ఒకవేళ తమ ఊహ నిజ మవునో కాదో అని జంకారు.

హేమలత రిక్షామీద వస్తోంది. దూరంనుండి ఆమె — రాక గమనించి రమణారావు తన పని కుద్యుక్తు డయ్యాడు. అతని ఉద్దేశం హేమలతను గేటు దగ్గర ఆపి, క్రితంరోజు ఆమె అన్న మాట లకు జవాబు చెప్దామని. హేమలత—రిక్షా కాలేజీ దగ్గరకు వస్తున్నకొద్దీ విద్యార్థుల ఆతృతా, రమణారావు—కంగారూ ఎక్కువైయ్యాయి. ఇంతలో గేటు వద్దకు ఒక జట్కా రావడం, అందులోంచి శ్రీదేవితో సహా మరో యిద్దరు విద్యార్థినులు దిగడం జరిగింది. హేమలత కూడా రిక్షా దిగు తోంది. రమణారావు దృష్టి హేమలతమీద ఉంది.

“రమణారావుగారూ !” అనే పిలుపు విని ఉలిక్కిపడ్డాడు. శ్రీదేవి గేటువద్ద నుల్చొని రమణా రావుని పిల్చింది. నిర్లక్ష్యంగా ఆవైపు రెండడు గులు వేశాడు. విద్యార్థులూ, బయటి జనం, విద్యార్థినులూ—అందరూ, శ్రీదేవి వైపు రమణా రావు వెళ్లడం గమనించారు.

“మీకు అక్కచెల్లెళ్ళు ఉన్నారా ?” అని గంభీ రంగా శ్రీదేవి అడగడం రమణారావుకి షాక్ కొట్టి నట్లయింది; తలూపాడు.

“మీ అక్క చెల్లెళ్ల నెవరైనా అవమానిస్తే మీకు ఎంత బాధగా ఉంటుందో ఊహించుకోండి. ఇందువల్ల మీరు సాధించేదేమీ లేదు. ఆడపిల్లల వెనకాల పడి, వారి నేడ్పించాలని చూడటం చాలా నీచమైన పని. ఇకనుంచి మీ రలా చెయ్యరని ఆశి స్తున్నాను” అని తనతోటి విద్యార్థినులతోనూ, హేమలతతోనూ కలిసి కాలేజీలోకి వెళ్లిపోయింది శ్రీదేవి.

రమణారావు నిర్ఘాంతపోయినా, వారు వెళ్తూంటే అతనికి ఉక్రోషం వచ్చి, ఏదో అనాలనుకున్నాడు. కాని బయటి గుంపులోంచి “మా సక్కగా బుద్ధి చెప్పిందిరా! అయినా బుద్ధిగా సదువుకోక, ఆడోళ్ల నేడ్పించడం, ఏం మగతనం ?” అని ఎవరో అనడం, ఇంతలో కాలేజీ—ప్యూను వచ్చి, ప్రిన్సి

శ్రీ దేవి

17 వ పేజీతరువాయి

పాలుగారు రమ్మంటున్నారని చెప్పడంవల్ల ఏమీ చెయ్యలేకపోయాడు.

ప్రిన్సిపాలుగారు రమణారావుని పిల్చి, కాలేజీ ఎన్నికల విషయాలు మాట్లాడారు. రమణారావు విద్యార్థుల సంఘానికి కార్యదర్శిగా నిలబడ్డాడు. అతనికి పోటీగా మరో ఇద్దరు నిలబడ్డారు. రెండు రోజుల తర్వాత ఎలక్షను జరుగుతుంది. రమణా రావు—బుర్రలో శ్రీదేవి అన్నమాటలు మార్మోగు తున్నాయి. ఇంతవరకూ ఏ స్త్రీ కూడా తనకు ఇంత సున్నితంగా బుద్ధి చెప్పలేదు. ఆమె మొహ ములో కోపం గాని, ఉద్రేకం గాని లేవు. నిర్మల మైన మనస్సుతో ఒక పెద్ద, ఒక చిన్నక బోధించినట్లు చెప్పింది. ఆ రోజంతా ఆమె అన్న మాటలు అతను ఆలోచిస్తూనే ఉన్నాడు.

మరునాడు, రమణారావు ఓట్ల గురించి ప్రచారం ప్రారంభించాడు. అన్ని క్లాసులలోని

విదేశాలకు వెళ్లాలంటే పాస్ పోర్టు కావాలి. ఓ హాలీవుడ్ తార విదేశాలకు వెళ్ళదల్చుకొని దరఖాస్తు పత్రాన్ని పూర్తి చేస్తోంది. అందులో ముఖ్యమైన ప్రశ్న ఇది :

“ఒకరా! ఇద్దరా! వివా హితులా, అవివాహితులా?”

“ఏమో! అంతగా జ్ఞాపకం లేదు గాని, వీటన్నిటికీ నే చెందిం దాన్నే” కాసేపు ఆలోచించి, ఆ తార సమాధానం వ్రాసింది.

'పద్మజ' (భిలాయ్)

విద్యార్థులకూ చెప్పాడు. ఆడపిల్లలతో చెప్పడమా, మానడమా అనే సందేహంలో పడ్డాడు. ఎలాగా ఒకసారి చెప్పక తప్పదు. మనసులో ఆ క్రితంరోజు సంఘటన బాధిస్తున్నా, అలాగే వెళ్ళాడు. లేడీస్ గది వద్ద ముందుగా హేమలత కన్పించింది. ఆమె అతనిని చూసి మొహం తిప్పేసుకుంది. తరు వాత, శ్రీదేవి కన్పించింది. శ్రీదేవి అతనిని చూసి చిరునవ్వుతో “ఎలక్షన్ గురించా ?” అని అడి గింది. రమణారావుకి ధైర్యం వచ్చింది. “అవు నండీ మీ అందరి వోట్లూ నాకే వెయ్యాలి!” అని, కొన్ని అచ్చు—కాగితా లామె చేతి కిచ్చాడు. విద్యార్థినులంతా శ్రీదేవి — చుట్టూ మూగారు. శ్రీదేవి ఆ కాగితాలు అందరికి యిస్తూ “అలాగే. తప్పక వేస్తాం” అని రమణారావుతో అంది.

బయటకు వచ్చిన రమణారావు, శ్రీదేవి నిక ఏడ్పించకూడదని తీర్మానించుకున్నాడు. మరునాడు ఎలక్షన్‌లో రమణారావే నెగ్గాడు. శ్రీదేవి, విద్యా ర్థినుల ప్రతినిధిగా ఎన్నికైంది.

అప్పుడప్పుడు శ్రీదేవిని కొందరు కాలేజీ కుర్రాళ్లు ఏమైనా మాటంటున్నా, రమణా రావు ఆమెను ఏమీ అనేవాడు కాదు. అంతేకాక, ఇద్దరూ విద్యార్థుల ప్రతినిధులు కాబట్టి, తరచూ కలసి మాట్లాడుతుండేవారు. ఇద్దరిమధ్యా క్రమ ముగా స్నేహం అభివృద్ధయింది. రమణారావు దృష్టిలో శ్రీదేవి ఆదర్శ యువతి. డిబేట్లలో శ్రీదేవి విరివిగా పాల్గొంటూండేది. పైగా మగ పిల్లలెవరైనా ఆమెతో మాట్లాడడానికి ప్రయ త్నిస్తే, ఆమె కూడా వారితో మాట్లాడడానికి ఉత్సాహంతో ఉన్నట్లుండేది. ఆ సంవత్సరం ముగింపుకు వచ్చేసరికి, కాలేజీలో అందరి అభి మానం చూరగొనిన విద్యార్థిని శ్రీదేవి. విద్యా ర్థులు, తమలో తాము ఆమెను 'వదిన' అని పిల్చినా, ఆమెను మాత్రం ఏమీ హేళన చేసేవారు కాదు. శ్రీదేవి ప్రవర్తనలోని హుందాతనమే వీటంతటికీ కారణం.

కాలేజీ వార్షికోత్సవాలలో శ్రీదేవి వీణా వాద్యంకూడా ఏర్పాటుచేశారు. రమణారావూ, శ్రీదేవీ కృషిచేసి, వార్షికోత్సవ కార్యక్రమం చాలా ఆకర్ష ణీయంగా ఏర్పాటుచేశారు. కాలేజీ ఆవరణను విరివిగా అలంకరించి, విద్యుద్దీపాలూ, మైకులూ, రంగుకాగితాల తోరణాలు ఏర్పాటుచేశారు. కాలేజీ నాటక సమితి—తాలూకు, సిల్కుతెరంతో వేదిక శోభాయమానంగా ఉంది. పట్టణంలోని ప్రముఖులు నాలుగువందల మందికి పైగా ఆహ్వానించారు. సాయంకాలం అయిదు గంటలకు అందరు వచ్చెయ్య డంతో, కార్యక్రమం ప్రారంభమైంది.

ఉపన్యాసాలన్నీ ముగిశాక శ్రీదేవి వీణ—వాయిం చడం ప్రారంభించింది. ఆమెలో వయసుతోనూ కష్టాలతోనూ, సౌందర్యంకూడా వృద్ధైంది. రోజూ ఆమెను చూసే విద్యార్థులకే, ఫుట్ లైట్స్—ముందర ఆమెను చూడగానే ఆశ్చర్యం వేసింది. శ్రీదేవి వీణ వాయించినదొక అరగంట సేపుమాత్రమే. నిజానికి ఆరోజు పైకి ఉత్సా హంగా కన్పిస్తున్నా, శ్రీదేవి మనసులో కొద్దిగా దిగులుంది. దానికి కారణం, అవాళ ప్రొద్దుటి నుంచీ రజనికి వంట్లో బాగులేదు. ప్రొద్దున్నే జ్వరం తగిలింది. మరొక రోజయితే ఆమె కాలేజీకి వెళ్లడం మానేసేది. కాని, ఆమె కాలేజీలో ముఖ్యంగా వుండీ తీరవలసిన రోజు కాబట్టి వెళ్లక తప్పలేదు. సాయం కాలం, ఆమె కాలేజీకి బయల్దేరేసరికి వాడు జ్వరంతో మగతగా పడుకున్నాడు.

శ్రీదేవి వీణావాయిద్యం పూర్తయి వేదిక దిగ గానే హేమలత, ఒక సూటువేసుకున్న యువకుడూ ఆమెవద్దకు వచ్చారు.

“మీ వాయిద్యం చాలా బావుందని మీకు ప్రత్యే కంగా అభినందనలు తెల్పడానికి మా అన్నయ్య వచ్చాడు. ఇతను మా అన్నయ్య ఆనంద్. ఈమే శ్రీదేవి; మా క్లాసుమేటు.” అని హేమలత పరిచ యం చేసింది. శ్రీదేవీ, ఆనంద్ పరస్పరం నమస్క రించుకున్నారు. ఆనంద్ ఇరవైఆరేళ్ళ వ్యక్తి.

మొహంలో ఒక రకమైన కొంటెతనం తొంగి చూస్తూంటుంది. ఉంగరాల జుట్టూ; కళ్ళూ, ను దు రూ చిన్నవి. సన్నగా పొడుగ్గా ఉంటాడు. అతని రూపంలో ప్రత్యేకత ఏమీ లేదు. చూడగానే ఆకర్షణ కలుగదు. పైగా,

విదుటివారి నతడు తీక్షణంగా చూస్తాడు. సూటువేసుకున్నాడు. ఆ సూటురంగు శరీరానికంతగా నప్పలేదు.

"మీ వాయిద్యం చాలా అద్భుతంగా ఉంది. మీ గురించి ఇదివరకే బేబీ చెప్పింది. మీతో పరిచయం చేసుకోవాలనివచ్చాను" అన్నాడు ఆనంద్. అతని గొంతుకా, మాటలూ ఏదో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడుతున్నట్లున్నాయి. శ్రీదేవికి నవ్వు వచ్చింది.

"చాలా థాంక్స్!" అంది చిరునవ్వు మాత్రమే ప్రదర్శిస్తూ.

ఇంతలో కొంతమంది విద్యార్థినులుకూడా ఆమెవద్దకు వచ్చి ఆమె నభినందించారు. ఆమె వారితో మాట్లాడులోంది. ఆనంద్ ఆమెవైపు తదేకదృష్టితో చూస్తూన్నాడు. శ్రీదేవికి అక్కడ మంచి వెళ్ళిపోవాలనివుంది. కాని అతను కదలక పోవడం చూసి మర్యాదకోసం నిలబడింది. అటు వేదికపైన విద్యార్థుల డ్రామా ఒకటి ప్రారంభమైంది. విద్యార్థినులంతా తమ సీట్లలోకి వెళ్ళి పోయారు.

"ఆమెను రేపు మనింటికి 'టీ'కి పిలవ్వా బేబీ!" అన్నాడు.

"అవునే; మీరు రేపు మా యింటికి టీకి రావాలి." అంది హేమలత. శ్రీదేవి కేం సమాధానం చెప్పాలో తోచలేదు. ఎలాగో వాళ్ల నొదిలించుకోవడానికి, "అలాగే" అంది.

"గర్ల్ స్టూడెంట్సు డ్రామాకోసం తయారవుతున్నారు. నేను వాళ్లకుసహాయం చెయ్యాలి. వెళ్తా" అంది శ్రీదేవి.

"వెళ్లిపోతారా?" అన్నాడు ఆనంద్, ఆమె వెళ్లిపోవడం తనకిష్టంలేనట్లు. శ్రీదేవికి కొంచెం చిరాకు గల్గింది. "డ్రామా ప్రారంభించారు. మనం కూడా ఆడియన్సులోకి వెళ్దాంపద!" అంది హేమలత. ఆమెకీ కూడా తన అన్నయ్య ధోరణి నచ్చలేదు. సరిగ్గా ఆ సమయంలోనే ఒక విద్యార్థిని వచ్చి, "శ్రీదేవిగారూ! మిమ్మల్నింటికి అర్జంటుగా రమ్మని కబురొచ్చింది" అని చెప్పింది. శ్రీదేవి కంగారుగా, "ఆ! ఏమయింది? రజనికి బాగులేదా?" అంది. ఆ విద్యార్థిని, కారణం తనకు తెలియదనీ, ఎవరో మనిషి వచ్చి చెప్పాడని చెప్పింది. శ్రీదేవి, ఆమె వెనకాల ఆనంద్, హేమలతా, కొద్ది దూరంలో నిల్చునివున్న ఆ మనిషివద్దకు వెళ్లారు. అతను విశ్వేశ్వరరావుగారి ఇంటి నౌకరు; శ్రీదేవిని చూసి, "చంటిబాబుకు ఆయాసం హెచ్చుగా ఉంది. డాక్టరుకోసం కబురు పంపారు. మిమ్మల్ని కూడా రమ్మన్నారు" అని చెప్పాడు.

"ఆఁ! నువ్వు ఒక జట్కా తీసుకురా..." అని శ్రీదేవి కంగారుగా ఆ నౌకరుతో చెప్తూంటే, ఆనంద్ అడ్డువచ్చి, "నా కారులో వెళ్దాం పదండి" అన్నాడు.

"మీకు శ్రమ—ఎందుకు? ఫరవాలేదు; నేను వెళ్తాను."

"అబ్బే! శ్రమేమీలేదు. రండి, నేనుకూడా అబ్బాయిని చూస్తాను" అని అంటూ, ఆనంద్ దారి తీశాడు.

"మా అన్నయ్య డాక్టరు!" అని చెప్తూ హేమ

శ్రీదేవి

లత, శ్రీదేవితో అతని ననుసరించింది. ముగ్గురూ కారులో కూర్చున్నారు. హేమలతకు కాలేజీ వదలి రావటం ఇష్టంలేదు గాని, తనేమైనా అంటే, ఆనంద్‌కు కోపంవస్తుందేమోనని అతని ననుసరించింది.

ఆనంద్ డ్రైవ్‌చేస్తూ, అయిదు నిముషాలలో విశ్వేశ్వరరావుగారి యింటివద్దకు చేర్చాడు. ద్వారం వద్ద విశ్వేశ్వరరావుగారు నిల్చున్నారు. శ్రీదేవి, హేమలతా, లోపలికి వెళ్లారు.

తను డాక్టర్ ఆనంద్‌ననీ, డాక్టర్ రాజుగారి అబ్బాయిననీ తనని తాను, విశ్వేశ్వరరావుగారికి పరిచయం చేసుకున్నాడు ఆనంద్. విశ్వేశ్వరరావుగారు, "వెరీ గ్లాడ్; ఇప్పుడే మా ఫామిలీ—డాక్టరు, మూర్తికోసం కబురు–పంపితే, ఆయన ఇవాళ సాయంకాలమే హైదరాబాద్ వెళ్లారని తెలిసింది. ఎవరికోసం కబురుపంపుదామా? అని ఆలోచిస్తున్నాను. మీరు రావడం మంచిపనైంది. వచ్చి పిల్లవాడిని చూడండి" అని ఆహ్వానించారు.

"అదృష్టవశాత్తూ, సాయంకాలం ఒక పేషెంటును చూడడానికై, మెడిసిన్ బ్యాగ్ కూడా

> "మీ ఆయన చెవికి ఏదో చికిత్స చేయించుకున్నారు. ఇప్పుడెలాఉంది?"
>
> "మా పెద్దమ్మాయి సంగీతం నేర్చుకోడం పూర్తి అయ్యేవరకు ఆయన చెవి బాధ తగ్గదన్నారు డాక్టర్లు!"
>
> కె. రంగారావు.

కారులో తెచ్చాను" అని అంటూ బ్యాగ్ తీసుకొని, ఆయనతో లోపలికి వెళ్లాడు డాక్టర్ ఆనంద్.

లోపల అనసూయమ్మ—గదిలో, రజని పక్కమీద పడుకొనిఉన్నాడు. కళ్ళుమూసుకొని, డొక్క ఎగరేస్తూ ఊపిరి పీల్చడానికి తెగబాధపడుతున్నాడు. శ్రీదేవి, హేమలతా, జయమ్మా, అనసూయమ్మా—అంతా వాడిచుట్టూ మూగిఉన్నారు. ఆనంద్‌ని చూసి వారందరూ తప్పుకొన్నారు.

స్టెతస్కోపుతో గుండెలూ, వీపూ పరీక్ష చేశాడు ఆనంద్. టెంపరేచరుకూడా చూశాడు. శ్రీదేవి కొద్దిగా దూరంగా నిలబడి చూస్తోంది. పిల్లవాడి వయస్సెంతని ఆమెనడిగాడు. మూడు న్నర సంవత్సరాలని చెప్పి, "ఎందుకండీ అలా బాధపడుతున్నాడు?" అని ఆందోళనతో అడిగింది. ఆనంద్ ఆమెతో, "ఊపిరి తిత్తులలో కఫంచేరింది" అన్నాడు. శ్రీదేవి, "మరేమీ ఫరవాలేదు కదండి?" అంది. ఆనంద్ చిరునవ్వుతో, "గాభరాపడకండి. తగ్గిపోతుంది" అని బ్యాగ్‌లోని సిరంజీ, సూదీ తీసి, ఒక ఇంజక్షను ఇచ్చాడు. ఇంజెక్షన్ ఇస్తూంటే పిల్లవాడు ఏడ్చాడు. శ్రీదేవికూడా ఏడ్చేసింది. హేమలత ఆమెనోదార్చింది.

"ఒక అరగంటలో ఆ బాధంతా తగ్గిపోయి కులాసాగా నిద్రిస్తాడు" అని చెప్పాడు డాక్టర్ ఆనంద్.

"తగ్గితే సరే; తగ్గకపోతే మళ్లీ మీకు కబురు చేస్తాం" అంది శ్రీదేవి. ఆమెకు రజనిమీదే పంచప్రాణాలు; వాడి బాధ చూడలేదు.

"అవసరంలేదు. తగ్గేదాకా నేనిక్కడే ఉంటాను" అన్నాడు ఆనంద్ ఆమె ఆందోళన చూసి. అలాగే విశ్వేశ్వరరావుగారూ, ఆనంద్ హాలులో మాట్లాడుకుంటూ కూర్చున్నారు. శ్రీదేవిప్రక్కన హేమలత కూర్చుంది. అనసూయమ్మ, జయమ్మకూడా రజనివద్ద కూర్చున్నారు.

ఒక గంటవరకూ బాధపడ్డాక, రజని ఊపిరి సరిగా పీల్చగలిగాడు. ఆనంద్ రజనికి మరొక ఇంజెక్షన్ ఇచ్చాడు. ప్రతి పది నిముషాలకీ, రజనిని పరీక్ష చేస్తూనే ఉన్నాడు. శ్రీదేవికి ధైర్యం చెబుతూ హేమలత కూర్చుంది.

రాత్రి పదకొండు గంటలయ్యాక, ఆనంద్ శ్రీదేవిని కంగారుపడవద్దని, రజని కులాసాగా నిద్రిస్తాడనీ, మళ్లీ మరునాడు ప్రొద్దున్నే తను వస్తానని చెప్పాడు. పక్కమీద రజని నిద్రిస్తున్నాడు. టెంపరేచరుకూడా కొంత తగ్గింది. శ్రీదేవి అతనికి చాలా కృతజ్ఞత తెల్పుకుంది. ఆమె అతని గురించి అనే ప్రతి మంచి మాట, ఆనంద్‌కు ఎంతో ఆనందాన్ని కలుగజేశాయి.

వీధి ద్వారంవరకూ, శ్రీదేవి, విశ్వేశ్వరరావుగారూ, హేమలతనూ, ఆనంద్‌ని అనుసరించారు. వారిద్దరూ కారులో కూర్చున్నాక, శ్రీదేవి లోపలికి వెళ్లి, రజనినొకసారి చూచింది. వాడు హాయిగా నిద్రపోతున్నాడు.

బయట కారు స్టార్టయింది. ఇంటికొచ్చేదాకా హేమలత అన్నతో ఎక్కువ మాట్లాడలేదు. ఇంట్లోకి వెళ్తూ, హేమలత, "ఇవాళ నేను అనుకున్నదొకటి; అయిందొకటి" అంది.

ఆనంద్, "ఇవాళ, నే ననుకోనిది నాకు లభించింది!" అన్నాడు. అదేమిటో కనుక్కుందామనుకొంది హేమలత, కాని ఆనంద్, కారు గారేజిలో పెట్టడానికి వెళ్లాడు. తను ఇంట్లో కెళ్లిపోయింది.

మరునాడు ప్రొద్దున ఎనిమిది గంటలకి ఆనంద్, విశ్వేశ్వరరావు గారింటికి వచ్చాడు. శ్రీదేవికి అతనిని చూడగానే చాలా సంతోషం కలిగింది. రజనిని ఎత్తుకు వచ్చింది. ఆనంద్, రజనిని పరీక్షచేసి, మందిచ్చాడు. ఊపిరితిత్తులలో కఫం చాలావరకు తగ్గిందనీ, రెండురోజులు జాగ్రత్తగా ఉంటే, పూర్తిగా తగ్గిపోతుందని చెప్పాడు. రజనిని ఎంతో అభిమానంతో పలకరించి, తన చేతులలోకి తీసుకున్నాడు. రజని కూడా ఆనంద్‌యందు అభిమానం ప్రకటించాడు. ఆనంద్ రజనిని ప్రేమగా చూస్తూంటే, శ్రీదేవి మనసు చల్లగా ఉండేది.

రెండురోజులు వరుసగా ప్రొద్దున్నా, సాయంకాలం వచ్చి డాక్టర్ ఆనంద్, రజనికి, శ్రద్ధగా పరీక్షించి, మందివ్వడంవల్ల రజనికి పూర్తిగా జ్వరం తగ్గిపోయింది. అప్పటినుంచి నాలుగైదు రోజుల కొకసారి వచ్చి, విధిగా రజనిని చూసి వెళ్తూండేవాడు. శ్రీదేవి అతనికి ఎంతో కృతజ్ఞత తెల్పుకొని, ఫీజివ్వబోతే అతను తీసుకోలేదు.

ఆనంద్ వచ్చినప్పుడల్లా రజనికి బిస్కట్లూ, పళ్లూ తెస్తూండేవాడు. వాణ్ణి ఒకసారి ఎత్తుకొని కొద్దిసేపు వాడితో కబుర్లు చెప్పి వెళ్లిపోతూ

ఉండేవాడు. శ్రీదేవితో కూడా రజని గురించే మాట్లాడుతూ ఉండేవాడు. ఆనంద్‌కు రజనిమీద కల్గిన అభిమానం చూసి, శ్రీదేవికే ఆశ్చర్యం కలిగేది. రజనికూడా ఆనంద్‌ని చూడగానే సంతోషంతో పొంగిపోయేవాడు.

ఒక సంవత్సర కాలం అతి త్వరితంగా గడిచింది.

ఈ సంవత్సర కాలంలోనూ ఆనంద్, హేమలతలు తరుచూ విశ్వేశ్వరరావు గారింటికి వస్తూండేవారు. ఆనంద్‌కు రజనితో ఆడుతూ కాలక్షేపం చెయ్యడం చాలా సరదా. వాడికోసం అనేక ఆటసామాన్లు తెస్తూండేవాడు. అప్పుడప్పుడు రజనిని తన ఇంటికి తీసుకెళ్ళి, ఒక పూట ఉంచి, మళ్ళీ తీసుకొచ్చి అప్పచెప్తూండేవాడు ఆనంద్.

డాక్టర్ రాజుగారికి ఇద్దరు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూ ఉన్నారు. పెద్దకొడుకు ప్రేమనాథ్ నౌకాదళంలో కెప్టెన్‌గా పనిచేస్తూ వివాహం చేసుకోడానికే అంగీకరించలేదు. రెండవ కొడుకైన ఆనంద్ డాక్టర్‌కోర్సు పాసై, రాజమండ్రీలో ప్రాక్టీసుపెట్టి ఏడాదికిపైగా అయింది. పెద్దమ్మాయి హేమలత. మరొక అమ్మాయి గిరిజ స్కూలుఫైనలు చదువుతోంది.

ఆనంద్‌కు వివాహం చెయ్యాలని, రాజు దంపతులు ప్రయత్నంచేస్తున్నారు. చాలా సంబంధాలు కూడా వస్తున్నాయి. అతను యం. బి. బి. యస్. చదువుతుండగానే, ప్రమీల అనే ఒక క్లాసుమేటుతో చాలా స్నేహంగా ఉండేవాడు. చాలాకాలంవరకూ, అందరూ ప్రమీలకూ, ఆనంద్‌కూ వివాహమౌతుందనుకొన్నారు.

ప్రమీల కాకినాడలో ప్రాక్టీసు పెట్టింది. ఆమె రెండుసార్లు రాజమండ్రీకూడా వచ్చింది. ఆమెను చూచి, ఆమె తమ కాబోయే కోడలని రాజు దంపతులు మురిసిపోయారు. కాని ప్రమీల తలిదండ్రులు వచ్చి, ఆనంద్‌కు ప్రమీలను చేసుకోమని అడిగినప్పుడు, డాక్టర్ రాజుగారు తన కుమారుని అభిప్రాయం కనుక్కొంగా, ఆనంద్ తను అప్పట్లో వివాహం చేసుకోనని, ప్రమీల వివాహం తనకోసం ఆపవద్దని స్పష్టంగా చెప్పేశాడు. కొడుకుయొక్క మనస్తత్వం అర్థంచేసుకోలేక రాజు దంపతులు బాధపడ్డారు.

శ్రీదేవి, ఆనంద్ రజనిమీద చూపిస్తున్న శ్రద్ధకు, చాలా సంతోషించింది. ఆనంద్‌ను, రాజు గారింట్లో 'బాబూ' అని పిలుస్తారు. రజనికూడా 'బాబు'అనే అంటాడు. ఆనంద్ తమ యింటికి వస్తే, రజనితో ఎక్కువసేపు కాలక్షేపం చెయ్యడం, తనతో రజని—కబుర్లే మాట్లాడడం, అంతకు మించి వేరే విషయాలేమీ మాట్లాడకపోవడం శ్రీదేవి గమనించింది. అంతేకాక ఆనంద్ డాక్టరవడంవల్ల, జయమ్మా, విశ్వేశ్వరరావుగారూ కూడా అతనివద్ద మందుపుచ్చుకోడంవల్లా, ఆ యింట్లో అందరికీ అతను ప్రీతిపాత్రుడయ్యాడు. ఈ సంవత్సర పరిచయంలోనూ శ్రీదేవి, ఆనంద్ ఎంతో మంచి వ్యక్తి అనే అభిప్రాయానికి వచ్చింది.

మొట్టమొదటి రోజుతప్ప, ఆనంద్ తనవైపు ఏనాడూ సూటిగా చూడలేదని కూడా శ్రీదేవి గమనించింది. స్త్రీల విషయంలో ఆనంద్ ఎంతో గౌరవంగా ప్రవర్తిస్తాడు. అతని మొఖంలో సహజంగాఉన్న కొంటెతనం, అతను ఎటువంటివాడో అనే అనుమానం కల్గించినా, అతని మాటలూ, ప్రవర్తనా చాలా సద్భావాన్ని కలిగిస్తాయి ఎవరికైనా.

శారద—ఇంట్లో సుందరమ్మగారితోనూ, శారదతోనూ ఆనంద్‌యొక్క మంచితనాన్ని ఎంతో వర్ణించి చెప్పేది శ్రీదేవి. రజనిని ఆనంద్ ఎంతో ప్రేమగా చూడటం, శ్రీదేవి మనసును చాలా ఆకర్షించింది. తను ఏ పని చేస్తున్నా, రజనియొక్క భవిష్యత్తు ఆమె మనసులో మెలగుతూనే ఉంటుంది. అందువల్ల రజనిని ప్రేమించేవారెవరైనా ఆమె దృష్టిలో తనకు నిజమైన స్నేహితులు.

ఇంటర్మీడియట్ పరీక్షలయిపోయిన తరువాత శ్రీదేవి ఒకనాడు తన గదిలో పేపరు చదువుకుంటూంటే, రజని వచ్చి, "అమ్మా ! బాబు !" అనడం వింది. రజని ద్వారంవైపు చూపించాడు. ద్వారంవద్ద నిలబడిఉన్న ఆనంద్‌ని చూసి, శ్రీదేవి "రండి", అని తను లేచి నుల్చొని ఆనంద్‌నాహ్వానించింది. ఆనంద్ ద్వారంవద్దనే నుల్చొని, "మిమ్మల్నొక చిన్నప్రార్థన చేద్దామని వచ్చాను" అన్నాడు.

శ్రీదేవి, "ఇలా వచ్చి కూర్చోండి !" అని కూచోడానికి కుర్చీ చూపించింది. ఆనంద్ ఆమె గదిలోకి అంతవరకూ ఎప్పుడూ రాలేదు. ఆనాడు కూడా అతనికి రావటం ఇష్టంలేదు. గుమ్మంవద్ద నుల్చొనే మాట్లాడి వెళ్ళిపోదామనుకున్నాడు. జయమ్మతో తను మాట్లాడుతూ, శ్రీదేవితో తనకొక చిన్న పనుందని అన్నాడు. వెంటనే జయమ్మ, శ్రీదేవి మేడమీద గదిలో ఉందని, వెళ్ళి మాట్లాడమని చెప్పింది. రజనితో కలిసి ఆనంద్ మేడమీదకి వెళ్ళాడు.

లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నతరువాత, "రేపు మా బేబీ పుట్టినరోజు. మా యింట్లో ఒక పార్టీ ఏర్పాటుచేస్తున్నాం. మీరు ఒక అరగంటసేపు వీణ వాయిస్తారేమోనని అడుగుదామని వచ్చాను. మీ వాయిద్యం వినాలని కోరికగా ఉంది" అన్నాడు ఆనంద్.

"ఓ ! తప్పకుండా వాయిస్తాను" అంది శ్రీదేవి. అతనంత మర్యాదగా అడుగుతూంటే, తనేకాదు; ఎవరూ కాదనలేరనిపించింది శ్రీదేవికి. అంతేకాక అతను, తమ కుటుంబానికి ఎన్నో విధాల సాయం చెయ్యడమే గాని, ప్రతిఫలం తీసుకోటం లేదు. అటువంటి వ్యక్తి అడగడమే తన భాగ్య మనుకొంది.

మరునాడు మూడు గంటలకు బయల్దేరి డాక్టర్‌రాజుగారింటికి వెళ్ళింది శ్రీదేవి. హేమలత ఆమెను మేడమీదకు తీసుకువెళ్ళింది. రజని ప్రొద్దున్నే డాక్టర్‌ఆనంద్‌తో కలిసి వచ్చేశాడు. హేమలత ఆరోజు తలంటుపోసుకుని, రెండు జడలు వేసుకుంది. ఆమె మొహంలో ఒక కొత్తకాంతి తొంగి చూస్తోంది. సిల్కుచీర కట్టుకుంది. ఈ రెండేళ్ళలోనూ, తను మొదట చూసినప్పుడుకన్నా హేమలత కొద్దిగా పొడుగెదిగింది అనుకుంది శ్రీదేవి.

హేమలత తన గదిలోకి తీసుకెళ్ళి శ్రీదేవిని కూర్చోబెట్టింది. "మీతో చాలా ముఖ్యమైన విషయమొకటి మాట్లాడాలి. మళ్ళీ అందరూ వచ్చేస్తే వీలుండదు. అందుకని ఇప్పుడే చెప్పదల్చుకున్నాను" అంది.

"ఏమిటది ?"అని అడిగింది శ్రీదేవి. హేమలత ఏదో 'సీరియస్' విషయ మొకటి చెప్పబోతుందని అనుకుంది శ్రీదేవి.

"ఇవాళ నా కిష్టమైన పాటతో మీరు ప్రోగ్రాం ప్రారంభించాలి" అంది హేమలత; అతి ముఖ్యమైన విషయం చెప్తున్నట్లు. శ్రీదేవికి నవ్వు వచ్చింది. "ఇదేనా ముఖ్యమైన విషయం ?" అని అడిగింది.


"అవును. తప్పకుండా అలా చేస్తారా ?"

"అలాగే; ఇవాళ నీ పుట్టినరోజుకదా, అందుకని, నీ కోరిక మన్నించడమే ప్రధానము. అయితే ఏ పాటతో ప్రారంభించాలో నువ్వే చెప్పు. ఆ పాట నాకు వచ్చినదైతే వాయించడం సులభం."

"మీకు వచ్చినదే, 'పరాకేల సరస్వతి' అనే పాటతో ప్రారంభించాలి" అంది సంతోషంతో హేమలత.

"తప్పకుండా అలాగే" అంది శ్రీదేవి. ఇంతలో "హేపీ బర్త్‌డే టు యూ" అంటూ ఒక అరడజనుమంది కాలేజీ అమ్మాయిలు వచ్చి హేమలతను చుట్టు ముట్టేశారు. వారందరూ క్లాసుమేట్సు. ఆరోజు హేమలత చాలామందిని పిల్చింది. వారంతా మాట్లాడుతూంటే ఆ గదీ, మేడా, కదిలిపోతుందేమో నన్నంత ఉత్సాహంగా ఉన్నారు. వాళ్ళ నవ్వులూ, మాటలూ, ఛలోక్తులూ, చిన్నచిన్న పాటలూ, కాలేజీ—కుర్రాళ్ళమీద విమర్శలతో, వాతావరణమంతా నవ్వులమయమైపోయింది.

ఆనంద్, తన స్నేహితుల్నీ, తెలిసినవార్నీ చాలా మందిని—ముఖ్యంగా శ్రీదేవి—వీణ వినటానికి ఆహ్వానించాడు. నాలుగున్నర కాగానే, హాలులో అందర్నీ సమావేశపరచి, అందరికీ కాఫీ, ఫలహారం ఏర్పాటు చేశాడు. స్త్రీలంతా ఒకవైపునా, పురుషులంతా ఒకవైపునా కూర్చున్నారు. (సశేషం)



మార్చికి మార్చికి మధ్య

13 వ పేజీ తరువాయి

చులకన—చేయడం అన్యాయం. ఏ కోణంనుంచి చూసినా, పరీక్ష ఫేలవడం చాలా అవసరం. అసలు పరీక్ష క్షవరమైతే, తిరుపతి వెళ్ళొచ్చినంత పుణ్యం వస్తుంది'' అన్నారు గురూజీ.


''అవును గురూ! మనం ఎన్నిసార్లు ఫేలైతే అన్నిసార్లు పుటం వేసినట్లు విజ్ఞానం పరిశుద్ధి పొందుతుంది'' అని నేను గురూజీని బలపరచాను.

చందు నిర్జీవంగా లేచి మంచున్నాడు. ''నాకిప్పుడు డిగ్రీ చేతికి వచ్చిందని, అది చేతిలో పట్టుకుని గౌను వేయించుకుని దుర్యోధనుడిలా ఫోటో తీయించుకోగానే సరా! మీకున్న ఫౌండేషన్ నాకేది గురూ ?....'' అని వాపోయాడు.

''అవును. నిజమే ! ఎలాగ సందర్భం వచ్చింది కాబట్టి చెబుతాను. ఓ కథ వినండి....అనగా అనగా అజ్ఞాన్, విజ్ఞాన్ అని ఇద్దరు కవలలు ఉండేవారు. వాళ్ల తండ్రిగారి ఆదేశానుసారం అజ్ఞాన్ ఇంజనీరింగ్‌లో చేరి నాలుగేళ్ళ తిరిగేలోగా ఇంజనీరై మరో ఆరేళ్లలో పెద్ద ఇంజనీరైపోయాడు. ఇంతలో (పదేళ్లలో) విజ్ఞాన్ యం. బి. బి. యస్. డిగ్రీతో మెడికల్ కాలేజీనుంచి బయట పడ్డాడు. మరో రెండేళ్లతర్వాత ఒకరోజు దేశద్రోహం నేరం క్రింద అజ్ఞాన్ని పోలీసులు అరెస్టు చేశారు. దానికి కారణం అతను కట్టించిన ఒకవంతెన అకస్మాత్తుగా పడిపోడం. అందుకు కారణం నాలుగేళ్లలో ఇంజనీరైన మిడిమిడి జ్ఞానం. కానీ విజ్ఞాన్ మాత్రం గొప్ప డాక్టరయ్యాడు. చాలా గొప్ప డాక్టరని పెద్దపేరు సంపాదించుకున్నాడు. దానికి కారణం అతను పదేళ్ళపాటు పరిశ్రమచేసి మెడికల్ కాలేజీలో సంపాదించిన తరుగులేని విజ్ఞానం కాబట్టి దేశ సంక్షేమదృష్ట్యా చూసినా, పరీక్షలు ఫేలవడం చాలా అవసరం'' అని పెద్ద ఉపన్యాసం ఇచ్చారు గురూజీ.

గురూజీ చెప్పిన కథ విన్న పిమ్మట నాకు కూడా ఒక కథ జ్ఞాపకం వచ్చింది. ''చెప్పనా గురూ'' అనిగాను. ''చెప్పు'' అంటూ ''ఊఁ'' కొట్టడం ప్రారంభించారు గురూజీ.

''అనగా అనగా ఒక ఊళ్లో సహనకుమార్ అని ఒక యువకుడు హైస్కూలులో అనేకసార్లు చాలా పరీక్షలు ఫేలైనవాడై, చివరికి స్కూలు ఫైనల్‌లో కూడా తప్పి, కాలం వృథా చెయ్యక బజార్లలో తిరుగుతూ బోల్డంత ప్రపంచ జ్ఞానం సంపాదించాడు. అతను ఈ విధంగా ప్రపంచ జ్ఞానం కోసం పరీక్షలని త్యాగంచేస్తూ వచ్చాడు. కానీ అతనిలోఉన్న పిపాసని వాళ్ల నాన్న అర్థం చేసుకుని ఇలా లాభంలేదు; నీ దారి నువ్వు చూసుకో అన్నాడు. అంతట సహనకుమారుడు తన ప్రపంచ జ్ఞానాన్ని, పలుకుబడిని కొలుచుకుందామని కౌన్సిలర్ ఎలెక్షన్స్‌లో పోటీచేసి, ఎన్నికల పరీక్షలో కూడా ఫేలయ్యాడు. అయినా అతను పట్టిన పట్టు వదలకుండా వచ్చే ఎన్నికలలో ఎం. ఎల్. ఏ. గా పోటీ చేశాడు. అయితే అప్పుడు అతనిపై పోటీచేసిన మిగిలిన ఇద్దరు పెద్దమనుష్యులు అమాంతం వియ్యంకులయ్యారు. వాళ్ల మర్యాదకోసం ''మీరు పోటీ చెయ్యండి అంటే మీరు'' అనుకునేలోపులో



నామినేషన్ గడువు దాటిపోయింది. సహానకుమార్ ఏకగ్రీవంగా ఎం. ఎల్. ఏ.గా ఎన్నికయ్యాడు. విద్యావిషయంలో అతని అనుభవాన్ని పురస్కరించుకుని సర్కారువారు అతన్ని విద్యాశాఖా మంత్రిగా చేశారు. అతనంత ఉచ్ఛస్థితికి రావడానికి కారణం పరీక్ష ఫేలవడం. ఆ సమయంలో అతను పరీక్ష ఫేలవకుండా పాసయిఉంటే, మంత్రి అయ్యేవాడు కాడుకదా !" అని నేను కథ పూర్తి చేసేసరికి గురూజీ పొంగిపోయి తప్పట్లు కొట్టేశారు.

చందు మటుకు చలనంలేకుండా ఏదో ఆలోచిస్తున్నాడు. పాపం! పరీక్ష పాసయిపోయినందుకు బెంగపెట్టుకున్నాడేమో అన్పించింది నాకు.

"జరిగిందేదో జరిగిపోయింది. విచారించకు" అని గురూజీ ఓదార్చబోయారు.

"అదికాదు గురూ! మీరు ఇద్దరూ చెరొక చెప్పారు. నేనుకూడా ఒకటి చెప్పొద్దా" అని చందు.

"సరే చెప్పు" అన్నాం.

చెప్పడం ప్రారంభించాడు చందు.

"ప్రవీణ్ అనేఒక కుర్రా డుండేవాడు ... హైస్కూలు దశలోనే అనేకసార్లు ఫేలై అందరిచేత అనేక మెప్పులు బడశాడు. ఇంతలో యుక్త వయస్కు డయ్యాడు. "పెళ్లి చేద్దాం" అనుకున్నారు పెద్దలు. కాని కట్నం ధర ఎక్కువ పలకలేదు పరీక్ష పోయింది కాబట్టి. అ... అతనికి తీరని అవమానంగా తోచింది. వెంట... ఎవరికీ చెప్పకుండా రైలెక్కి చెన్నపట్నం చక్కా పోయాడు. తిన్నగా ఒక స్టూడియోకి వెళ్లాడు పని కావాలన్నాడు. "నీకు నటన వచ్చునా?" అ... అడిగారు. "నాట్యంకూడా రాద"న్నాడు. "కెమెరా వచ్చునా ?" అనడిగారు. "సౌండ్‌కూడా రాద"న్నాడు. "మ్యూజిక్ వచ్చునా ?" అని అడిగారు. "ఆర్ట్ కూడారాదు" అన్నాడు. "అయితే నువ్వు తప్పకుండా డైరక్టరవ్వాలి" అన్నారు. వెంటనే అతడిని దర్శకుణ్ణి చేసారు. తన స్వీయచరిత్రని కావలసినంత ట్రీట్‌మెంట్ ఇచ్చి సినిమా తీశాడు. బ్రహ్మాండమైన హిట్ అయింది. తరవాత అతనేది తీసినా తిరుగులేని బాణమైపోయింది. స్వల్పకాలంలో అతను ప్రొడ్యూసరై, రెండు స్టుడియోలని మూడుకార్లని, నాలుగు స్టార్లని కొనుక్కున్నాడు. అతనే కాని అప్పుడే కాని పరీక్ష పాసయిఉంటే, అం... గొప్పవాడయ్యేవాడుకాదుకదా!" అన్నాడుకథపూర్తిచేసి.

నేను చప్పట్లు కొట్టాను. గురూజీ మాత్రం లేచి నుంచున్నారు.

"కావాలంటే ఇటువంటి కథలు ఎన్నైనా చెప్పొచ్చు. కానీ, కబుర్లు చెపుతూ కూర్చుంటే లాభంలేదు. అసలు మన విద్యావిధానం ఇలా తేలిపోవడని ముఖ్యంకారణం ఏమిటో కనుక్కోవాలి" అన్నారు గురూజీ ఆవేశంతో మంచినీళ్లు త్రాగి.

"మరి మీ పరిశోధనల ఫలితం ఏమైంది గురూ ?" అనడిగాడు చందు.

నేను లోపలికి వెళ్లి, గురూజీ పరీక్షలమీద పరిశోధనలు చేసి, విద్యావిధానంమీద తయారుచేసిన ప్రయోగ ఫలితాల కాగితాలు తెచ్చాను.

మార్కికీమార్కికి మధ్య

అందులోంచి ఒక కాగితం తీసి చదవడం ప్రారంభించారు గురూజీ:

"ది ఎలివెన్ కాజెస్ ఫర్ ది డిజనరేషన్ ఆఫ్ అవర్ ఎడ్యుకేషన్:

1. తప్పించుకోలేక విద్యార్థి చదివితే—తప్పదు కాబట్టి చదువు చెబుతాడు గురువు.

2. అసలు చెప్పడానికి సరిగ్గా రాదు గురువుకి. చెప్పినా అర్థంకాదు శిష్యుడికి (అర్థం అయినా జ్ఞాపకం ఉండదు.)

3. చిన్నప్పటినుంచి సహవిద్య విద్యార్థులకి అలవాటులేదు కాబట్టి కాలేజీ వాతావరణంలో కొట్టొచ్చేటట్టు కన్పించే మార్పు ఉంటుంది.

4. విద్యార్థులలో కూడా క్రమశిక్షణ లోపించటం జరుగుతోంది.

5. సామెత చెప్పినట్టు కోటి విద్యలూ కూటి కోసమే! (విజ్ఞానం కోసం మాత్రంకాదు)

6. విద్యా—విధానంలో ముఖ్యంగా నిబంధనలు, నియమావళి విద్యార్థులకి అనుకూలంగా లేవు.

7. పూర్వకాలంలో విద్యార్థికి అర్హతలు వినయం, విధేయత; కానీ, ఇప్పుడు—కులం గోత్రం, సిఫార్సులు పలుకుబడీ.

8. విద్యార్థులు చదువుమీదకంటే ఇతర కార్యక్రమాలలో ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు.

9. యువక సహజమైన ప్రేమకి విద్యార్థులు లొంగిపోతున్నారు. (ఈ తప్పు ఎవరిదీకాదు)

10. ఈ విధంగా— ఎంత చెప్పకపోయినా, చెప్పినవి ఎంత వినకపోయినా, విద్యార్థికి కొంత విజ్ఞానం వచ్చితీరుతుంది. అతని విజ్ఞానాన్ని ఏ విధంగా తెలుసుకోవాలనేది ప్రస్తుత పరీక్షా విధానానికి తీరని సమస్య.

11. ఒకవేళ విద్యార్థి వచ్చివాడి పాసైనా, నిరుద్యోగం ఎదురవుతోంది కాబట్టి ఫెయిలవడం మంచిది."

గురూజీ—గొప్పతనానికి నేనూ, చందూ జోహార్లర్పించాం. ఇంత అఖండ మేధావి అజ్ఞాతంగా ఉండిపోవడం దేశానికి తీరని నష్టం అనిపించింది. గురూజీ—పరిశోధనలతోపాటు, వారి జీవిత చరిత్ర కూడా అచ్చువేయించి ప్రజలకి అందివ్వడం చాలా అవసరం అని తోచింది నాకు. అందుకే అడిగాను "గురూ.... నీ జీవితచరిత్ర ఒక్కసారి చెప్పి మమ్ము పావనంచెయ్యి" అని.

గురూజీ పొంగిపోలేదు కాని, చెప్పడం ప్రారంభించారు. చందు కలం, కాగితం తీసుకుని రాసకోడం మొదలుపెట్టాడు.

"నా జీవితంలో చాలా కాలం విద్యాభ్యాసంతో గడిచింది. క్లుప్తంగా చెపుతాను వినండి.

అసలు నాకు ఈస్టిండియా కంపెనీ రోజుల్లో అక్షరాభ్యాసం జరిగింది. అప్పటినుంచి నాకు జ్ఞానం వచ్చేవరకూ మా నాన్న నా సాశాలన్నీ చదివి, ఏదో కిందామీదాపడి నన్ను స్కూల్ ఫైనల్ వరకు తీసుకువచ్చాడు.

నేను స్కూల్ ఫైనల్లో ఉండగా ఒకరోజు మా ఊళ్లో ఉన్న రావి చెట్టుదగ్గర కూర్చున్నప్పుడు నాకు జ్ఞానోదయం అయింది. అప్పటినుంచి తిరిగ్గా, తాపీగా విద్యాభ్యాసం చేస్తున్నాను. పరిశెట్టి పాలు త్రాగేకంటే నిలబడి నీళ్ళు త్రాగడం

తరువాయి:

ఈ విధంగా నేను నిండుకుండ తొణకదన్నట్లు నడుస్తుండగా బోర్డువారు నా ఎస్. ఎస్. ఎల్. సి. రిజిస్టర్లో పేజీలన్నీ నిండుకున్నాయన్నారు. అప్పుడు మెట్రిక్యులేషన్ ప్రారంభించాను.

కానీ, నేను ఆ సంగతి పూర్తిగా అంతు చూడ

మార్చికిమార్చికి మధ్య

కుండానే, మా బామ్మ దేవుణ్ణి ప్రార్థించి నన్ను పాస్ చేయించింది.

పట్నం పంపించి, నన్ను కాలేజీలో చేర్పించారు. కొన్నాళ్లకి ఆ కాలేజీవాళ్లు నాకు నమస్కరించి

"అయ్యా! మీకు మేం విద్యనేర్పగల సమర్థులం కాదు. క్షమించండి" అన్నారు. "సరే" అని వాళ్లని క్షమించి మరో కాలేజీకి వెళ్లాను. వాళ్లని కూడా క్షమించవలసివచ్చింది. ఈ విధంగా అశ్వమేధయాగం చేసి నట్లు ఆంధ్రప్రదేశ్ అంతా పర్యటించాను.

ఇది ఇట్లుండ—మా ఊళ్లో కాలేజీ స్థాపిం

వారు. నా చిన్నప్పటి క్లాస్‌మేట్ ఒకడు అక్కడ ప్రిన్సిపాల్ అయ్యాడు. కాలేజీ అంతా నా చేతిలో పెట్టి, దీవించమన్నాడు; దీవించాను. నేను కూడా అక్కడ చేరాను. పాపం! వాడు చాలా సంబర—పడి పోయాడు. ఆ రోజుల్లో ఇంటర్మీడియట్‌ని ఎఫ్. ఏ. అనేవారు.

ఇంతలో హిట్లర్—యుద్ధం ప్రారంభమైంది. నా చదువయితే పూర్తయింది కాని, పరీక్షలు మాత్రం మిగిలిపోయాయి. ప్రపంచయుద్ధం ముగిసింది. అప్పటికి నా దండయాత్రలు మొత్తం శరవయ్యొకటి. అందుకనే ఆ రోజుల్లో కొందరు నన్ను ముద్దుగా 'ఘజనీ మహమ్మద్' అని పిలిచే వారు.

తర్వాత మనకి స్వాతంత్ర్యం వచ్చింది. ఆ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఖైదీలని విడుదలజేశారు. విశ్వవిద్యాలయంవారు నాలాంటి మహారాజ పోషకు లని పనిగట్టుకుని మరీ పాస్‌చేశారు.

నా కేం చెయ్యాలో తోచలేదు. నా ఓర్పు, నేర్పుని, దేశసేవా పిపాసను అర్థం చేసుకున్న మిత్రుడొకడు నన్ను డాక్టరీ చదివి లోక—కళ్యాణం చెయ్యమన్నాడు. ఆ రోజుల్లో సెనేట్, సిండికేట్ మెంబర్లంతా ఒక ప్పుడు నాకు జ్యూనియర్లే కాబట్టి ఏదో ఏర్పాటు చేసి నాకు మెడికల్ కాలేజీలో సీటు ఏర్పాటు చేశారు.

ఆ రోజుల్లో నేను ఇంగ్లీషులో మాట్లాడితే మహామహా పండితులుకూడా అందులో గ్రామర్ కోసం వెదికి విఫలుల య్యేవారు. ఇది జరిగి సుమారు పుష్కరం అయింది. అప్పటినుంచి ఓపిగ్గా వైద్య విద్య అభ్యసిస్తున్నా' అని గురూజీ మధ్యలో ఆపి సిగరెట్టు వెలిగించారు.

నేను ఆశ్చర్యం పట్టలేక "ఐతే గురూ !.... ఇప్పుడు మీరు మెడికల్ స్టూడెంటా ? !" అని అడిగాను.

"మరే" అన్నారు గురూజీ సిగ్గుపడబోయి గర్విస్తూ.

చందూ మూర్ఛపోయాడు. కాస్సేపయ్యాక వాడే లేచి, "గూరూ ! మీ జీవిత చరిత్ర విశ్వవిద్యా లయంవారు తమ స్వంత ఖర్చులమీద అచ్చు వేయించు కోవాలి" అని చెప్పి మళ్లీ మూర్ఛ పోయాడు.

నేను కూడా కాసేపు అలాగే అచేతనంగా ఉండి పోయాను. తర్వాత ఏమనాలో తెలియక, "సయం గురూ! కొంపదీసి మీ రిది పాసయిపోలేదు.... లేక పోతే...." అనబోతుంటే—

"ఎందుకు పాసవుతాను" అని నన్ను కోప్పడి, "నేను ఎప్పుడు పరీక్షకి వెళ్లినా పరీక్షాధికారు లంతా నా ఫెయిల్యూర్‌ని ఏకగ్రీవంగా ఆమోదించే వారు. కాని వారిలో ఓపిక నశిస్తోంది. పైగా 'నేషనల్ ఎమర్జన్సీ' కాబట్టి నే నీమారు పాసయి పోవచ్చు" అన్నారు గురూజీ గద్గద స్వరంతో ! నాకే కాకుండా, వారికి కూడా కళ్లలో నీళ్లు తిరిగాయి.

"గురూ ! మీలాంటి మేధావులెందరో ఇలాగే అజ్ఞాతంగా ఎక్కడో చాలామంది ఉండేఉంటారు. సయం వాళ్లని కూడా వెలుగులోకి తీసుకువచ్చి దేశాన్ని ఉద్ధరించాలి" అన్నాను నేను దేశసేవకోసం కంకణం కట్టుకుంటూ.

అప్పటికి చందు పూర్తిగా కోలుకున్నాడు. కళ్లు తెరిచాడు. "నే నెక్కడున్నాను ?" అనడిగాడు

కినిమాలోలా.

"ఇక్కడే" అన్నాను.

వాడు మూర్ఛపోయిన తర్వాత జరిగిన కథ అంతా చదివి వినిపించాను.

"అయితే మనం గురాజీ నాయకత్వంలో ఒక ఉద్యమం లేవదియ్యాలి. 'పరీక్ష తప్పిన పట్టభద్రుల పరిషత్' ఏర్పాటుచేసి తోటి సోదరుల ప్రతిభని దేశదేశాల చాటాలి. లెండి! లెండి! పరిగెట్టండి! పదండి ముందుకు! పదండి ముందుకు తోసుకోకుండా 'క్యూ'లో— వాతో యువక రక్తం

పొంగుతోంది. నా హృదయమూనె సలసలా కాగుతోంది" అని గట్టిగా అరిచాడు చందు.

గురాజీ చందూకి గ్లాసెడు మంచినీళ్లిచ్చి ఉపశమింప చేశారు.

"ఇలా ఆవేశపడితే లాభంలేదు. నిదానంగా కూర్చుని నిర్మాణ కార్యక్రమం ఆలోచించాలి" అన్నారు గురాజీ.

"అయితే పరీక్షతప్పిన పట్టభద్రుల పరిషత్ ఇప్పుడే స్థాపిద్దాం" అన్నాడు చందు.

"అవును 'సప్లిమెంటరీ స్టూడెంట్స్ అసోసియేషన్' స్థాపించి, కొన్ని నియమాలు, నిబంధనలు ఏర్పాటుచేసి మెంబర్లని చేర్చుకుందాం" అన్నాను నేను కార్యరంగంలోకి దూకుతూ.

"ఈ పరిషత్‌లో సభ్యులవ్వాలంటే— అభ్యర్థి ప్రస్తుతం ఏదో ఒక పరీక్ష ఫెయిలయి ఉండాలి" అన్నారు గురాజీ.

చందు సిరసించిపోయాడు. నేను ధైర్యంచెప్పాను: 'ఫర్వాలేదులే, నువ్వు హిందీపరీక్షకి కట్టి ఫెయిలయి ఇందులో చేరవచ్చు" అని. దాంతో వాడు సర్దుకున్నాడు.

"సమితిలో సభ్యత్వం కాపాడుకోవాలంటే— అభ్యర్థి ప్రతీ మార్చి, సెప్టెంబరులో తన 'ఫెయిల్యూర్' రెన్యూ చేయించుకోవాలి" అన్నారు గురాజీ గంభీరంగా.

"ఇది నిబంధన నెంబర్ టూ" అన్నాను.

"సరే" అన్నాడు చందు.

"అంతే; ఈ మాత్రం నిబంధనలు చాలు; ఇక కార్యక్రమం ఆలోచించాలి" అన్నారు గురాజీ.

"అయితే మొట్టమొదటిది:— ఇకమీదట ఫెయిలయినవారి నెంబర్లే పేపర్లో ప్రకటించాలి" అన్నాడు చందు.

"అంతే కాకుండా పరీక్ష రుసుములు ఒకేసారి టోకుగా, వీలయితే స్థిరాస్తి రూపంగా పుచ్చుకోవాలి. ఒక ఎకరం మాగాణి రాసి యిచ్చాం అనుకోండి! దానిమీద వచ్చే పాలు ఆదాయం పరీక్ష రుసుముగా వాళ్ళే జమకట్టుకోవాలి" అన్నాను నేను.

"అలా అయితే లాభంలేదు. ఈ ఉద్యమం బాదాస యజ్ఞాన్ని మించిపోతుంది" అన్నారు గురాజీ.

"పోనీ— ఎక్జామినేషన్—నెంబరు ఎవరికైనా చెప్పేందుకు వీలుగా జ్ఞాపకం ఉండేందుకు మనకి నచ్చిన నెంబరే రిజర్వుచేసుకునే ఏర్పాటు చెయ్యాలి" అన్నాడు చందు.

"అప్పో! ఇదీ లాభంలేదు. తీరా మనం ఈ ఏర్పాటు చేశాక, కొంతమంది స్వార్థపరులు లక్కీ నెంబర్లు రిజర్వు చేయించుకుని పాసయిపోయి మన పరిషత్‌కి ద్రోహం చెయ్యవచ్చు" అని కొట్టిపారేశారు గురాజీ.

నేను మరికొన్ని చెప్పుదామనుకున్నాను కానీ, గురాజీ ఏమంటారో అని సందేహించాను.

చందు ఏం చెయ్యాలో తెలియక బుర్ర గోక్కున్నాడు.

చివరికి గురాజీ "సభ్యులంతా కూర్చుని ఆలోచిస్తే, అవసరమైనవి చాలా ఎదురవుతాయి కాబట్టి ముందు మనం బయల్దేరి ఊరూరా తిరిగి మన 'పరీక్ష తప్పిన పట్టభద్రుల పరిషత్‌లో మెంబర్లని చేర్పించాలి" అని లేచి నుంచున్నారు.

చందు అనుసరించాడు.

నేను కూడా "సరే" అని బయల్దేరాను. మా ప్రవాసంతో మీ ఊరుకూడా వచ్చి మిమ్మల్ని తప్పకుండా కలుసుకుంటాం. ఉంటాను మరి. సెలవు! ★

పుత్రకామాది వ్రతనిష్ఠ జరుపుచు స్వాధ్యాయ ప్రవచనము జరుపవలయునని వేదము చెప్పుచున్నది. ధర్మపత్నితో నియతిరతి చేయుచు స్వాధ్యాయ ప్రవచనము జరుపవలయునని బోధించుచున్నది. వంశాభివృద్ధి కొరకు పుత్రులకు వివాహాదికము చేయుచు స్వాధ్యాయ ప్రవచనము జరుపవలయునని విధించుచున్నది. మరియు ఓరీ ! సుదామ ! అహంకార మనెడి వృక్షము నశింపజేయవలయునురా ! పర్వత శిఖరమువలె శ్రేష్ఠమైన కీర్తిని ఆర్జించవలయునురా ! ఊర్ధ్వపవిత్రుడవు కావలయునురా ! నేను గురువును. నిన్నిట్లను శాసించుచున్నాను. నీవు పెండ్లియగుము. ప్రజాతంతువునకు భంగము కలుగనీయకుము. నేను నీ వేదాధ్యయనమెల్ల గరపితిని. మరియు నిట్లనుశాసించుచున్నాను.

"సత్యంవద
ధర్మంచర
స్వాధ్యాయాన్మా ప్రమదః
ఆచార్యాయ ప్రియం ధన మాహృత్య
ప్రజాతంతుం మావ్య వచ్ఛేద్సీః"

"ప్రజాతంతుః మావ్య వచ్ఛేత్సీః" అన్న మాటలను ఆచార్యుడు మేఘ గంభీర నిర్ఘోషముగ నుచ్చరించెను.

మరియు ఆయన సుదాముని విట్లను శాసించెను. "ఓయీ ! సుదామ ! సత్యమునుండి ఎప్పుడు తప్పిపోకుము. ధర్మమునుండి ప్రమదితుడవు కాకుము. కుశల కార్యముల నెప్పుడును ఏమరకుము" అని అంతలో వేద మంత్రముల నవలంభించి "భూత్యై న ప్రమది తవ్యం, స్వాధ్యాయ ప్రవచనాభ్యాం న ప్రమదితవ్యం, దేవపితృ కార్యాభ్యాం న ప్రమదితవ్యం" అన్న అనుశాసనమును బోధించెను.

హరివంశము

8-వ పేజీ తరువాయి

మరియు నిట్లు బోధించెను. "వత్స ! సుదామ ! తల్లి దైవమని ఎరుగుము. తండ్రి దైవమని తెలియుము. ఆచార్యుని భగవంతునిగా గనుము. అతిథిని భగవంతునిగా పూజించుము. ఏ కర్మలు అనవద్యములో ఆ కర్మల నాచరింపుము. ఇతరముల నారాధించకుము. మేము చేయు కర్మలలో నేవి సుచరితములో వాని నుపాసించుము. ఇతరముల నారాధింపకుము. శ్రద్ధతోడి, శ్రియముతోడి, హ్రీయముతోడి, సంవిత్తుతోడి దానమును చేయుము. కర్మ విషయమున గాని, వృత్తి విషయమున గాని, విచికిత్స కలిగిన యెడల విమర్శనా వేత్తలు, యుక్తులు ఆయుక్తులు, అలూక్షులు, ధర్మకాములు నయిన బ్రాహ్మణులు ఎట్లు ప్రవర్తింతురో అట్లు నీవును నట్టియెడల ప్రవర్తింపుము. లోకమునం దఖ్యాతులయిన జనముండుట యున్నది. లోకముచేత నట్లఖ్యాతులుగా తలంపబడువా రుందురు. వారియందు సంమర్శినులు, యుక్తులు, ఆయుక్తులు, అలూక్షులు, ధర్మకాములు నయిన బ్రహ్మణులెట్లు వర్తింతురో. నీవును అట్లు వర్తింపుము. ఓయి సుదామ ! ఇది ఆదేశము. ఇది ఉపదేశము. ఇది వేదము చెప్పిన మార్గము. ఇది అనుశాసనము. ఇది ఉపాసింప దగినది."

అని ఆయన యూగెను. సుదాముని ప్రేమతోడి కన్నులతో, ఆదరముతోడి కన్నులతో తిలకించెను. ఇది ఏదో ఒక ఋషి మరియొక ఋషికి, ఋషి కావుట కర్హుడైన వానికి చేయు నుపదేశమువలె నున్నది. వేదపురుషుడు సాకారుడై దక్షమైన ఉచ్చారణతో తానేమో అక్షర ప్రపంచము నుపన్యసించుచున్నట్లు లున్నది. సుదాముడు మంత్రముగ్ధుడై నట్లు కిం కర్తవ్యతామూఢుడై నిలబడిపోయెను. ఎప్పుడు శ్రీకృష్ణదేవు డచ్చటికి వచ్చెనో, ఎప్పుడు మాటాడెనో యెవ్వరును గమనించలేదు. అందరును సాందీపనియందు, సుదామునియందు మాత్రమే ప్రసరించుచున్న దృష్టి గలవారై యుండిపోయిరి.

"ఆచార్య ! సుదామ !"

ఆ కంఠీప వేణువు లూదినట్లున్నది.

అందరును నటు చూచిరి. ఆచార్య సాందీపని మందహాసములు కన్నులయందు నిబిడముగా శ్రీకృష్ణుని తిలకించెను. భగవంతు డిట్లనెను.

"ఆచార్య సుదామ ! తామేల కాశికి పోవలయును. కాశికలో నిప్పుడేమున్నది. అచట గోంద్రకుని రాజ్యము సాగుచున్నది. దివోదాసుని రాజ్యమునందు వలె దేవత లచ్చటినుండి పూడని జారిరి. ఆచార్య సాందీపనినే కాదన్న యా రాజు నిన్ను గౌరవించునా ? వాది ఒక్క మనవి. నాకు ఒక చెల్లె లున్నది. వరునకట్టులు ? దానిపేరు వామాక్షి. దాని నీ కిచ్చి పెండ్లి చేతుము. ఈ బ్రహ్మచర్యమును వదలుము. గార్హపత్యమున ప్రవేశించుము. ఎచ్చట యానంద మున్నదో కాశికయు అచ్చటనే యున్నది. గార్హపత్యమునకన్న యానందమింకొకతావున యుండదని పెద్దలందురు. వారి మాటను పాలించుట గదా, ధర్మము నాచరించుట.... " అని ఆయన మెల్లన హసించెను.

సుదాముడు మరి మాటాడలేకపోయెను. ★



రాజధాని కబుర్లు

9—పేజీ తరువాయి

ప్రభుత్వంవారు, మేము మాత్రం తక్కువా అన్నట్టు, వారూ విజృంభించారు. అదనపు భూమి శిస్తు చట్టాన్ని అమలులోకి తెచ్చారు. అసలు శిస్తు కట్టటానికే ఓపిక లేక నానా అవస్థలు పడుతుంటే, నూటికి నూరుపాళ్లు ఎక్కువ వసూలు చేయటం మొదలుపెట్టారు. రవాణా సౌకర్యాలు యేమైనా ఉన్నాయేమో అన్నట్లు మోటారు బండ్లమీద పన్నులు విధించటానికి ఉద్యుక్తులయ్యారు. తర్వాత అమ్మకం—పన్ను సవరిస్తారట. పేరు అమ్మకం పన్ను గాని, యిచ్చేది కొనే వాళ్లేగా! గృహనిర్మాణ సహకార సంఘాలు, నగరం నిండా ఏర్పడ్డాయి. కొత్త కొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వంవారు అప్పులిచ్చి ఇళ్లు కట్టిస్తున్నారు. అయితే ఈమధ్యన హఠాత్తుగా, ఈ అప్పు లివ్వటం మానేశారు. ఇళ్లు నిలిచి పోయినాయి! దీనికి కారణ మేమిటో ఎవరికీ ఇదమిత్థంగా తెలిసినట్లు కనబడదు. ఒవేళ తెలిసినా చెప్పరు. ఊహాగానాలే ఎక్కువ. మేము ఇళ్లు కట్టుకుంటాం, అప్పు యివ్వమంటే యివ్వరు. ఖాళీ స్థలాలమీద మాత్రం పన్నులు విధిస్తారట! ఈ న్యాయం చూడండి!

ఇవన్నీ ఇట్లా ఉండగా, యింకో కొత్త పథకం సృష్టించబోతున్నారు. ఇది కేంద్రంవారి మెదడులో ఉత్పత్తి అయిందే! నిర్బంధపు పొదుపు పథకంట! తప్పనిసరిగా ప్రతి వ్యక్తి, వచ్చే ఆదాయంలో (మిగిలేదానిలో కాదు) కొంతవరకు దాచుకుని తీరాల్సిందేట! అయిదేళ్లు ఈ విధంగా కూడబెట్టిన తర్వాత దాని వినియోగం పొందే హక్కు ఏర్పడుతుందట! ఇవీ, మనవాళ్ల దృక్పథాలు! ఏదైనా గట్టిగా అంటే, ఈ అత్యవసర పరిస్థితిలో మనం ఎంతో త్యాగం చెయ్యాలని ఉద్బోధిస్తారు. నిజమే; దాని కెవ్వరూ కాదనరు. అయితే న్నాళ్లూ, మనం చేసిందేమిటీ త్యాగమేగా! తెల్లవాళ్లతో పోరు పెట్టుకున్నాళ్లు త్యాగం సంటే యింకో మాట లేదుకదా! నల్లవాళ్ల ప్రభుత్వంలోకి వచ్చారు మరి ఈ పదిహేనేళ్లబట్టి, ప్రజల్ని ఎకధాటిగా త్యాగం చేస్తూనే వచ్చారు. ఇప్పుడు ప్రత్యేకంగా ఆ మాట పదేపదే చెప్పాలిసిన అవసరమేమీ కనిపించదు. డబ్బు కావాలన్నమాట ఎంత వాస్తవమైనా, కాస్త తర తమ భేదా లుండాలి గావి, క్రుంగి కృశించిపోతున్న బీదా బిక్కి, మధ్య తరగతి జనంమీదే ఈ భారం యెక్కువ మోపితే, వాళ్లు లేచేదెట్లా! నిటారుగా నిలబడేదెట్లా! ఈ పన్నుల వలయంలో చిక్కుకుని, మతిపోయి, గతి తప్పి, బొంగరంలాగ తిరుగుతూ ఆలోచించుకొంటుంటే, స్వాతంత్ర్యోద్యమంలో మనం చేసిన ఉద్బోధ ఒకటి జ్ఞాపకం వస్తోంది. రాధీనంలో మృష్టాన్నాలు ఆరగించేదానికన్నా, స్వతంత్ర రాజ్యంలో 'స్వేచ్ఛా వాయువులు' పీల్చుకుంటూ, బ్రతకటమే గౌరవం. ఈ మాట అక్షరాలా సార్థకమయిందని అనిపిస్తుంది.

ఐ. ఎల్. ఎన్. ★

న్యూఢిల్లీ లేఖ

7-వ పేజీతరువాయి

తీసేసినా ఎవ్వరూ ముక్కుమీదవేలేసుకో నక్కర్లేదు. పైగా ఈ పథకం పెట్టటంవల్ల లోగడ అమల్లో ఉన్న కొద్ది మొత్తాల పొదుపు పథకం అనుకున్నంతగా జయప్రదం కాలేదని పరోక్షంగా—ఒప్పుకున్నట్లయింది.

చైనా దురాక్రమణ జరిపిన తరవాత కూడా మన రక్షణశాఖ పెద్దగా అభివృద్ధి సాధించలేదని 'లాబీ' వర్గాల వార్తలు. కొత్తగా ఏర్పడ్డ రక్షణ ఆర్థిక సహకార శాఖ కార్యకలాపాలు దురాక్రమణ రీతిలో ఉన్నట్లు మంత్రివర్గాలు భావిస్తున్నాయిట. అసలు ఈశాఖలు పెట్టింది దీనితో పరస్పర సహకారానికి ! పైగా ఈ శాఖకు ఇతర శాఖలు పత్తాగాకుండా వచ్చేపని ఉంది ! ఈ విషయంలో శ్రీ టి. టి. కృష్ణమాచారి గోప్యంగా ఏదీ ఉంచలేదు.

భారతదేశం కెనడా మాజీ హైకమీషనరు, ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడుగా ఉన్న శ్రీ యెస్కాట్ రీడ్ ఏప్రియల్ 30 మే 1 లలో ఇక్కడ జరుగబోయే ప్రపంచ బ్యాంకు మండలి సమావేశం ఏర్పాట్లకుగాను ఇక్కడికి వచ్చారు. ఆయన ఇక్కడికి రాగానే, రక్షణాభివృద్ధికిగాను ప్రణాళికను తగ్గించుకోకపోవటాన్ని సమర్థిస్తూ ప్రణాళికా సంఘం ఆయన్ని పూదరగొట్టేసింది. కాని కాసంత కూడా ఉపయోగించలా.

ఒక్క మాటలో చెప్పాలంటే మన ప్రభుత్వానికి ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించుకోటానికి ఇష్టంలేదు. పోనీ రక్షణ చర్యలకు సంబంధించని వాటిని కొంత తగ్గించుకోటానికి మన సొప్పటంలేదు. ఇప్పుడున్న ఆదాయమార్గాల్లో ఇంకా ఎక్కువ ధనం సంపాదించేట్లుగా పన్ను వసూలు శాఖను మారుస్తూ వరిస్తున్నదా అంటే అదీ లేదు. పైగా ఇప్పటి పన్నుల ద్వారా అధిక రాబడి మార్గాలు సూచించినా, పన్ను లెక్కువని ఎవరన్నా అంటే వాళ్లంతా దేశభక్తులు కానట్లు హంగామా చేస్తుంది.

మహాత్మాగాంధి ఆదర్శాలు, ఆశయాలు, ఆయన ప్రవచనాలను గూర్చి ఏ కరువు పెట్టటం మన నాయకులకు పరిపాటై పోయింది. ఆయన బోధనలు, ఆశయాలు, మద్యనిషేధం, ఖద్దరు ధారణం మాత్రమే కాదు. సహాయ, ఉపమంత్రుల సంఖ్య పెంచుతూ మంత్రివర్గాన్ని విస్తృతం చేయటంవల్ల కూడా ఆయన వ్యతిరేకి. మూక ఉమ్మడిగా పారిశ్రామికం చేయటమంటే ఆయన బద్ధ విరోధి. సత్యం, అహింసలనే తన విశ్వాసాల కోసం ఆయన ఆత్మబలిదానం చేశారు. గరిష్ఠ వేతనం నెలసరి రు. 500/— గా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన కరాచీ తీర్మానానికి అండగా నిలిచిన వ్యక్తి ఆయనే. అందువల్ల ప్రతిపక్షాలను బుట్టలో వేసుకునే మంత్రంగా మాటిమాటికి 'మహాత్మాగాంధి' పదాన్ని ఉపయోగించటం మానటం మంచిది. అనుసరణం అనేది మనస్ఫూర్తిగా, సర్వథా అనుకరణంగాని, ఏ కొంచెమో అనుసరించటం గాదు. ★

ఆంధ్రసచిత్రవార పత్రిక

ముఖచిత్రం పోటీ!

బహుమతి రు 300

ముఖచిత్రంలో కొత్తదనం కల్పించేందుకని పై పోటీ నిర్వహించదలిచాము. చిత్రకారులు మాతో సహకరించి పై పోటీ జయప్రదంగా జరిగేట్లు చేస్తారని ఆశిస్తున్నాము.

నిబంధనలు:

- చిత్రం వర్ణచిత్రమై ఉండాలి.
- చిత్రం సుమారు 20×28 సెంటిమీటర్ల సైజుకి సరిపోయేట్లు ఉండాలి కాని, చిత్రపటాలు 40×56 సెం. మీ. ను మించి ఉండరాదు.
- చిత్రాలు కాగితం మీదనే వేయాలి, కాన్వాస్‌లు మొదలయినవి స్వీకరించబడవు.
- చిత్రం వస్తువు ఏదయినా ఉండవచ్చు కాని, 1. వ్యంగ్య చిత్రాలయితే మంచిది; 2. ప్రబంధ సుందరీ మణుల చిత్రాలు మొదలయినవి పంపవద్దని ప్రార్థన; 3. ప్రాచీన శిల్పాలకు నకళ్లు కాకుంటే మంచిది.
- చిత్రంమీద చిత్రకారుని పేరు తప్ప వేరే ఏదీ వ్రాసి పంపరాదు.
- చిత్రాలు 'సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1'కి 30-4-'63 లోపల మాకు అందేట్లు పంపాలి.
- చిత్రాలు తిప్పిపంపగోరేవారు తిరుగుమాత్రం తపాలా బిళ్లలు జతపరచి పంపాలి.
- పోటీ తుది నిర్ణయం సంపాదకునిదే. ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.
- పోటీలో బహుమతి పొందని చిత్రాలు కొన్ని మామూలుగా వాడుకోవచ్చు.
- ఫలితాలు 24-5-'63 సంచికలో తెలియజేస్తాము.

[పాఠకుల కోరికపై ఈ శీర్షిక తిరిగి ప్రారంభిస్తున్నాము. కాని మొదటి బహుమతి, రెండవ బహుమతి వేరు వేరుగా లేకుండా అన్ని కథలకూ రూ 7-50 ఇవ్వదలిచాము. తక్కిన నిబంధనలు ఎప్పటివలెనే!
సం॥]

మరపురాని సంఘటన

మద్రాసులో నేను చదువుకునే రోజుల్లో కుమారి అని నాకు ఒక స్నేహితురాలు ఉండేది. మా ఇద్దరి ఇళ్లూ చాలా దగ్గరిగా ఉన్న కారణంగా, మా ఇళ్ల మధ్య రాకపోకలు ఎక్కువగా ఉండేవి. ఆరోజు ఆదివారం. ఏమీ తోచక ఇంట్లో కాలు గాలిన పిల్లిలా తిరుగుతున్నాను. అది చూచి, మా అమ్మ "అంతగా తోచకపోతే కుమారి—వాళ్ల ఇంటికి వెళ్లరాదటే ?" అన్నారు. మనస్సులో నాకూ అదే ఉద్దేశం ఉన్నా, మిట్టమధ్యాహ్నంవేళా వాళ్ల ఇంటికి వెళతావంటే అమ్మ ఏమంటారో అని జడుస్తున్న నాకు అమ్మ — మాటలు అమృత ప్రాయంగా తోచాయి.

వెంటనే బయలుదేరి 5 నిమిషాల్లో కుమారి వాళ్ల ఇల్లు చేరుకున్నాను. ఇల్లంతా నిశ్శబ్దముగా ఉంది. బయటికి వెళ్లారేమోనని అనుకొందా మంటే, ఇంటికి తాళంవేసి లేదు ! పోనీలే ! నిద్రపోయారేమో లేపడ మెందుకని వెనక్కి తిరిగి వెళ్లపోబోతుంటే, వాళ్ల ఇంటిగలవారమ్మాయి ఎదురువచ్చి "వాళ్లందరూ ఏదో సినిమాకి వెళ్లారు. కుమారి మాత్రం, తలుపు దగ్గిరగా వేసి, పుస్తకం చదువుకుంటోందని" చెప్పి పిలుస్తానంటూ, గబ గబా వెళ్లి తలుపు తీసేమని వెనక్కి తోసేసింది.

కథ కాని కథ

అంతే ! గుమ్మంలో ఆగిపోయి "కుమారి ఇక మనకి దక్కదండీ !" అంటూ ఏడుపు ప్రారంభించింది. కంగారుగా కుమారి—గదికి దగ్గరగా వెళ్లి చూడగానే నా గుండె ఆగిపోయింది. లోపల గుండె మీద పుస్తకం పెట్టుకొని నిశ్చింతగా నిద్రపోతోంది. ఎక్కడనుంచి వచ్చిందో ఏమో పెద్ద పామొకటి గుండ్రంగా చుట్టుకొని కుమారి — కాళ్లదగ్గర పడుకొని ఉంది. ఏమి చెయ్యాలో తోచక, మేము చేస్తున్న గడబిడకి మెలుకువ వచ్చి మెల్లిగా కళ్లు తెరిచింది కుమారి.

కాళ్లదగ్గర ఉన్న పన్నగాన్ని చూచి భయంతో వణికిపోవడం మొదలుపెట్టింది కుమారి. అంతలోనే ధైర్యం తెచ్చుకొని ఎలాగో ఒకలాగ బయట పడి, తలుపు గొళ్ళెం పెట్టేసింది. ఇంతలో ఇంటివారు ఎవరినో తీసికొని రావడం, వాళ్లు పామును చంపేయడం జరిగింది. మరుపురాని ఈ సంఘటన తల్చుకున్నప్పుడల్లా మేము భయంతో కంపించి పోతాము. రచన : 'హేమ'.

* * *

రామానుజం

నాలుగైదు సంవత్సరాల క్రితం మా ఊరిలో బాగా చదువుకొన్న ఆచార్యులుగా రొకరుండేవారు— పాపం! అవసానదశలో ఆయనకు కంటిచూపు పూర్తిగా పోయింది. సాయంకాలం మా ఊరి పెద్దలంతా కాలువ-గట్టు దగ్గర చేరి లోకాభిరామాయణం మాట్లాడుకోవడం అలవాటు. మన ఆచార్యులుగారు, ఆయన మనుమడు రామానుజం అనే కుర్రవాణ్ణి వెంటబెట్టుకొని కాలువ-గట్టుకు వస్తూండే వారు. చీకటిపడిన తరువాత రామానుజం ఆ ముసలాయన్ని జాగ్రత్తగా ఇంటికి తీసికొని వెళ్తూండేవాడు.

ఒకరోజున నేను హైస్కూలు నుండి వస్తున్నాను. కాలువ-గట్టు దగ్గిర కూర్చున్న పెద్దలంతా లేచారు. మన ఆచార్యులుగారు "రామానుజం! రామానుజం" అని పిలిచారు. సమయానికి ఆ కుర్రవాడు దగ్గిర లేడు. అప్పుడు "రండి, నేను తీసుకుని వెళ్తాను" అన్నాను. "ఏం బాబూ! నువ్వు మా రామానుజానివి కావా?" అన్నారు. "కాదండీ! నేను రామం మేస్టారు తమ్ముణ్ణండీ," అన్నాను. "కాదంటా వేమిటబ్బాయ్! మా రామానుజానివి కాకపోయినా నువ్వు రామానుజుడివే. పద, వెళ్దాం" అన్నారు. ఆయన వాక్చాతుర్యానికి నేను చాలా సంతోషించినాను.

కె. సూర్యనారాయణ (అగ్రహార—గోపవరం).

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7, Thambuchetty Street Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



తిలకం రాజకుమారి